fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 79 | విజయవాడ, గురువారం 22 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

11 మంది గోగూండాలకు యావజ్జీవ ఖైదు

రాంచి: కారులో గో మాంసం తీసుకెళ్తున్నాడన్న అనుమానంతో గత జూన్‌లో జార్ఖండ్‌లో ఒక వ్యక్తిని కొట్టి చంపిన కేసులో 11 మందికి యావజ్జీవిత జైలు శిక్ష విధిస్తూ ఇక్కడి కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. ఆలీముద్దీన్ అన్సారీ హత్య కేసులో అనుమానితులంతా దోషులేనని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. జార్ఖండ్‌లోని రామ్‌గఢ్ పట్టణంలో కొంత మంది గోగూండాలు అన్సారీపై గత ఏడాది జూన్ 29న దాడి చేసి అతడిని కొట్టి చంపిన విషయం తెలిసిందే. అతడు తన కారులో 200 కేజీల మాంసం తీసుకెళ్తున్నట్లు సమాచారం అందటంతో దానిని గోమాంసంగా అనుమానించిన గోగూండాలు దాడి చేశారు.

14 బ్యాంకులకు కనిష్క్ గోల్డ్ 'కన్నం'

- రూ.824 కోట్లకు కుచ్చుటోపీ
- వడ్డీతో కలిపితే 1000 కోట్లు
- 14 బ్యాంకులకు ఎసరు
- సిబిఐకి ఎస్‌బిఐ ఫిర్యాదు
- విదేశాలకు ప్రమోటర్ల పరార్



కనిష్క్ యాజమాని భూపేష్ కుమార్ జైన్

న్యూఢిల్లీ : బంగారం, వజ్రాల తయారీ, విక్రయ కంపెనీలు బ్యాంకులను మోసం చేస్తున్న కేసులు ఒక్కోటిగా బయటపడుతున్నాయి. తాజాగా కనిష్క్ గోల్డ్ 14 ప్రభుత్వ, ప్రయివేటు రంగ బ్యాంకులకు కుచ్చుటోపి పెట్టింది. వివిధ బ్యాంకులకు రూ.9,000 కోట్లు పంగనామం పెట్టిన విజయ్ మాల్యా, పిఎన్‌బిని రూ.13వేల కోట్లకు మోసం చేసిన నీరవ్ మోడీ తరహాలోనే కనిష్క్ ప్రమోటర్లు కూడా విదేశాలకు తుర్రుమన్నారు. బాధిత విత్త సంస్థల్లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకులు కూడా ఉన్నాయి. చెన్నయ్ కేంద్రంగా పని చేస్తున్న కనిష్క్ గోల్డ్ బ్యాంకులకు దాదాపుగా రూ.824 కోట్లు ఎగనామం పెట్టింది. వడ్డీతో కలుపుకుంటే రూ.1000 కోట్ల పైమాటేనని అంచనా. ఈ సంస్థ రుణాలకు ఎస్‌బిఐ కన్సోర్షియంగా వ్యవహారిస్తుంది. కుంభకోణానికి పాల్పడిన కనిష్క్ గోల్డ్ జ్యుయలరీ ప్రమోటర్లు ఎప్పుడో విదేశాలకు చెక్కేశారు. దీంతో రాత్రికి రాత్రే దుకాణాలు మూసివేయడం, రికార్డులను మాయం చేయడాన్ని గుర్తించిన ఎస్‌బిఐ తుదకు సిబిఐని ఆశ్రయించింది. నిందితులు మిగతా 9లో

ఆగని డ్రామా

- అవిశ్వాస తీర్మానానికి అనుమతించని స్పీకర్
- సంఖ్యా బలం ఉన్నా చర్చకు 'నో'
- నిమిషాల్లోనే ఉభయ సభలు వాయిదా



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల తీరులో ఏమాత్రం మార్పు లేదు. ఉభయ సభల్లోనూ వాయిదాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. సమావేశాలు ప్రారంభమైన క్షణాల్లోనే వాయిదా పడుతుండటం గమనార్హం. ప్రభుత్వమే నాటకానికి తెరలేపిందని, అందువల్లనే సభలో ప్రతి రోజూ గందరగోళం నెలకొంటోందని, సభ సజావుగా జరగడం ప్రభుత్వానికి ఇష్టం లేదని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వరుసగా నాలుగో రోజు కూడా కేంద్ర ప్రభుత్వంపై పెట్టిన అవిశ్వాసం చర్చకు రాకుండా మోడీ సర్కార్ పావులు కదిపింది. అన్నాడిఎంకె, టిఆర్‌ఎస్ ఆందోళనల నేపథ్యంలో గందరగోళ పరిస్థితులను సాకుగా చూపి మిగతా 9లో

మా పథకాలను కాదనేందుకు కేంద్రమెవరు?

- రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలోని ప్రజలకు కావాల్సిన పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసోందని, ఇక్కడి ప్రజలకు ఏం కావాలో కూడా కేంద్రాన్నే అడగాలా? వీటిని వద్దనే హక్కు కేంద్రానికి ఎక్కడుందని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. రాష్ట్రంపై కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. శాసనసభలోని తన ఛాంబర్‌లో బుధవారం ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ పలు అంశాలపై స్పందించారు.

రాష్ట్రానికి రావాల్సిన ఆదాయ లోటుపై ఆయన మాట్లాడుతూ మిగతా 9లో

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యాన

నేడు జాతీయ రహదారుల దిగ్బంధం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు

- టెన్త్ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం
- టిడిపి, వైసిపి, కాంగ్రెస్, జనసేన, ప్రజాసంఘాల మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన విషయంలో కేంద్రం అనుసరిస్తున్న విధానంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. ప్రజలను నమ్మించి నట్టేట ముంచారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. కొద్దికాలంగా వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేసిన పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు నెమ్మదిగా ఉద్యమ కార్యాచరణను మార్చుకుంటున్నాయి. ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమవుతున్నాయి. ఇదే సమయంలో హోదా విషయంలో అవిశ్వాసం నోటీసు ఇస్తున్నా నాలుగు రోజులుగా కేంద్రం వాయిదా వేసుకుంటూ వస్తోంది. దీంతో సహనం కోల్పోయిన మిగతా 2లో

దళిత గర్జన



న్యూఢిల్లీలో దళితులు కదంతొక్కారు. దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చలో పార్లమెంట్‌కు దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో దళితులు తరలివచ్చారు. ఎస్సీ సబ్ ప్లాన్‌ను పునరుద్ధరించాలని, భీమ్ కోరెగావ్‌లో దాడులకు పాల్పడినవారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పూర్తి కథనం.. 8లో


ఉపాధి కూలీల ఘోష



వేతన బకాయిల కోసం విజయవాడలో ఉపాధి హామీ పథకం కూలీలు బుధవారం ధర్నా నిర్వహించారు. రోజువారీ వేతనాన్ని రూ.500కు పెంచాలని డిమాండ్ చేశారు. ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో ఉపాధి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వార్త 2లో

కొంప ముంచిన కృష్ణపట్నం

- కొత్త ఓడరేవు వచ్చే అవకాశాలు లేనట్టే
- ప్రతిపాదిత మూడు చోట్లా అడ్డంకులే
- రామాయపట్నానికి అడ్డుపడ్డ కృష్ణపట్నంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రేమ
- నక్కపల్లి, దుగ్గిరాజపట్నాలకు భద్రతా సమస్యలు




ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం స్వయంకృతాపరాధంతోనే రాష్ట్రానికి కొత్త ఓడరేవు ఏర్పాటులో అడ్డంకులు నెలకొంటున్నాయి. విభజన నేపథ్యంలో రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్న కొత్త ఓడరేవుకు ప్రభుత్వ విధానాలు కారణాలుగా కనిపిస్తున్నాయి. అప్పట్లో కృష్ణపట్నం ఓడరేవుపై కురిపించిన అవ్యాజమైన ప్రేమానురాగాలే ఇప్పుడు ఇతర ప్రాంతాల్లో ఓడరేవు ఏర్పాటుకు సమస్యగా పరిణమిస్తున్నట్లు అధికారులే అంగీకరిస్తున్నారు. విభజన హామీల్లో భాగంగా రాష్ట్రంలో ఒక ప్రధాన ఓడరేవును ఏర్పాటు చేసేందుకు కేంద్రం హామీనిచ్చింది. దీనికోసం మిగతా 9లో

భారీగా పడిపోయిన నీటిమట్టాలు

- తుంగభద్రలో అడుగంటుతున్న జలాలు
- శ్రీశైలంలో 816 అడుగులకు నీటిమట్టం



శ్రీశైలం డ్యామ్‌లో తగ్గిపోయిన నీటిమట్టం

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాయలసీమ జిల్లాలకు సాగునీటితో పాటు తాగునీటిని అందించే శ్రీశైలం, తుంగభద్ర డ్యామ్‌లలో నీటిమట్టాలు గణనీయంగా పడిపోయాయి. శ్రీశైలం ప్రాజెక్టులో ప్రస్తుత కనీస నీటిమట్టం 834 అడుగులు ఉండాలి. బుధవారం 816 అడుగులకు పడిపోయింది. ఉమ్మడి రిజర్వాయరు అయిన శ్రీశైలం నుంచి రెండు రాష్ట్రాలు పోటీ పడి నీళ్లను తోడుకోవడంతో వేసవికి ముందే ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి తెలుగుగంగ ఎస్‌ఆర్‌బిసిలోకి నీటిని తీసుకోవాలంటే 840 అడుగులకు పైగా ఉండాలి. శ్రీశైలం డ్యామ్‌లో 810 అడుగుల దాకా నీటిమట్టం పడిపోయినా ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి కూడా నీటిని తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం శ్రీశైలం డ్యాంలో 38.5 టిఎంసిల నీరు అందుబాటులో ఉంది. ఈ ప్రాజెక్టు నుంచి ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా కెసి కెనాల్‌లోకి 741 క్యూసెక్కులు, హంద్రీనీవాలోకి 338 క్యూసెక్కులను వదులుతున్నారు. ఈ ప్రవాహం మరో వారం రోజులు కొనసాగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. శ్రీశైలం డ్యామ్‌లో కనీస నీటి నిల్వలను నిలకడగా ఉంచితేనే వేసవిలో తాగునీటి అవసరాలతోపాటు మిగతా 9లో

పట్టిసీమపై విచారణకు పట్టు

- కొట్టి పారేసిన మంత్రులు
- శాసనసభలో బిజెపి × టిపిపి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గోదావరిపై పట్టిసీమ ఎత్తిపోతల పథకంపై శాసనసభలో బుధవారం వాడివేడిగా చర్చ సాగింది. నాలుగేళ్లుగా కనపడని పట్టిసీమ అవినీతి, మిత్రులు విడిపోగానే ఒక్కసారిగా ఆరోపణలు ప్రత్యారోపణలకు వేదికగా మారటం విశేషం. పట్టిసీమ పథకంపై సిట్టింగ్ జడ్జి లేదా సిబిఐతోగాని విచారణ చేయించాలని బిజెపి సభ్యులు, అసలు అవినీతే లేదని విచారణ ఎందుకంటూ మంత్రులు పరస్పరం వాదోపవాదాలకు దిగారు. పట్టిసీమ ముమ్మాటికీ అవినీతి ప్రాజెక్టేనని బిజెపి శాసన సభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు ఆరోపించగా, ఇది తమపై బురదజల్లే కార్యక్రమంటూ మంత్రులు ఎదురు దాడికి దిగారు. శాసనసభలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా చర్చలో బిజేపి పక్ష నేత విష్ణుకుమార్‌రాజు పట్టిసీమ అంశాన్ని లేవనెత్తారు. పట్టిసీమలో భారీగా అవినీతి జరిగిందని, దీనిపై సిట్టింగ్ జడ్జితోగానీ, సిబిఐ చేతగానీ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టిసీమలో నిధుల దుర్వినియోగాన్ని కాగ్ తప్పు పట్టిందని ఆయన గుర్తు చేశారు. జీవో ప్రకారం 30 మోటార్లు అమర్చాల్సి ఉండగా, కేవలం 24 మోటార్లే అమర్చారన్నారు. 2015 జనవరిలో ఇచ్చిన జీవో ప్రకారం రూ.1170 కోట్ల అంచనాలను, ఇష్టానుసారం పెంచుకుంటూ పోయారన్నారు. మట్టి పనుల్లోనూ భారీగానే అక్రమాలు సాగాయన్నారు. క్యూబిక్ మీటర్ మట్టి తీయడానికి రూ.21,350 ఖర్చు చేశారన్నారు. కాగ్ నివేదిక ప్రకారం మిగతా 9లో

అజ్మీర్‌కు ప్రత్యేక రైలు ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం (కృష్ణా)

కృష్ణాజిల్లా మచిలీపట్నం రైల్వేస్టేషన్ నుంచి అజ్మీర్‌కు ప్రత్యేక రైలు ప్రారంభమైంది. మచిలీపట్నం మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అజ్మీర్ యాత్రకు వెళ్తున్న ముస్లిం సోదరులు దిగ్విజయంగా యాత్ర పూర్తిచేసుకుని రావాలని కోరారు. తొమ్మిదేళ్ల నుంచి పార్లమెంటు సభ్యులు కొనకళ్ల నారాయణరావు కృషితో రైల్వే అధికారులు ఈ ప్రత్యేక రైలును ఏర్పాటు చేస్తున్నారన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు మాట్లాడుతూ.. ఈ ప్రత్యేక రైలులోని 9 బోగిల్లో 500 మంది యాత్రికులు మచిలీపట్నం నుంచి అజ్మీర్ యాత్రకు వెళ్తున్నారన్నారు.

ప్రారంభం

అజ్మీర్ ప్రత్యేక రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న మచిలీపట్నం మున్సిపల్ చైర్మన్ బాబాప్రసాద్



చట్టాన్ని నీరుగార్చే ఆదేశాలను నిరసించండి..

● సుప్రీం తీర్పును పున:సమీక్షించాలి ● సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చే సుప్రీంకోర్టు ఆదేశాలను నిరసించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చట్టం దుర్వినియోగమవుతోందని, ఆ కేసుల్లో నిందితులైన ఉద్యోగులను తక్షణ అరెస్టు నుంచి మినహాయిస్తూ సుప్రీంకోర్టు బెంచ్ ఇచ్చిన ఆదేశాలను పున:సమీక్షించాలని మధు కోరారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు దళితుల రక్షణకున్న హక్కులను ప్రశ్నార్థకం చేస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకుని అనేక మంది దోషులు శిక్షలు పడకుండా తప్పించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఎక్కడైనా చట్టం దుర్వినియోగమైనట్లు నిరూపణైతే, అందుకు బాధ్యులైన వారిని శిక్షించొచ్చు. కానీ దుర్వినియోగమవుతోందనే పేరుతో మొత్తం చట్టాన్నే నీరుగార్చే పని చేయొద్దని కోరారు. చట్టం అమలును పరిరక్షించాల్సిన అత్యున్నత న్యాయస్థానమే ఆ చట్ట స్ఫూర్తిని దెబ్బతీసేలా ఆదేశాలు వెలువరించడం గర్హనీయమన్నారు. దేశంలో దళితులపై పెరుగుతున్న దాడుల దృష్ట్యా, వారి రక్షణకు ఈ చట్టాన్ని మరింత కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సుప్రీం కోర్టు బెంచ్ ఆదేశాలను పున:సమీక్ష చేయాలని, ప్రజాతంత్రవాదులంతా ఈ తీర్పుపై నిరసన తెలిపాలని కోరారు.



రాయలసీమలో ఎండలు..

ఉత్తరాంధ్రలో తేలికపాటి జల్లులు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. రాయలసీమలో ఎండలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. బుధవారం అనంతపురంలో 41, కర్నూలు 40, తిరుపతిలో 38 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. 1 లేదా 2 డిగ్రీలు తక్కువగా నమోదైనా దక్షిణ కోస్తాలోనూ ఉక్కపోత పరిస్థితులే కొనసాగతున్నాయి. కావలి, నెల్లూరు, గన్నవరంలో 37, ఒంగోలు 36, తునిలో 38, కాకినాడు, విశాఖ ఎయిర్‌పోర్టు 35, కళింగపట్నం, నర్సాపురంలో 33 డిగ్రీలు చొప్పున నమోదయ్యాయి. గురువారమూ రాయలసీమ, దక్షిణ కోస్తాలో ఎండలు పెరిగే అవకాశముందని విశాఖ వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఉత్తర ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది. మధ్య మహారాష్ట్ర నుంచి ఉత్తర కర్నాటక మీదుగా దక్షిణ కర్నాటక వరకు అల్పపీడన ద్రోణి స్థిరంగా కొనసాగుతోందని తెలిపింది. వీటి ప్రభావంతో ఉత్తర కోస్తాలో గురువారం స్వల్పంగా ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశముందని, ఒకటి రెండు చోట్ల తేలికపాటి జల్లులు లేదా మోస్తరు వర్షం కురిసే అవకాశముంటుందని తెలిపింది.

సొమ్ము మాది సోకు మీదా..?

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ ● ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ప్రారంభించాలని, రోజు కూలీ రూ.500 ఇవ్వాలని, పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, చేసిన పనికి పే స్లిప్‌లు ఇవ్వాలని, పోస్టాఫీసుల ద్వారా వారం లోపు బిల్లులు చెల్లించాలని, చిన్న, సన్నకారు రైతులు, దళిత, గిరిజన భూములను అభివృద్ధి చేయాలని, యంత్రాలను నిషేధించాలని, ప్రమాదాల్లో, వడదెబ్బకు మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, బాలింతలకు 90 రోజుల పనిదినాలకు ఉచితంగా వేతనాలు ఇవ్వాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం విజయవాడ అలంకార్ సెంటర్‌లో ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడారు. ఉపాధి హామీ సొమ్ముతో ప్రభుత్వం నీరు చెట్టు, సిమెంట్ రోడ్లు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తోం దని మండి పడ్డారు. సొమ్ము మాది సోకు మీదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలల తరబడి బకాయిలు పేరుకుపో తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆరోపించారు. వంద రోజులు పని దాటితే పని లేదనడం అన్యాయ మన్నారు. చేసిన పనికి పే స్లిప్‌లు ఇవ్వడం లేదన్నారు. వేతనాలు పోస్టాఫీసుల ద్వారా అందించాలని కోరారు. దేశ ప్రజలకు అన్నం పెడుతున్న తమకు అన్నమేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) రాష్ట్ర అధ్యక్షులు ఆవుల శేఖర్ మాట్లాడుతూ ఎంతో మంది కూలీలు పనుల్లేక పొరుగు రాష్ట్రాలకు వలస పోతున్నారని తెలిపారు. అనేక మంది కూలీలు పస్తులుంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు ఈ పథకం సొమ్మును పంది కొక్కుల్లా మేస్తున్నారని మండిపడ్డారు. ధర్నాకు వచ్చే కూలీలను, నాయకు లను వారి వారి జిల్లాల్లో అరెస్టులు చేయించడం సిఎం చంద్రబాబుకు తగదన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ 12 ఏళ్ల క్రితం తిండైనా పెట్టండి లేదా పనైనా చూపండి అనే నినాదంతో పోరాడి తెచ్చుకున్న చట్టమే ఉపాధిహామీ పథకమని గుర్తు చేశారు. కూలీల కోసం తెచ్చిన చట్టాన్ని టిడిపి ప్రభుత్వం తమ కార్యకర్తలకు దోచి పెడుతుందన్నారు. కూలీలకు బదులు యంత్రాలను ఉపయోగించి వారి పొట్టకొట్టడం అన్యాయమన్నారు. కూలీల కోర్కెలు న్యాయమైనవని, వాటిని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని టిడిపి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పనిలో రకరకాల సమస్యలు సృష్టించి కూలీలతో ఈ పథకం వద్దని చెప్పించాలని చూస్తున్నారన్నారు. వారి కలలు కల్లలుగానే మిగిలిపోతాయన్నారు. ఈ పథకంపై ఆధారపడి 55 లక్షల కుటుంబాలు జీవనాన్ని కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎడబ్ల్యుయు రాష్ట్ర మహిళా కన్వీనర్ నాగరాణి, బికెఎంయు మహిళా నాయకురాలు కుమారి, ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, పెంచలయ్య, ఎం నాగేశ్వరరావు, రవి, చిరంజీవమ్మ, శ్రీధర్, సూరయ్య, ఆంజనేయులు, అప్పారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి గాయకులు పాడిన విప్లవ గీతాలు అలరించాయి.



కూలీల డిమాండ్లను నెరవేర్చుతాం

గ్రామీణాభివృద్ధి అసిస్టెంట్ కమిషనర్

బాలసుబ్రహ్మణ్యం ధర్నా వద్దకు విచ్చేసిన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ కూలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నాయకులకు హామీ ఇచ్చారు. లిఖిత పూర్వకమైన హామీ కావాలని నాయకులు పట్టుబట్టారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. వారం లోపు దీని కోసం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



శ్రీవారి ఆలయంలో ఇద్దరు తాతల (బాలక్రిష్ణ, చంద్రబాబు) మధ్య నడచి వస్తున్న దేవాన్ష్

హోదా సాధించే ధైర్యం ఇవ్వాలని కోరా!

శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

'ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించే ధైర్యాన్ని ఇవ్వాలని శ్రీవారిని కోరుకున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సిఎం మనవడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సమేతంగా బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారమే చంద్రబాబు భార్య భువనేశ్వరి, కుమారుడు లోకేష్, కోడలు బ్రహ్మణి, వియ్యంకులు బాలకృష్ణ, వసుంధరలు తిరుమలకు చేరుకున్నారు. పద్మావతి అతిథి గృహంలో రాత్రి బస చేశారు. ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ చంద్రబాబు కుటుంబసభ్యులకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించిన వారు దాదాపు గంటసేపు ఆలయంలోనే గడిపారు. దేవాన్ష్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా వెంగమాంబ అన్నదానసత్రంలో యాత్రికులకు అల్పాహారాన్ని వడ్డించారు. రూ.26 లక్షలు విరాళంగా ఇచ్చారు. అనంతరం కుటుంబసభ్యులు అక్కడే అల్పాహారం తీసుకున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలను కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంపై పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఎంతటి త్యాగానికైనా సిద్ధమన్నారు. జపాన్ తరహాలో ఆందోళన, అభివృద్ధి చేస్తానని చెప్పారు. దర్శనం అనంతరం ఉదయం 11 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరానికి బయలుదేరారు.

ఆశా వర్కర్లను అవమానించిన టిడిపి వైఖరిని ఖండించాలి

ఏపి ఆశా వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆశా వర్కర్లు కేంద్ర పథక పనులు తప్ప రాష్ట్ర ప్రభుత్వ పనులేమీ చేయడంలేదంటూ మంగళవారం అసెంబ్లీలో ఆర్థిక మంత్రి యనమల చేసిన వ్యాఖ్యలను ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధనలక్ష్మి బుధవారం ప్రకటనలో ఖండించారు. మంగళవారం శాసన సభలో కొందరు ప్రతినిధులు ఆశాలకు జీతాలు పెంచమని ప్రభుత్వాన్ని కోరిన సందర్భంలో యనమల ఈ వ్యాఖ్యలు చేయడం ఆశా వర్కర్లను అవమానించినట్లేనని తెలిపారు. ఆశా వర్కర్లు చేసే పనుల్లో 90 శాతం రాష్ట్ర ప్రభుత్వానివేనని పేర్కొన్నారు. వారితో వెట్టి చాకిరీ చేయిస్తూ వేతనాలు కాకుండా కేవలం పారితోషకాల రూపంలో చెల్లిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న ' పలకరింపు ' కార్యక్రమం బలవంతంగా ఆశా వర్కర్లపై రుద్దుతున్నారని తెలిపారు. ఇతర రాష్ట్రాలలో ఆశాలకు పారితోషకాలతో సంబంధం లేకుండా గౌరవ వేతనాలు చెల్లిస్తుంటే మన రాష్ట్రంలో మాత్రమే పారితోషకాలతో సరిపెడుతోందని వివరించారు. కేరళలో రూ 7,500, హర్యానాలో రూ 4,500 ఆశాలకు అక్కడి ప్రభుత్వాలు వేతనాలు చెల్లిస్తున్నాయని తెలిపారు. కేంద్రం నుంచి వచ్చిన పారితోషకాలు, యూనిఫామ్ అలవెన్స్ నిధులను గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వమే దారి మళ్లిస్తోందని విమర్శించారు. ఆశాలకు దాదాపు పది నెలల నుంచి పారితోషకాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాస్తవ విషయాలు మరుగున పరిచి, వారిని అవమానించే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. ఆశా వర్కర్లలో 80 శాతం దళిత, గిరిజనులున్నారని తెలిపారు. ఆశాలకు నెలకు రూ 6 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రజ్ఞ

1. యుద్ధ విమానంలో ఒంటరిగా ప్రయాణించిన భారత రెండో మహిళా పైలెట్‌గా ఘనత సాధించింది ఏవరు?
2. 2018 ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంట్రర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ఎక్కడ నిర్వహించారు?
3. భారత నటి సీమి గారెల్‌కు ఏ అవార్డు లభించింది?
4. 8వ థియేటర్ ఒలింపిక్స్ (మార్చి 24 నుంచి ఏప్రిల్ 7 వరకు) ఎక్కడ జరగనున్నాయి?
5. అంతర్జాతీయ అటవీ దినోత్సవ ఎప్పుడు నిర్వహిస్తారు?

సమాధానాలు 7లో

మైనారిటీలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలి

ఉర్దూకు ప్రాధాన్యత కల్పించాలి ● మండలిలో స్వతంత్ర ఎమ్మెల్సీ నరసింహారెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మైనారిటీ వర్గాల్లో ఎక్కువ శాతం పేదరికంలోనే జీవిస్తున్నారని, వీరి కోసం ప్రత్యేకంగా సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేయాలని స్వతంత్ర ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు. శాసనమండలిలో బుధవారం సంక్షేమంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ రెండో అధికార భాషగా ఉన్న ఉర్దూకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్ర జనాభాలో 9.2 శాతం ఉన్న మైనారిటీల్లో 43 శాతం మంది నిరక్ష్యరాస్యత ఉందన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని ఉర్దూ గురుకులాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యా సంస్థల్లో ఉన్న ఉర్దూ ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉన్నత విద్యలో కూడా 4.5 శాతం ఉన్నత విద్యలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని అద్దె భవనంలో కాకుండా శాశ్వత భవన సముదాయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వితంతువులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సహాయం చేయడంతో పాటు వారి పిల్లలకు ప్రభుత్వమే ఉచిత విద్యను అందించాలన్నారు. సచార్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలన్నారు.

● **అట్టడుగు వర్గాల్లో అభివృద్ధి లేదు : రాము సూర్యారావు**

ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా అట్టడుగు వర్గాల్లో అభివృద్ధి లేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ రాము సూర్యారావు అన్నారు. సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించినా వాటి ఫలాలు పేదలకు అందటం లేదన్నారు. ఆయా వర్గాలు తమ కులాలను మార్చాలని కోరుతున్నారంటే వారు అభివృద్ధికి నోచుకోవడం లేదనే అర్థమన్నారు. ఈ అంశాల పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

● **పథకాల అమలుపై నిఘా ఉండాలి : రత్నాబాయి**

ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని పర్యవేక్షించేందుకు విజిలెన్స్ అధికారులను నియమించాలని, అప్పుడే పథకాలు పూర్తి స్థాయిలో అమలు సాధ్యమవుతుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ రత్నాబాయి అన్నారు. ఏజెన్సీ ఏరియాల్లో రేషన్ సరుకులు అందక గిరిజనులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలను నివారించాలంటే ఏజెన్సీ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లను ఏర్పాటు చేసి సేవలను అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు.


● **కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు : అచ్చెన్నాయుడు**

ఈ ఏడాది నుంచి కాపు విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రియింబర్స్‌మెంట్ వంటి ప్రోత్సాహకాలను అందించనున్నట్లు బిసి సంక్షేమ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. చర్చకు ఆయన సమాధానం ఇస్తూ రుణాల విడుదలలో బ్యాంకర్లతో సమస్యలుండటం వాస్తవమేనన్నారు. ఆదరణ పథకంపై చేతి వృత్తిదారుల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి మండలంలో మొబైల్ ఎగ్జిబిషన్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. జ్ఞానభూమి ద్వారా విద్యార్థులందరికీ ఉపకారవేతనాలు చెల్లిస్తున్నట్లు సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు భూమి కొనుగోలు పథకాన్ని పక్కాగా అమలుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గిరిజనుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు గిరిగోరుముద్దలు పథకం ద్వారా గుడ్లు, పాలు అందిస్తున్నట్టు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత తెలిపారు.

టెలీకాన్ఫరెన్స్

హక్కుల కోసం చివరి వరకు పోరాడండి

ఎంపిలతో చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర హక్కుల సాధన కోసం పార్లమెంట్‌లో చేస్తున్న పోరాటం సమావేశాల చివరి రోజు వరకూ ఇదే స్ఫూర్తితో అందరూ కలిసికట్టుగా పోరాడాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తమ ఎంపిలకు పిలుపునిచ్చారు. తిరుపతి నుండి ఢిల్లీలోని పార్టీ పార్ల మెంట్, రాజ్యసభ సభ్యులు, వ్యూహ కమిటీ ప్రతినిధులతో బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు సంక్షోభంలో 161మంది ఎమ్మెల్యేలందరూ ఒకే తాటిపై చివరిదాకా నిలబడటంతో ఘన విజయం సాధించామని గుర్తు చేశారు. ఎపి సమస్యలు నేడు జాతీయ స్థాయి అంశాలుగా మారాయని బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు మన రాష్ట్రం పట్ల సానుభూతిగా ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నారు. అనేక రాజకీయపార్టీలు మన పోరాటానికి మద్దతునిస్తున్న నేపథ్యంలో పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అవిశ్వాసం పెట్టిన వాళ్లకు ప్రధాని కార్యాలయంలో పని ఏమిటని వైసిపిని ప్రశ్నించారు. ఎంపి విజయసాయిరెడ్డిని ఫోటో తీస్తే ప్రధాని కార్యాలయ సిబ్బంది మీడియాను గదమాయించడమేమిటని ప్రశ్నించారు. ఎన్డీఏ నుంచి వైదొలగినా, అవిశ్వాసం పెట్టినా కేంద్రంలో కదలిక లేకపోవడం వెనుక వ్యూహం ఏమిటని చంద్రబాబు ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవిశ్వాసం నోటీసును అనుమతించా ల్సిందేనని చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై తెలుగు ప్రజలు రగిలిపోతు న్నారన్నారు. గత కొంతకాలంగా టిడిపిపై బిజెపి అనుమానం పెంచుకుం దన్నారు. తనకు జాతీయ రాజకీయాల పట్ల తనకు ఆసక్తి లేదని చెప్పినా వాళ్లు నమ్మడం లేదన్నారు. రాష్ట్రపతి ఎన్నికల్లో వైసిపి మద్దతు అవసరం లేకున్నా బిజెపి ఆ పార్టీ మద్దతు తీసుకుందని గుర్తు చేశారు. బిజెపికి త్రిపుల్ తలాఖ్ చెప్పేశామని వ్యాఖ్యానించారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేస్తాం

సాధికారమిత్రలతో ముఖాముఖిలో సిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులను స్వయం సహాయక గ్రూపులుగా తయారు చేయటంతో పాటు పారిశ్రామికవేత్తలుగా తయారుచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. సాధికార మిత్రలతో ఉండవల్లిలోని గ్రీవెన్స్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి గ్రామంలో, వార్డులో సాధికార మిత్రల పనితీరు సత్ఫలితాలను ఇస్తాయనే నమ్మకం కలుగుతోందన్నారు.. దేశంలో ఏ రాష్ట్రానికి లేనటువంటి ఆస్తి సాధికార మిత్రలని, 35 కుటుంబాలకు ఒక సాధికార మిత్రలు పనిచేస్తున్నారన్నారని తెలిపారు. వ్యక్తులుగా ఉంటే ఒక పరిధికి మాత్రమే లోబడి ఉంటామని, అదే ఒక సంఘటిత శక్తిగా ఉంటే అద్భుతాలు సృష్టించ వచ్చని అన్నారు. కేంద్రం సహకరించినా, సహకరించకపోయినా అక్కా చెల్లెళ్ళ కోసం పసుపు కుంకుమ, స్త్రీ నిధి కింద నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందేనన్నారు.. బాలింతలు, గర్భిణీలు, చిన్నారుల మరణాలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని ఆయా కుటుంబాలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

నేడు జాతీయ రహదారుల దిగ్బంధం

మొదటి పేజీ తరువాయి

ప్రజలు ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమయ్యారు. దీంట్లో భాగంగా ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఎపిలో గురువారం జాతీయ రహదారుల దిగ్బంధానికి పిలుపునిచ్చింది. ఉదయం పదిగంటల నుండి 12 గంటల మధ్యలో విద్యార్థులకు పిల్లలకు ఇబ్బంది లేకుండా కార్యక్రమం నిర్వహించాలని సాధన సమితి నిర్ణయించింది. సిపిఎం, సిపిఐ, ఇతర వామపక్షాలు, జనసేన, కాంగ్రెస్, వైసిపి కూడా ఈ కార్యక్రమానికి ముందుకొచ్చాయి. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా దీన్ని అర్థం చేసుకుని సహకరించాలని సాధన సమితి విజ్ఞప్తి చేసింది. జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ కూడా దిగ్బంధం కార్యక్రమంలో పాల్గొనాలని తమ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికే పార్లమెంటులో వైసిపి ఎంపిలతో అవిశ్వాస తీర్మానం నోటీసు ఇవ్వడం సహా, ఆందోళనల్లో పాల్గొనమని పార్టీ శ్రేణులకు సూచించారు. మూడు రోజులుగా దీనిపై తీవ్ర స్థాయిలో సాగుతున్న చర్చతో అధికారపార్టీకి ముచ్చెమటలు పట్టుకున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో అధికార తెలుగుదేశం కూడా ఈ ఆందోళనకు మద్దతు తెలపాల్సిన అవసరం ఏర్పడింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కిమిడి కళా వెంకట్రావు తమ పార్టీ నాయకులు, కార్యకర్తలతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రశాంతంగా ఆందోళనలు నిర్వహించాలని సూచించారు. అదే సమయంలో వైకాపాతో కలిసి పాల్గొంటే విధ్వంసం సృష్టించే ప్రమాదం ఉన్న దృష్ట్యా తెలుగుదేశం శ్రేణులు అన్ని కూడలి ప్రాంతాల్లో నిరసనలు తెలపాలని సూచించారు. వైకాపా పాల్గొనే ఆందోళనల్లో పాల్గొనవద్దని సూచించారు.

హోదా సాధనకు వెనుకాడేది లేదు.. : వామపక్షాలు

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు సాధించుకునేవరకూ వెనుకాడేది లేదని, దీంట్లో భాగంగా గురువారం జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చిత్తశుద్ధే ఉంటే తెలుగుదేశం పార్టీ నాయకులు జాతీయ రహదారుల దిగ్బంధంలో కలిసి రావాలని కోరారు. విద్యార్థులకు పరీక్షల నేపథ్యంలో, వారికి ఇబ్బంది లేకుండా ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల మధ్యలో ఈ కార్యక్రమం ఉంటుందని, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా అర్థం చేసుకోవాలని వారు కోరారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలు విషయంలో బిజెపి నాటకాలాడుతోందని వారు విమర్శించారు. కేంద్రం రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందన్నారు. పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం పెడుతుంటే టిఆర్ఎస్ ఆందోళన పేరుతో చర్చకు రానీయడం లేదని తెలిపారు. టిఆర్ఎస్ అధినేత చంద్రశేఖరరావు సైంధవుడిగా మారారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్ మాట్లాడుతున్నప్పుడు గమ్మున కూర్చున్న నాయకులు, అవిశ్వాస తీర్మానం పెడుతుంటే మాత్రం గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. రైల్వేజోన్ కావాలని అడుగుతుంటే మరోవైపు రైళ్లనే రద్దు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే విశాఖ నుండి గుంటూరు వెళ్లే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను ఎత్తేశారని, దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హోదా విషయంలో రాష్ట్రం నుండి ఒకే విషయం కేంద్రం దృష్టికి వెళ్లాలని కోరారు. రాష్ట్రంలో అవినీతిపై విమర్శలు చేస్తే పవన్ కల్యాణ్‌పై నిందలు మోపుతున్నారని, నిజంగా ఆయన బిజెపితో వెళ్లే వ్యక్తయితే, తమ కార్యాలయాలకు ఎందుకు వస్తారని వారు ప్రశ్నించారు. అందరికీ పంగనామాలు పెట్టే చంద్రబాబుకు ఇప్పుడు మోడీ పంగనామాలు పెట్టారని, అందుకే తట్టుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. పవన్ దెబ్బకు టిడిపి నాయకుల్లో భయం పట్టుకుందని, దాన్నుండి బయటపడేందుకు దిక్కుతోచని విమర్శలు చేస్తున్నారని చెప్పారు.

జీవో 27ను సవరించాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య, ఆరోగ్య శాఖలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులందరికీ న్యాయం జరిగేలా జీవో 27ను సవరించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు కోరారు. శాసన మండలిలో చైర్మన్ ఎన్ఎండి ఫరూక్‌కు ప్రత్యేక ప్రస్తావన బుధవారం ఈ అంశాన్ని అందజేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏడాది తర్వాత వేతనాలు పెంచుతూ జీవో 27ను జారీ అయిందని, కానీ మంత్రి వర్గ నిర్ణయం ప్రకారం కనీసం ఎరియర్స్‌ను గత ఏడాది ఏప్రిల్ నుంచి చెల్లించాలనేది జీవో లేదని తెలిపారు. కాంట్రాక్టు పారా మెడికల్ సిబ్బందికి గత 15 ఏళ్లుగా అమలవుతున్న పద్ధతికి భిన్నంగా జీవో జారీ చేయడం అన్యాయమన్నారు. వైద్య ఆరోగ్యశాఖలోనే వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు నర్సులకు, ఎఎన్ఎంలకు వేర్వేరుగా కొందరికి ఎక్కువ, కొందరికి తక్కువ వేతనాలు పొందేలా ఈ జీవో ఉందన్నారు. దాదాపు 25 వేల మంది ఉద్యోగులను ఈ జీవో తీవ్ర నిరాశకు గురిచేసిందని వివరించారు. అందరకీ న్యాయం చేయాలని కోరుతూ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు అనుబంధ సంస్థ) సిద్ధపడుతోందని, సమస్యలను పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షేమానికే సాధికార సర్వే

ఆర్థిక మంత్రి యనమల



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పన కోసమే ప్రజాసాధికార సర్వేను నిర్వహించామని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు వివరణ ఇచ్చారు. శాసనసభలో సభ్యులు ఆలపాటి రాజా, జయ నాగేశ్వరరెడ్డి బుధవారం అడిగిన ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఇంతవరకు 1,38,38,892 కుటుంబాలను సర్వే చేసినట్లు చెప్పారు. జనాభా లెక్కల్లో కంటే. ఎక్కువ వివరాలను ఈ సర్వే ద్వారా సేకరించిచామన్నారు. సర్వే నిరంతరం కొనసాగించి వలస కుటుంబాలూ సర్వేలో కొచ్చేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గత నెలలో 7,442 కుటుంబాలను సర్వే చేశామన్నారు.

బద్వేలు శాసనసభ్యులు జయరాములు అడిగిన ప్రశ్నకు జలవనరుల మంత్రి దేవినేని ఉమా సమాధానమిస్తూ గోపవరంలో పది చెరువులు, అట్లూరులో ఆరు చెరువులకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సోమశిల ప్రాజెక్టు నుంచి బద్వేలు సాగు, తాగునీటి అవసరాలకు ఒక టిఎంసి నీటిని కేటాయిస్తామన్నారు. సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, పిజివిఆర్ నాయుడు, పల్లా శ్రీనివాసరావు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ మేఘాద్రిగడ్డ, గంభీరం రిజర్వాయర్ల నిర్వహణను విశాఖ నగర పాలక సంస్థకు అప్పగించడం సాధ్యం కాదని తెలిపారు. వీటికి వరద ఒక్కసారిగా వచ్చి పడుతుందని, అనుభం లేని వారికి అప్పగిస్తే గేట్ల నిర్వహణలో సమస్యలు వస్తాయన్నారు. అయితే పూడికతీత తదితర పనులను జివిఎంసి నిధులతో చేపట్టేందుకు అధికారులతో త్వరలో సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ తమ నియోజకవర్గానికి 2 టిఎంసిలు నీరూ అందటం లేదని తెలపగా, ముక్త్యేశ్వరపురం ఎత్తిపోతల పథకాన్ని ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేసి రైతులకు నీరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

గిరిజన తండాలన్నింటినీ పంచాయతీలుగా గుర్తించలేం..

రాష్ట్రంలో 500 జనాభాకు పైబడిన గిరిజన తండాలు 129 ఉన్నాయని, అయితే వీటిని పంచాయతీలుగా గుర్తించాలంటే ఆర్థికంగా, సాంకేతికంగా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ అయితే జనాభా తక్కువగా ఉన్నా హ్యాబిటేషన్ ప్రాతిపదికగా నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని సభ్యులడిగిన ప్రశ్నకు జవాబుగా తెలిపారు. గోపాలపురం నియోజవర్గంలోని ఎస్టీ గ్రామాలను ఐటిడిఎలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 500 జనాభా ఉన్న తండాలను పంచాయతీలుగా గుర్తిస్తామని టిడిపి మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాన్ని శ్రీనివాసరావు, ఆంజనేయలు గుర్తు చేశారు. ఎస్టీ నకిలీ ధ్రువీకరణ పత్రాల కేసులు జెసిల విచారణలో 244, తన వద్ద 163 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి అన్ని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని మంత్రి తెలిపారు. 1,398 గ్రామాలకు 2,623.92 కిలో మీటర్ల మేర రూ.8.85 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు సభ్యులడిగిన ప్రశ్నలకు సమాధానంగా తెలిపారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో పారుట్ల తండాకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. శాసనసభ్యులు వర్మ తదితరులు అడిగిన ప్రశ్నకు ఇంధన శాఖ మంత్రి కళా వెంకటరావు జవాబిస్తూ ధ్వంసమైన విద్యుత్ లైన్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్టీసిని ప్రభుత్వం తీసుకునే ప్రతిపాదనేదీ పరిశీలనలో లేదు..

సభ్యులు జయరాములు, చాంద్‌బాషా అడిగిన ప్రశ్నకు రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు జవాబిస్తూ ఆర్టీసిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదని తెలిపారు. పోరుమామిళ్ల, కదిరి బస్టాండ్లలో ఖాళీ స్థలాన్ని బిఒటి పద్ధతిలో అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదన్నారు.


'అనంత' చెరువులన్నీ నింపుతాం : మంత్రి దేవినేని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనంతపురం జిల్లాలోని చెరువులన్నీ నింపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. ప్రజా ప్రాధాన్యం గల అంశాలపై శాసనసభలో బుధవారం చర్చ సందర్భంగా మంత్రి సమాధానమిస్తూ అనంతపురం జిల్లాలో 1,183 చెరువులున్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే కొన్ని చెరువుల్లో నీరు నింపుతున్నామని, మిగిలిన వాటిని 2019 జనవరి నాటికి నింపుతామని తెలిపారు. ఇందుకు అవసరమైన పనులకు టెండర్లు పిలవనున్నట్లు చెప్పారు. అంతకు ముందు చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ హంద్రీ నీవా కాలువ వెళున్న గ్రామాలకు సమీపంలో వంతెనలు ఏర్పాటు చేయాలని కోరారు. సరైన ప్రణాళికతో కాలువ చివరి భూములకు నీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు. భైరవానితప్ప పరిధిలో 114 చెరువులు నింపాలని స్థానిక ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి కోరారు.

సేద్యానికి అధిక ప్రాధాన్యం

జూన్‌లోనే డెల్టాకు నీరు
సిఎం చంద్రబాబునాయుడు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ రంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా దేశంలో ఏ రాష్ట్రం సాధించని విధంగా వృద్ధి రేటు సాధిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ సహాయక కార్యకలాపాలు, వృద్ధి, అనావృష్టి నిరోధం, రైతు బజార్లపై బుధవారం శాసనసభలో జరిగిన లఘు చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయానికి తమ ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాల వల్ల వ్యవసాయంలో జాతీయ సగటు కంటే ఆంధ్రప్రదేశ్ అధిక వృద్ధి రేటు సాధిస్తోందన్నారు. గత ప్రభుత్వాలు వ్యవసాయాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. రైతులు ఎరువుల కోసం పోలీసు లాఠీదెబ్బలు తినాల్సి వచ్చిందన్నారు. కనీసం వ్యవసాయం తెలియని వారిని ఆదర్శ రైతులుగా నియమించి వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారన్నారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉండేదన్నారు. గత పదేళ్లలో 1978 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే, 2014లో 190 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా అనేక చర్యలు తీసుకుంటున్నామని, విధిలేని పరిస్థితుల్లో ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇస్తున్నామని తెలిపారు.

కేంద్రం, ఆర్‌బిఐలు సహకరించకపోయినా దాదాపు రూ.24 వేల కోట్ల పంట రుణాలు మాఫీ చేశామన్నారు. వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవడం ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు పరిచయం చేస్తున్నామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయని తదనుగుణంగా పంటలు పండించాల్సిన అవసరముందన్నారు. ఉద్యాన పంటల్లో రాష్ట్రం అగ్రస్థానంలో ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పాడి పరిశ్రమ, ఆక్వా కల్చర్ ద్వారా రైతుల ఆదాయం పెరుగుతోందన్నారు.

ఎట్టి పరిస్థితుల్లో జూన్‌లోనే కృష్ణా, గోదావరి డెల్టాలకు నీరు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాను హార్టీ కల్చర్ హబ్‌గా మార్చబోతున్నామన్నారు. కర్నూలు జిల్లాను మెగా సీడ్ పార్క్‌గా అభివృద్ధి చేస్తున్నామన్నారు. అగ్రీవాచ్ కార్యక్రమం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో కాఫీ తోటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఇదే సమయంలో ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, దీని ద్వారా పర్యావరణం కాపాడటమే కాకుండా ఖర్చును తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది లక్షా 80 వేల మంది రైతుల సహకారంతో ప్రయోగాత్మకంగా చేపడుతున్నామని చెప్పారు. దాదాపుగా కరువును జయించామని, పెండింగ్‌లో ఉన్న 52 ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా సాగునీటి భద్రతను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అంతకుముందు మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యంగా ముందుకెళుతున్నామన్నారురైతు బజార్లను ఆధునీకరించేందుకు టెండర్లు పిలిచామని, వీటితో పాటు డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

జీరో అవుతున్న జీరో అవర్..!

మంత్రులపై టిడిపి ఎమ్మెల్యేల అసంతృప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జీరో అవర్ జీరో అవుతోందని, అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జీవో అవర్‌లో సమస్యలను ప్రస్తావించినా పరిష్కారం కావడం లేదని అధికార తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు బుధవారం స్పీకర్ కోడెల దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం జీరో అవర్ ప్రారంభం కాగానే పలువురు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను తెలుపుతూ ఇక్కడ మంత్రులు హామీలిస్తున్నా పరిష్కారం కావటం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తాము వేసిన ప్రశ్నలకు తగిన సమాధానాలే ఉండటం లేదన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు స్పందిస్తూ సభ్యుల మనోభావాలు అర్థమయ్యాయని చెప్పారు. జీరో అవర్‌లో సమాధానం చెప్పడం ఎక్కడా ఉండదని వివరణ ఇచ్చారు. సమస్యలను నోట్ చేసుకున్న మంత్రులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటారని చెబుతూ సభ్యులను శాంత పరచడానికి ఆయన ప్రయత్నించారు. స్వపక్షీయులే జీరో అవర్‌లో సమస్యల పరిష్కారానికి నిలదీయడంతో మంత్రులు ఇరకాటంలో పడ్డారు.

గ్రూపులు ఇచ్చారు.. గురువులేరి?

రాజానగరం నియోజకవర్గంలోని ప్రభుత్వ కాలేజ్‌లో సైన్సు గ్రూపులకు అనుమతులు మంజూరు చేసి, అందుకు లెక్చరర్లను నియమించలేదని ఎమ్మెల్యే పి వెంకటేష్ ఆందోళన వ్యక్తం చేశారు. భీమవరంలోని 50 పడకల ఆస్పత్రిని 100కి పెంచాలని ఎమ్మెల్యే రామాంజనేయులు కోరారు. పాతపట్నంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డెంటల్ చైర్‌లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే వెంకటరమణ తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో భూగర్భ జలాలు తగ్గడంతో తాగు, సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎమ్మెల్యే సుజాత పేర్కొన్నారు.



కాలువల్లో నీరు లోలెవల్‌లో వెళ్తుండటంతో ప్రకాశం జిల్లా రైతంగానికి సరిగా నీరందటంలేదని, కనీసం ఆరువేల క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేస్తే పొలాలకు వెళుందని ఎమ్మెల్యే జివి ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. డెల్టా కింద పని చేసే లస్కర్లకు అక్టోబర్ నుంచి జీతాలు రావడం లేదని ఎమ్మెల్యే రాధాకృష్ణ తెలిపారు. సాగర్ జలాలు గిద్దలూరుకు రావడం లేదని ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తెలిపారు.

ఐటిడిఎ సమావేశాల తీరు ఇదిగో..

ఏజెన్సీ ప్రాంతాలైన చింతూరు, రంపచోడవరాల్లో జరిగే ఐటిడిఎ సమావేశాలకు హాజరయ్యే అధికారులు ప్రజాప్రతినిధులు అడిగే వాటికి కనీసం సరైన సమాధానాలైనా చెప్పడం లేదని రంపచోడవరం ఎమ్మెల్యే రాజేశ్వరి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఐటిడిఎ సమావేశాలకు ఎమ్‌పిటిసి, జెడ్‌పిటిసిల సభ్యులు సుమారు 30, 40 కిలోమీటర్లు కాలినడకన కూడా వస్తుంటారని, కానీ కొన్నిసార్లు అధికారులు గైర్హాజరవుతున్నారని తెలిపారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ కాలేజీల్లో ఫ్యాకల్టీ లేదని ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరెడ్డి తెలిపారు. రాజమండ్రి కొవ్వూరు ప్రాంతంలో రోడ్ల పనుల వల్ల సమీప గ్రామాల్లోకి భారీ వాహనాలను అనుమతించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు తెలిపారు. 2014కి ముందు పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలో అనుమతులిచ్చిన 16 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం ఇప్పటి వరకూ పూర్తి కాలేదని, 200 మందికి భూ పట్టాలు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే నారాయణమూర్తి కోరారు.

అధికంగా విధిస్తున్న ఆస్తి పన్ను

పురపాలక సంఘాల్లో ఆస్తి పన్నును అత్యధికంగా వసూలు చేస్తున్నారని, పెనాల్టీ కూడా ఎక్కువగా విధిస్తున్నారని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. కోవూరు నియోజవర్గ పరిధిలో ఆయుర్వేద ఆస్పత్రిని పునరుద్ధరించాలని ఎమ్మెల్యే శ్రీనివాసులురెడ్డి కోరారు. వెలుగొండ నిర్వాసితులకు రూ.12 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే డేవిడ్‌రాజు కోరారు.

జగ్గంపేట నియోజకవర్గంలో మల్లవరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తే 11 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. రూ.136 కోట్లుతో డిపిఆర్ తయారైందని ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎమ్మెల్యేల సమస్యలను నోట్ చేసుకుని తగు చర్యలు తీసుకుంటామని సంబంధిత మంత్రులు హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో 200 అన్న క్యాంటీన్లు : నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే జూన్ 8 నాటికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 200 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. అసెంబ్లీలో 344వ నిబంధన కింద పట్టణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి అనే అంశంపై బుధవారం చర్చ సాగింది. మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో 35.92 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళికలు ఉన్నట్లు తెలిపారు. రూ.38,268 కోట్లుతో ఇప్పటికే 5 లక్షల ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతుందని చెప్పారు. విజయవాడలో కాల్వ పూడిక తీస్తూ దుర్మరణం పాలైన కార్మికుడు బాపిరాజు ఉదంతాన్ని ఎమ్మెల్యే బొండ ఉమ తెలపారు. కాకినాడను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడానికి రూ.1900 కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఇప్పటికే రూ.340 కోట్లతో పనులు ప్రారంభం అయ్యాయని కాకినాడ అర్బన్ ఎమ్మెల్యే ఎ రాజా తెలిపారు. 344వ నిబంధన ప్రకారం నోటీస్ ఇచ్చిన తనకు ఇప్పటికైనా మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలని ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి అనడంతో స్పీకర్ కోడెల శివప్రసాదరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నోటీసులో మీ పేరు లేదని చెబుతూ, కామెంట్ చేసేప్పుడు ఆలోచించి చేయాలంటూ అసహనం వ్యక్తం చేశారు.

పోలవరంపై సిఎం నిజాలు చెప్పాలి

● ఉండవల్లి అరుణ్‌కుమార్



ప్రజాశక్తి - రాజమహేంద్రవరంప్రతినిధి

పోలవరం నిర్వాసితులకు పునరావాసం, భూసేకరణ వ్యయాన్ని రాష్ట్రమే భరిస్తుందని కేంద్రానికి చెప్పినట్లు జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కల వచ్చిందా అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తప్పుబట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆనం రోటరీ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం విషయంలో ముఖ్యమంత్రి ప్రజలకు నిజాలు చెప్పాలన్నారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీతో జరిగిన సమావేశాల్లో ఫేజ్-1లో మునిగే గ్రామాలకు ముందుగా భూసేకరణ, పునరావాసం వ్యయం భరిస్తామని, ఆ తర్వాత ఫేజ్-2లో మునిగే గ్రామాలకు వర్తింపజేస్తామని అధికారులు చెప్పిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. భూసేకరణ, పునరావాసం తామే భరిస్తామని పోలవరం అథారిటీకి ఎందుకు చెప్పారని జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, చీఫ్ ఇంజినీరు ఎం.వెంకటేశ్వరరావును ప్రశ్నించారు. ప్రభుత్వం చెప్పాలని చెబితే అలా చెప్పారా? లేక మీరే సొంతంగా అథారిటీకి చెప్పారా? అనే విషయాలపై తనకు క్లారిటీ ఇవ్వాలని కోరుతూ వారికి లేఖ రాశానన్నారు. ఈ లేఖకు ఏడు రోజుల్లోగా సమాధానం చెప్పకపోతే కోర్టులో పిల్ వేస్తానన్నారు.

పదో తరగతి గణితం పేపర్ లీక్!

అవాస్తవమంటున్న అధికారులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

పదో తరగతి గణితం పేపర్-1 ఇంగ్లీషు మీడియం ప్రశ్నాపత్రం లీకైందనే ప్రచారం పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో బుధవారం హల్‌చల్ చేసింది. ఒక మీడియా సంస్థకు చెందిన వాట్సాప్ నెంబర్‌కు బుధవారం ఉదయం పదిన్నర సమయంలో ప్రశ్నాపత్రం, దానికి సంబంధించిన జవాబులతో కూడిన నాలుగు పేపర్ల ఫొటో తీసి పంపినట్టు ప్రచారం సాగింది. పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ప్రశ్నాపత్రం తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో ఉన్న గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన కేంద్రం నుంచి లీకైందనే ప్రచారం సాగడంతో అందరి దృష్టీ ఆ కేంద్రంపై పడింది. విద్యాశాఖాధికారులు ఉన్నతాధికారుల దృష్టికి సమాచారం అందించారు. దీనిపై మధ్యాహ్నం రెండు గంటల సమయంలో డిఇఒ రేణుక ఆ పాఠశాలకు చేరుకుని తనిఖీలు నిర్వహించారు. అప్పటికే పరీక్ష ముగియడం విశేషం. ఆ కేంద్రం నుంచి ప్రశ్నాపత్రం లీకయ్యేందుకు ఆస్కారం లేదని, ఈ ప్రచారం ఎక్కడ నుంచి ప్రారంభమైందనే దానిపై లోతుగా విచారణ చేస్తామని ఆమె తెలిపారు.

ఒకే కాన్పులో ముగ్గురికి జననం

ప్రజాశక్తి-నరసరావుపేట (గుంటూరు)

ఒకే కాన్పులో ముగ్గురికి జన్మనిచ్చిన ఘటన గుంటూరు జిల్లా నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం చోటుచేసుకుంది. మండల కేంద్రమైన దాచేపల్లికి చెందిన బండ్ల అంకమ్మ ప్రసవం కోసం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో రెండ్రోజుల కిందట చేరింది. మంగళవారం రాత్రి నొప్పులు రావడంతో వైద్యులు చికిత్స మొదలు పెట్టారు. ఈ క్రమంలో 11.11 గంటలకు ఒకరు, 11.12 గంటలకు మరొకరు, 11.13 గంటలకు ఇంకొకరు చొప్పున ముగ్గురికి జన్మనిచ్చింది. వీరిలో ఇద్దరు మగపిల్లలు కాగా, ఒక ఆడపిల్ల ఉంది. వీరు వరుసగా 1.2 కిలోలు, 1.3 కిలోలు, 1.4 కిలోల బరువున్నారని, అందరూ ఆరోగ్యంగానే ఉన్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ మోహన్‌శేషు, డాక్టర్ మాధవిలత తెలిపారు.



కేంద్రంపై అంతా ఒత్తిడి పెంచాలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పార్టీలకు అతీతంగా అంతా ఒకే మాట మీద నిలబడి కేంద్రంపై ఒత్తిడి పెంచాలి. కేంద్రం ఇచ్చిన విభజన హామీలను అమలు చేయించాలి. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే గందరగోళం సృష్టిస్తున్నారు. రాష్ట్రాన్ని విభజించినపుడూ ఇంత కంటే గందరగోళ పరిస్థితి ఉంది.

- కత్తి నరసింహారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

ప్రజలను నమ్మించే ప్రయత్నం

తెలుగుదేశం పార్టీ నాయకులు చెప్పిందే చెప్పి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. నాలుగేళ్లలో లేనిది పది రోజుల్లో ఎలా మారిపోయింది? అడిగినంతా ఇవ్వాలి, లేకపోతే ఇలాగే చేస్తాం అన్నట్లుగా మాట్లాడుతున్నారు. దక్షిణ భారతదేశాన్ని చిన్న చూపు చూస్తున్నామని ప్రాంతీయ విభేదాలు తెచ్చే ప్రయత్నం టిడిపి చేస్తోంది. అవినీతికి సంబంధించిన అంశాలనేకం ఉన్నాయి, వాటిని బయటకు తెచ్చి ప్రజలకు వాస్తవాలు తెలియచెప్పే ప్రయత్నం చేస్తాం. టిడిపి యూ టర్న్ తీసుకోవడాన్ని అవకాశంగా వినియోగించుకుంటాం. చంద్రబాబు పాదయాత్రలో 1500 వాగ్దానాలు చేశారు. వాటిలో ఎన్ని నెరవేర్చారు?

- పిఎన్ మాధవ్, బిజెపి ఎమ్మెల్సీ

పవన్‌కు అభివృద్ధి కనిపించడం లేదా?

ఆంధ్రప్రదేశ్‌లో చేస్తున్న అభివృద్ధి జనసేన అధినేత పవన్‌కి కనిపించడం లేదా? లోకేశ్ మీద అవినీతి ఆరోపణలు అర్థ రహితం. ఆస్తులు బహిరంగంగా ప్రకటించగల నాయకుడు లోకేశ్ మాత్రమే. జగన్ మాదిరిగా తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆస్తులు కూడగట్టుకోవడం లోకేశ్‌కి చేతకాదు.

- పల్లె రఘునాథరెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్

బిజెపి, వైసిపి, జనసేనకు బుద్ధి చెప్పేది ప్రజలే

బిజెపి, వైసిపి, జనసేనకు ప్రజలే బుద్ధి చెబుతారు. కేంద్రంపై పెట్టిన అవిశ్వాసం చర్చకు రాకుండా చేయడం హేయమైన చర్య. అవిశ్వాసం చర్చకు రాకుండా చేస్తోన్న ప్రధాని మోడీని జగన్ విమర్శించడం లేదు. కేసుల మాఫీ కోసం జగన్ ఆరాటపడుతున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసమే విజయసాయిరెడ్డిని రాజ్యసభకు పంపారు. ఆంధ్రుల హక్కులను మేమే కాపాడతాం.

- జివి ఆంజనేయులు, టిడిపి ఎమ్మెల్యే, వినుకొండ.

ప్యాకేజి ఒకరు.. కేసుల మాఫీకి మరొకరు


ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను పక్కన పెట్టి ప్యాకేజి కోసం ఒకరు.. కేసుల మాఫీ కోసం మరొకరు పాకులాడుతున్నారు. ఇది చాలా దుర్మార్గం. టిడిపి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని పార్లమెంటులో చర్చకు రాకుండా అడ్డుకోవడం దురదృష్టకరం. చంద్రబాబును చూసి మోడీకి భయం పట్టుకుంది. ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలని మోడీ, అమిత్‌షా చూస్తున్నారు. బిజెపిని తెలుగుజాతి క్షమించదు. తమిళనాడు తరహాలో ఎపిలో ఆటలు సాగవు.

- ఎ ఆనందరావు, టిడిపి ఎమ్మెల్యే, అమలాపురం.

టిడిపి టిఆర్ఎస్ కలిసి పోరాడాలి

అన్నదమ్ములుగా విడిపోయాం. అన్నకో, తమ్ముడికో ఇబ్బంది వచ్చినపుడు ఇద్దరూ కలిసి టిడిపి, టిఆర్ఎస్) పోరాడాలి. తమిళనాడు ఎంపిలు బిజెపికి తొత్తులుగా మారారు. అందుకే సభను అడ్డుకుంటున్నారు. మార్కులు వేయాల్సి వస్తే చంద్రబాబుకు వందకు వంద, మోడీకి సున్నా, జగన్‌కు రెండు సున్నాలు, పవన్‌కు మూడు సున్నాలు వేయాలి.

- బుద్ధా వెంకన్న, టిడిపి ఎమ్మెల్సీ



గుంటూరులోని నాయుడుపేటలో మురుగు నీటిలో ఉన్న తాగునీటి పైప్‌లైన్

దడ పుట్టిస్తున్న డయేరియా

మూలాలను కనుగొనని కార్పొరేషన్
ప్రజలపై నెపం నెట్టే ప్రయత్నం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరును డయేరియా ఇప్పటికీ వీడలేదు. డయేరియాతో బాధితులు ఇప్పటికీ ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్తూనే ఉన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో 40 మంది చికిత్స పొందుతుండగా ప్రయివేటు ఆస్పత్రులకూ పెద్ద సంఖ్యలో రోగులు వస్తూనే ఉన్నారు. ఇదిలా ఉండగా డయేరియా ప్రబలడానికి కేవలం తాగునీటి సరఫరాలో లోపం కాదని, ప్రజలు ఎక్కడబడితే అక్కడ ఆహార పానీయాలు కొనుగోలు చేయడం, వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వల్ల వస్తోందని అధికారులు, మంత్రులు వాదిస్తున్నారు. కానీ కృష్ణా నది నుంచి వస్తున్న నీటిలో వివిధ రకాల బ్యాక్టీరియా ఉందని, నీటి శుద్ధి సరిగా లేని దృష్ట్యా ఈ సమస్య వచ్చిందని మరికొందరు అధికారులు అభిప్రాయపడుతున్నారు. నీటి కలుషితం వల్ల వాంతులు, విరోచనాలు చాలా మందికి వస్తుంటాయని, అయితే ఇటీవల పాత గుంటూరు ప్రాంతంలో ఒకేసారి ఎక్కువ మంది డయేరియా బారిన పడటం వల్ల సమస్య తీవ్రత వెలుగులోకి వచ్చిందని వైద్య నిపుణులు చెబుతున్నారు. నీటి శుద్ధిలో లోపాన్ని నివారించకపోవడం, పలు మార్గాల్లో పైపు లైన్ల లీకేజీ, ప్రస్తుతం గుంటూరు భూగర్భ డ్రెయినేజీ పనులు, తాగునీటి పైపు లైన్ల పనులు ఒకేసారి చేపట్టడం, పాత పైపు లైన్లు కాల్వల్లో ఉండిపోవడం తదితర కారణాల వల్ల నీరు కలుషితం అవుతుందని ఇటీవల గుంటూరు వచ్చిన వివిధ ప్రాంతాలకు చెందిన మున్సిపల్ కమిషనర్లు అంచనా వేశారు. డయేరియా తీవ్రత తగ్గే వరకూ గుంటూరులోనే ఉండాలని సిఎం ఆదేశాలతో నాలుగు రోజులుగా ఇక్కడ పర్యటిస్తున్న మంత్రి పి.నారాయణ బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. డయేరియా కేసులు సాధారణ రోజుల్లోనూ వస్తాయని అంగీకరించారు. పైపులైన్ల మార్పిడి పనులు జరుగుతున్నాయని అన్నారు.

సంపాదకీయం

క్షమార్హం కాని నిర్లక్ష్యం

ఇరాక్‌లో ఐసిస్ ఉగ్రవాదులు 39 మంది భారతీయులను కిడ్నాప్ చేసి వధించిన ఘటన పట్ల నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రదర్శించిన నిర్లక్ష్యం ఏమాత్రమూ క్షమించరానిది. ఒక సర్వ స్వతంత్ర సార్వభౌమాధికార దేశం విదేశాల్లో తన పౌరులెదుర్కొన్న అమానుషం పట్ల ఇంత లెక్కలేని తనంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటే నమ్మలేం! బాధిత కుటుంబాలు కాళ్లా వేళ్లా పడ్డా, కన్నీళ్లతో వేడుకున్నా ఏలినవారి హృదయాలు కరగలేదు. మాయమాటలతో కాలహరణం చేశారే తప్ప దేశం కాని దేశంలో అపహరణకు గురైన వారి ఆచూకీ కనుగొనడానికి చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేయలేదు. పైగా నోటికొచ్చినన్ని అసత్యాలతో తప్పుదోవ పట్టించే ప్రయత్నం సర్కారే చేయడం దారుణం! ఇరాక్‌లోని మోసుల్ నగరంలో భవన నిర్మాణ పనులు చేయడానికి పంజాబ్, పశ్చిమ బెంగాల్, బీహార్, హిమాచల్ ప్రదేశ్ నుండి 40 మంది కార్మికులను ఒక కాంట్రాక్టర్ తీసుకుపోయాడు. నాలుగేళ్ల క్రితం ఇరాక్‌లో మోసుల్ నగరాన్ని ప్రభుత్వం నుండి ఐసిస్ ఉగ్రవాదులు స్వాధీనం చేసుకున్నప్పుడు ఈ కార్మికులంతా ఉగ్రవాదుల చెరపడ్డారు. వారిలో ఒక్క కార్మికుడు తప్పించుకుని స్వదేశం రాగా మిగిలిన వారిని ముష్కరులు చిత్రహింసలు పెట్టి చంపేశారు. బందీలు చనిపోయి ఉంటారని ఈ నాలుగేళ్లూ సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నా కేంద్ర ప్రభుత్వం వాటిని తోసిపుచ్చింది. బందీఖానా నుండి ప్రాణాలతో బయటపడిన వ్యక్తి మిగిలిన వారందరినీ ఉగ్రవాదులు హతమార్చారని చెప్పినా నమ్మడానికి ససేమిరా అని, ఇప్పుడు అదే విషయాన్ని ధృవపరచి, మొసలి కన్నీళ్లు కార్చడం దేనికి సంకేతమో అర్థం కాదు! కిడ్నాప్ చోటుచేసుకున్న 2014 నుండి 2017 జులై వరకు బాధితులందరూ క్షేమంగా ఉన్నారనే మోడీ ప్రభుత్వం దాదాపు 12 సార్లు చెప్పింది. బందీలుగా ఉన్న 39 మంది భారతీయులు ప్రాణాలతో క్షేమంగా ఉన్నారని, వారికి ఆహారంతో పాటు ప్రాథమిక సదుపాయలు సమకూరుతున్నాయంటూ నమ్మబలికింది. 2017 జులై 22న లోక్‌సభలో సాక్షాత్తూ విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ వివిధ వర్గాల నుండి అందుతున్న విశ్వసనీయ సమాచారం మేరకు బందీలుగా ఉన్నవారందరూ క్షేమంగా ఉన్నారని ప్రకటించారు. అంత ఆర్భాటంగా చేసిన ప్రకటన నీటిమూటై, బాదిత కుటుంబాలకు కన్నీళ్లు మిగిలిన వేళ, జాతి మొత్తాన్ని తప్పుదోవ పట్టించిన ఆ విశ్వసనీయ వర్గాల వివరాలను ప్రజల ముందుంచే సాహసాన్ని కేంద్ర ప్రభుత్వం చేస్తుందా? ఏ వర్గాలు, సంస్థల నుండి వచ్చిన సమాచారం ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఇన్ని సంవత్సరాలు కళ్లు మూసుకుని ఉందో తెలుసుకునే హక్కు ప్రజలకు లేదా? ఇది మన సమాచార వ్యవస్థ వైఫల్యమా? లేని పక్షంలో అటువంటి సమాచారమేది లేకుండానే కేంద్ర ప్రభుత్వం ఇన్నాళ్లు తప్పుదోవ పట్టించిదా? దేశ ప్రజలను వెంటాడుతున్న ఈ ప్రశ్నలకు మోడీ ప్రభుత్వం జవాబిచ్చి తీరాలి.

నిజానికి నాలుగేళ్ల సుదీర్ఘ కాలంలో బాధిత కుటుంబాల సభ్యులు ఎన్ని సార్లు కేంద్ర మంత్రులను, అధికారులను కలిశారో లెక్కేలేదు. కలిసిన ప్రతిసారి వారి అనుమానాలను వ్యక్తం చేసినా పట్టించుకున్న నాథుడే లేడు. మరోవైపు కిడ్నాప్‌నకు గురైన వారు ప్రాణాలతో తిరిగివచ్చే అవకాశం లేదన్న అనుమానాలు అనేక వర్గాల నుండి అందుతున్నా సర్కారులో చలనం కనిపించలేదు. గత ఏడాది దాదాపుగా అనేక దేశాల నుండి, ముఖ్యంగా ఇరాక్‌కు సరిహద్దు దేశాల నుండి ఈ రకమైన సంకేతాలు అందాయి. ఈ సమాచారం అందిన తరువాత 2017 జులైలో భారత పాత్రికేయ బృందం ఒకటి మోసుల్‌ను సందర్శించి కిడ్నాప్‌నకు గురైన వారెవ్వరూ బతికిఉండే అవకాశం లేదని ధృవీకరించింది. ఈ బృందం పర్యటన తరువాత కూడా అందరూ బతికేఉన్నారంటూ లోక్‌సభలో నొక్కి వక్కాణించిన కేంద్ర ప్రభుత్వం తమ నిర్వాకానికి ఇప్పుడేమి జవాబు చెబుతుంది? పైగా అత్యంత విషాదకరమైన ఆ ప్రకటనను కేంద్ర సర్కారు చేసిన తీరు దారుణంగా ఉంది. ప్రభుత్వం పదేపదే చేసిన తప్పుడు ప్రకటనలతో ఆశలు పెంచుకున్న బాధిత కుటుంబాలకు కనీస ముందస్తు సమాచారం ఇవ్వకుండా పార్లమెంటులో మంత్రి చేసిన ప్రకటన ఉరుములేని పిడుగులా పడింది. టివీల్లో వార్తలు చూసి తమ ఆప్తులు ఇకలేరన్న విషయం వారు తెలుసుకోవాల్సివచ్చింది. కనీస మానవత్వం చూపకుండా చేసిన ఈ పనికి పార్లమెంటరీ నిబంధనలను అడ్డుపెట్టుకోవడం శోచనీయం. పార్లమెంటు జరుగుతున్నప్పుడు బంధువులకు ముందుగా చెప్పగూడదనడానికి ఇదేమీ విధాన ప్రకటన కాదు. పార్లమెంటరీ, ప్రజాస్వామ్య సాంప్రదాయాల మీద కమలనాధులకున్న చిత్తశుద్ధి ఏమిటో అవిశ్వాస తీర్మానం విషయంలో ప్రత్యక్షంగా మనం చూస్తునే ఉన్నాం! ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి! నష్టపరిహారం చెల్లించాలి. సాధ్యమైనంత త్వరగా మృతదేహాలను దేశానికి తీసుకువచ్చి అంతిమ సంస్కారాలకు అవకాశం కల్పించాలి.

ఇదీ విషయం



హోదా ఇవ్వాలని నాడు
గర్జించిన నేత ఒకరు...
చర్చకు రానీయకుండా
చక్రం తిప్పేస్తున్నరు!

కుర్చీల్లో రచ్చ తప్ప
ఒరుగుడేమి లేదు మనకు...
జనం తీర్పు ఒక్కటే
న్యాయం చేసేది తుదకు!

- కొల్లూరు వెంకట్

నిర్వేదానికి క్షమార్హత లేదు!

విశ్లేషణ

ముఖ్యమంత్రి చంద్రబాబు తను ఇన్నాళ్లు అనుసరించిన అప్రజాస్వామిక, అసంబద్ధ విధానాలకు తోడు కేంద్రం వద్ద లొంగుబాటు వైఖరి.. తిరిగి ప్రశ్నల రూపంలో ఎదురౌతున్నాయి. జనసేన అధినేత ప్రశ్నలకే ఉలిక్కిపడిన ముఖ్యమంత్రి తాజాగా బిజెపి ప్రకటించినట్లు మున్ముందు అది వేయనున్న ప్రశ్నలు ఏ రూపంలో వుంటాయో వేచి చూడాలి. ఏపి ప్రజలను పచ్చిగా మోసం చేసిన బిజెపియే బరి తెగించి తన ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పవలసి వుందని ప్రకటించిందంటే దీని లోతుపాతులు ఏ మేరకు వుంటాయో భవిష్యత్తు తేల్చవలసి వుంది.

ఇటీవల వరకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజించిందని ఫలితంగా సీమాంధ్ర అనాథగా మిగిలిపోయిందని వాదిస్తూ వచ్చిన ముఖ్యమంత్రి తాజాగా ఈ దుర్మార్గానికి బిజెపి కూడా కారణమని కొత్త పాట మొదలు పెట్టారు. అందుకే పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రిని ఉద్దేశించి మూడు మాటలు ఆరు అబద్ధాలు అని వ్యాఖ్యానించారేమో. ఈ వరుస క్రమంలో ముఖ్యమంత్రి రాజకీయ ఫల్టీలు చాలా వున్నాయి. రాష్ట్ర విభజనకు అంగీకరిస్తూ రెండు దఫాలు అప్పట్లో కేంద్రానికి లేఖలు రాశారు. ఇది మరుగుపరిస్తే చరిత్ర పుటల నుండి తొలిగిపోదు. పోనీ ఇదొక చారిత్రక వాస్తవంగా అంగీకరించినా గత తన తొమ్మిదేళ్ల పరిపాలనా కాలంలో హైదరాబాదును విశ్వనగరం చేయడం, కొండల్లో గుట్టల్లో సైబరాబాదు నగర నిర్మాణం చేసిన కృషిలో 10 శాతమైనా అదే సమయంలో సీమాంధ్రలో ఏదో ఒక నగరాన్ని ముఖ్యమంత్రి అభివృద్ధి చేసి వుంటే నేడు ఈ దుస్థితి ఏర్పడేది కాదని ఎవరైనా ప్రశ్నిస్తే కొంటె ప్రశ్నగా దాటవేస్తారా? లేక ఏం సమాధానం చెబుతారు? ఇదే జరిగివుంటే ఈ రోజు సీమాంధ్ర ఇంత దుర్భర స్థితిలో వుండేది కాదు కదా! ఈనాడు ముఖ్యమంత్రి అనుసరిస్తున్న కేంద్రీకృత విధానాలే ఇన్ని అనర్థాలకు మూలంగా వుంది. తాజాగా సీమ, ఉత్తరాంధ్రల పట్ల ముఖ్యమంత్రి వైఖరి ప్రాంతీయ అసమానతలు పెంచే విధంగా ఉంది. దీనికి తోడు రాష్ట్ర విభజన తథ్యమని తేలిన తర్వాత కూడా మిగతా వారి విషయం వదిలేసినా అప్పటికే 35 ఏళ్ల రాజకీయానుభవం గల ముఖ్యమంత్రి శాస్త్రీయంగా విభజన ఎలా జరగాలో కేంద్రం పట్టించుకొన్నా, పట్టించుకోక పోయినా ఏదైనా ప్రతిపాదన ఎందుకు చేయలేదు? ఇవన్నీ చారిత్రక వాస్తవాలు. చరిత్ర పుటల నుండి ఎవరూ తొలగించలేరు.



వి శంకరయ్య

ఈ రోజు ఏపిలో పాపులర్ మీడియా చేతిలో వుందని లేనిది వున్నట్లు, వున్నది లేనట్లు చూపించినంత మాత్రాన ప్రజలకు జ్ఞాపక శక్తి లేదని ముఖ్యమంత్రి భావిస్తే వెర్రితనమే అవుతుంది. రాష్ట్ర విభజన జరిగిన సమయంలోను, తదుపరి టిడిపి, బిజెపి జట్టు కట్టిన మాట వాస్తవం. ఇందులో ఎవరు ముందుగా ప్రేమాయణానికి శ్రీకారం చుట్టారో ప్రజలకు అప్రస్తుతం. అధికారాలు చేపట్టిన బిజెపి, టిడిపి రెండు పార్టీలు కూడా ఏపికి జరిగిన నమ్మక ద్రోహానికి సమాధానం చెప్పవలసి వుంది. ముఖ్యమంత్రి పరిభాషలో చెప్పాలంటే అన్యాయం చేసిన కాంగ్రెస్ మట్టిగొట్టుకు పోయింది. ఈ నేరానికి బిజెపి కూడా బాధ్యత వహించాలని మూడున్నరేళ్ల తర్వాత ముద్దాయిగా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నించడం అనైతికతకు దర్పణం తప్ప మరొకటి కాదు. తొలి నుండి కూడా కేంద్ర ప్రభుత్వం దశల వారీగా స్లో పాయిజన్ విధానం అమలు చేస్తూ రాష్ట్రానికి విద్రోహం చేసింది. కేంద్రం తాన అంటే ముఖ్యమంత్రి తందాన అని పాట పాడటం కూడా అంతే వాస్తవం. ఈ మూడున్నరేళ్ల కాలంలో ప్రత్యేక హోదా కోసం పోరాటాలు సాగించిన ప్రతి వారి పట్ల పోలీస్ జులుం ప్రదర్శించారు. హోదా అంటే జైలుకు పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తుదకు ఏడాదిలోనే కారణాలు ఏవైనా సరే ప్రత్యేక హోదా కావాలని కోరుతూ నేడు కేంద్రంతో తెగతెంపులు చేసుకోవడాన్ని, దఫాల వారీగా మాటలు మార్చడాన్నే పవన్ కళ్యాణ్ ఆరు అబద్ధాలుగా అభివర్ణించడానికి ఆస్కారమేర్పడింది.

ఈ సందర్భంలో పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అవినీతి కూపంగా ఆరోపించడం కొత్తేమీ కాదు. తెలుగు దేశం పార్టీకి అనుకూలంగా వున్న ఒక పత్రిక సైతం ఈ విషయమై భారీ కథనాలను ప్రచురించిన రోజులున్నాయి. ఇంతకాలం లేని ఉలుకుపాటు ముఖ్యమంత్రికి నేడు ఎందుకు వచ్చినట్లు? అందరూ వేలెత్తి చూపేసరికి భయం పట్టుకుంది. 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో అప్పటి ప్రధాని కన్నా ఎక్కువగా బిజెపి నేతలు వెంకయ్య నాయుడు, అరుణ్ జైట్లీ ఏపికి ప్రత్యేక హోదా గురించి నొక్కి చెప్పారు. 2014 ఎన్నికల సందర్భంగా ప్రధాని అభ్యర్థిగా మోడీ ప్రత్యేక హోదా గురించి పలు సభలలో హామీ ఇచ్చారు. 2016 సెప్టెంబరు వరకు బిజెపితో పాటు ముఖ్యమంత్రి ప్రజల్ని ఊరిస్తూ వచ్చి తుదకు మంగళం పాడారు. ప్రత్యేక ప్యాకేజీ పేరుతో ఇద్దరూ కలిసి ఏపి ప్రజల గొంతు కోశారు. ఇది వాస్తవం కాగా ఒక్క ఏడాదిలోనే కేంద్ర విద్రోహం గుర్తించినట్లు ముఖ్యమంత్రి బేలతనంతో కూడిన ప్రకటనలు చేస్తున్నారు. ఈఏపిల పథకాలు దీర్ఘకాలం కొనసాగుతాయని ప్యాకేజీ కాల పరిమితి ముగిస్తే రాష్ట్రానికి నిధులు అందే అవకాశం లేదని ఇటీవల ప్రారంభమైన జ్ఞానోదయం 40 ఏళ్ల రాజకీయానుభవం గల ముఖ్యమంత్రికి 2016 సెప్టెంబరులో గానీ, 2017 మార్చిలోగాని గుర్తుకు రాలేదంటే నమ్మగలమా? పైగా వైసిపి అవిశ్వాసం పెడతామని ప్రకటించిన సందర్భంలో ఇందువల్ల ఏమి సాధింపబడుతుందని నిన్న మొన్నటి వరకు మొండి వాదన చేసిన ముఖ్యమంత్రి... తుదకు వైసిపి పెట్టిన అవిశ్వాసానికి మద్దతిస్తానని చెప్పి... తిరిగి ఒక్క రోజు వ్యవధి లోనే తన పార్టీ చేతనే అవిశ్వాసం పెట్టడానికి తలపడడం రాజకీయ వ్యూహంలో భాగమైనా అతి కొద్ది రోజుల్లోనే ఇన్ని మాటలు మార్చడంతో ప్రజల ముందు చులకన కావడం లేదా? రాష్ట్ర అభివృద్ధి కోసమే కేంద్రం వద్ద ఎన్ని అవమానాలైనా భరించి సఖ్యతగా ఉన్నానని చెబుతూ వస్తున్న ముఖ్యమంత్రి మాటలకు నేడు అర్థం లేకుండా పోయింది. కేవలం రాజకీయావసరాలతోనే మాటలు మార్చినట్లు ఇది వరలోనే బిజెపి నేతలు చేసిన ఆరోపణలకు బలం చేకూరింది. అంతే కాదు ఇటీవల వరకు బిజెపితో తాము సాగించే సఖ్యత అపూర్వమైందని తాము వైదొలిగితే వైసిపి చెలిమి చేయాలని చూస్తున్నదని చేసిన వాదన నేడు బిజెపితో బంధం తెంచుకోవడం పవిత్రంగా ఎలా మారుతుంది?



కేంద్రం రాష్ట్రానికి ఎంత నష్టం కలిగిస్తున్నా మూడున్నరేళ్లు ముఖ్యమంత్రి కేంద్రానికి గులాంగిరి చేశారు. 29 సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగానని నేడు ముఖ్యమంత్రి చెబుతున్న మాటలకు రాష్ట్ర ప్రజల నుండి క్షమార్హత లభించే అవకాశం ఏ మాత్రం లేదు. వాస్తవం చెప్పాలంటే ఏపిలో శాసన సభా స్థానాలు పెరగకపోతే కనీసం 50 నియోజక వర్గాలలో ఎన్నికలు సమీపించే సరికి పలువురు దేశం నేతలు గోడ దూకడం ఖాయం.

ప్రధాని మోడీ ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వదలచి వుంటే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి వుండేవారు కాదు. ఏపికి ప్రత్యేక హోదా ఇస్తే ఇతర రాష్ట్రాలు ప్రత్యేక హోదా కోరవచ్చని భావించి వుంటే తెలంగాణలోని ముంపు మండలాలను ఆర్డినెన్స్ ద్వారా ఏపిలో చేర్చినప్పుడు ప్రత్యేక హోదాను కూడా చేర్చే వారు. సమస్య అది కాదు. ఇద్దరిది ఒకే మాట–ఒకే బాట. ఒకటి ఆర్థికపరమైంది. రెండు రాజకీయ పరమైంది. ఆర్థిక పరంగా ఒనగూడే అవసరాలే ముఖ్యమంత్రికి ప్రధానమై వుంటే ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించే వారు కాదు. రాజకీయావసరాలు అడ్డు వచ్చినందున ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించారు. కేంద్రం రాష్ట్రానికి ఎంత నష్టం కలిగిస్తున్నా మూడున్నరేళ్ల ముఖ్యమంత్రి కేంద్రానికి గులాంగిరి చేశారు. 29 సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగానని నేడు ముఖ్యమంత్రి చెబుతున్న మాటలకు రాష్ట్ర ప్రజల నుండి క్షమార్హత లభించే అవకాశం ఏ మాత్రం లేదు. వాస్తవం చెప్పాలంటే ఏపిలో శాసన సభా స్థానాలు పెరగకపోతే కనీసం 50 నియోజక వర్గాలలో ఎన్నికలు సమీపించే సరికి పలువురు దేశం నేతలు గోడ దూకడం ఖాయం. ఈ అంశం పైనే రాష్ట్ర బిజెపి నేతలు ఇది వరకే పలు మార్లు గుట్టు విప్పారు. తాజాగా ఏపికి చెందిన కేంద్ర బిజెపి అధికార ప్రతినిధిగా వున్న నరసింహారావు ఒక ఇంటర్వ్యూలో రాజకీయ కారణాలతోనే బిజెపితో టిడిపి తెగతెంపులు చేసుకుంటున్నదని స్పష్టపరిచారు. తెలుగుదేశం పార్టీ– పార్టీ ఫిరాయింపులకు పాల్పడడం అప్రజాస్వామికమని ఈ దశలో పార్టీని కాపాడుకొనేందుకు శాసన సభా స్థానాలు పెరగాల్సిన అవసరముందని ఇందుకు తాము అంగీకరించేది లేదని స్పష్ట పరిచారు. ఇన్నాళ్లూ తోడు దొంగలుగా వున్న బిజెపి, టిడిపి పార్టీలు మున్ముందు ఒకరి పరువు మరొకరు ఏ విధంగా తీసుకొంటాయో నాటకం రసవత్తరంగా వుండబోతోంది.

తమాషా ఏమంటే తెలుగు దేశం పార్టీని సమర్థించినంత కాలం పవన్ కళ్యాణ్‌పై ఈగ వాలకుండా చూసుకొన్న ముఖ్యమంత్రి తాజాగా చేస్తున్న ఆరోపణలు తీవ్రంగా వున్నాయి. సమాచార మాధ్యమాలలో వ్యక్తిగత జీవితంపై పెడుతున్న పోస్టింగ్‌లు విపరీత ధోరణిలో వున్నాయి. ఇదిలా వుంటే పవన్ కళ్యాణ్ వామపక్షాలతో కలిసి ఉద్యమించేందుకు బహిరంగంగా ప్రకటించి సిద్ధమౌతుండగా బిజెపి రాసిచ్చిన స్క్రిప్టును చదివాడని తన పార్టీ నేతలతో ఆరోపించడం దివాళాకోరుతనం తప్ప మరొకటి కాదు. చేతికి దొరికిన ప్రతి రాయి విసిరే పిచ్చివాడిని తలపించే విధంగా ఈ వ్యవహార సరళి వుంది.

(రచయిత విశ్రాంత పాత్రికేయుడు,
సెల్ : 9848394013)

సోషల్ మీడియా

ప్రోటోకాల్



నల్ల కళ్లజోడుతో
ప్రధానిని పలుకరించిన
ఛత్తీస్‌గఢ్ కలెక్టర్
ప్రోటోకాల్ ఉల్లంఘనతో చీవాట్లు!



ముఖేష్ అంబానీ ప్రధాని వీపుపై
చేయి వేయడం
ప్రోటోకాల్ ఉల్లంఘన కాదా?

పార్టీ



కోడిని కోసుకొని తింటే చికెన్ పార్టీ...
మేకను కోసుకొని తింటే మటన్ పార్టీ...
మధ్య తరగతిని కోసుకొని తినేది
భారతీయ జనతా పార్టీ...

'స్వచ్ఛత'



అరే స్వచ్ఛ భారత్ అంటే రోడ్లు
ఊడ్చుకుంటూ ఉండడమే
అనుకున్నా.... బ్యాంక్‌లు
కూడా ఊడ్చి పెట్టడం అని
ఇప్పుడే తెలుస్తోంది...

దేశ భక్తి!



జాతీయ పతాకంతో ముఖం తుడుచుకున్న
తొలి భారత ప్రధాని బహుశా
నరేంద్ర మోడీనే అయి వుంటారు
దేశ చరిత్రలో ఇదే
అత్యంత సిగ్గుమాలిన పని!

ప్రాధాన్యత



రూ. 3550 కోట్లతో పటేల్
విగ్రహం,
రూ.2,500 కోట్లతో
శివాజీ విగ్రహం,
రూ.లక్ష కోట్లతో గుజరాత్
బుల్లెట్ ట్రైన్!
అమరావతికి చెంబుడు
నీళ్లు, మట్టి!

జన వాక్యం

అడ్డగోలు వాగ్దానాలకు కళ్లెం



ఎన్నికలలో గెలవడమే రాజకీయ నాయకుల అజెండాగా వుంటోంది. గెలుపు కోసం ఎలాంటి హామీలైన ఇచ్చేస్తుం టారు. తీరా గెలుపు సొంత మైతే ఆ హామీలన్నీ అటకెక్కుతాయి. అందుకే విభజన చట్టంలో వున్న హామీలను నెరవేర్చడానికి పాలక ప్రభుత్వాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. పార్లమెంటు సాక్షిగా నేతలు చేసిన వాగ్దానాలను నీటి మీద రాతలుగా మార్చేశారు. మన ప్రధాని ఎన్నికల హామీలను పరిశీలిస్తే ముఖ్యంగా నల్ల ధనం బయటకు తెప్పిస్తామని, అందుకోసం ఆర్థిక నేరాల వ్యాజ్యాలను ప్రత్యేక న్యాయస్థానాల ద్వారా ఏడాది లోపలే పరిష్కరిస్తామని అన్నారు. అయితే అటువంటి నేరాలకు పాల్పడిన వారిపై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇటువంటి వాగ్దానాలు చేసిన వారి రాజకీయ పక్షాల గుర్తింపు రద్దు చేయాలి. ఎన్నికల సంఘానికి ఆ అధికారం వుండేలా కఠిన చట్టాలు రావాలి. అప్పుడే పాలకుల అడ్డగోలు వాగ్దానాలకు కళ్లెం పడుతుంది.

ఉప్పలపు శేషునాథ్, నైనవరం.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

రష్యా అధ్యక్ష ఎన్నిక ఓ ప్రహసనం

అంతర్జాతీయం

బద్ధకంగా కలలు కనేవారికి నియంతృత్వం కూడా ఒక పాలనా విధానం మాదిరే కనిపించి మాయ చేస్తుంది, వారికి మరొక ప్రత్యామ్నాయం కనిపించదు. ఇది ఆదివారం నాడు జరిగిన రష్యన్ ఎన్నికలలో మరోమారు ఎన్నికైన వ్లాదిమిర్ పుతిన్ విజయం గురించి ఒక వ్యాఖ్యాత చేసిన వర్ణన. వాస్తవానికి ఎంతో దగ్గరగా వుంది. అసలు ఎన్నికలే జరపని నియంతలు కొందరైతే ప్రత్యర్థులకు అవకాశాలు లేకుండా చేసి అప్రజాస్వామికంగా యంత్రాంగాన్ని పూర్తిగా తనకు అనుకూలంగా మలచుకొనే తరగతికి చెందిన వ్యక్తి పుతిన్. అందుకే ఆయన తప్ప మరొకరు విజయం సాధించలేరని, ఎన్నిక లాంఛన ప్రాయమే అని పరిశీలకులు ముందుగానే ఊహించారు. ఫలితాలు కూడా అలాగే వచ్చాయి.

ఎన్నికలలో అవినీతి, అక్రమాల ఆరోపణల మధ్య పుతిన్‌కు 77, కమ్యూనిస్టు పార్టీ బలపరిచిన అభ్యర్థి గ్రడినిన్‌కు 12, మితవాది జిరినోవ్‌స్కీకి 5.65 శాతం ఓట్లు వచ్చాయి. మరో ఆరు సంవత్సరాలు రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ కొనసాగేందుకు వీలు కల్పించిన ఏకపక్ష ఎన్నికల గురించి నిజానికి ఎవరికీ పెద్ద భ్రమలు లేవు. అందువలన ఈ ఎన్నికలలో ఎవరికెన్ని ఓట్లు వచ్చాయి, వాటి మంచి చెడ్డల గురించి అంతగా విశ్లేషించటం కంటే ఎన్నికలకు ముందు, తరువాత పర్యవసానాల గురించి చర్చించుకోవటం ఉత్తమం. సోషలిస్టు వ్యవస్థను కాలదన్నుకున్న తరువాత రష్యాలో పరిస్థితులు అన్ని రంగాలలో దిగజారాయి తప్ప ఏ మాత్రం మెరుగుపడలేదు. 2016 ఏప్రిల్ 12న బ్రిటన్ పత్రిక గార్డియన్ అధికారిక అంకెలను పేర్కొంటూ వెల్లడించిన వివరాల ప్రకారం జనాభాలో 13.4 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువ ఆదాయాలతో బతుకుతున్నారు. అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే ఇది 20 శాతం ఎక్కువ. పద్దెనిమిది సంవత్సరాల క్రితం ఇది 29 శాతం వుంది. చమురు మార్కెట్లో ధరల పతనం అనేక మందిని దారిద్ర్యంలోకి నెట్టింది. 2008 ఆర్థిక సంక్షోభం రష్యాను వదల్లేదు, దాని పర్యవసానాలు ఇంకా అనుభవిస్తోంది. అందువలన ఆర్థిక రంగంలో అద్భుతాలను పుతిన్ పాలనలో ఊహించలేము.



ఎం కోటేశ్వరరావు

పశ్చిమ దేశాలు చేసిన రష్యా వ్యతిరేక ప్రచారం ఓటర్లను మరింతగా పుతిన్ వైపు నెట్టిందని రష్యన్ పార్లమెంట్ స్పీకర్ వ్యాఖ్యానించారు. పశ్చిమ దేశాలకు వ్యతిరేకంగా జాతీయవాదాన్ని రెచ్చగొట్టి దానిని తమకు అనుకూలంగా మార్చుకోవటంలో పుతిన్ సిద్ధహస్తుడయ్యారు. క్రిమియా ప్రాంతాన్ని రష్యాలో విలీనం చేయడం దానిలో భాగమే. అక్కడ 92 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు చెప్పారు. గత ఎన్నికలలో అక్రమాలతో విజయం సాధించాడని అప్పుడు అమెరికా విదేశాంగ మంత్రిగా వున్న హిల్లరీ క్లింటన్ చేసిన వ్యాఖ్యకు 2016 అమెరికా ఎన్నికలలో జోక్యం చేసుకొని హిల్లరీకి వ్యతిరేకంగా డోనాల్డ్ ట్రంప్‌కు అనుకూలంగా వ్యవహరించారన్నది పుతిన్‌పై పశ్చిమ దేశాల వ్యాఖ్యాతల అభిప్రాయం. ఈ విషయంలో ట్రంప్ అవునని, కాదని అనలేక గతేడాది పాటు ట్రంప్ కొంత మేరకు వూగిసలాడినప్పటికీ ఎన్నికలకు ముందు తన రాజకీయాన్ని ప్రారంభించారు. మాజీ రష్యన్ గూఢచారి, అతని కుమార్తెపై బ్రిటన్‌లోని శాలిస్‌బరీలో ప్రాణాంతక గ్యాస్‌ను రష్యా ప్రయోగించినట్లు, సరిగ్గా పోలింగ్‌కు మూడు రోజుల ముందు బ్రిటన్, ఇతర ఐరోపా దేశాలు చేసిన ఆరోపణలతో అమెరికా గొంతు కలిపింది. 2016 అమెరికా ఎన్నికలలో జోక్యం చేసుకున్నందుకు ప్రతీకారంగా అదే రోజు కొంత మంది రష్యన్లు, కొన్ని సంస్థలపై అమెరికా ఆర్థిక శాఖ ఆంక్షలు విధించింది.

ఎన్నికలలో పోటీ పడుతున్న అభ్యర్థులు, వారి కార్యక్రమాలు, దేశ భవిష్యత్ గురించి వారి అవగాహనను జనానికి తెలియచేయాల్సి వుంది. ఇటువంటి స్థితిలో అభ్యర్థుల చర్చలకు అర్ధరాత్రి లేదా తెల్లవారు ఝామున సమయాలు నిర్ణయించటం, జనం చూసే చోట్ల నాసిరకంగా కార్యక్రమాలను ప్రసారం చేయటం వంటి పనులు చేశారు. అభ్యర్థుల చర్చలను ప్రత్యక్ష ప్రసారం కాకుండా రికార్డు చేయటంతో సెన్సార్‌కు అవకాశం ఇచ్చారు.



ఎన్నికల పట్ల జనంలో పెద్ద ఆసక్తి లేదని వార్తలు వచ్చినప్పటికీ 67 శాతంపైగా పోలింగు నమోదైనట్లు ప్రకటించారు. పుతిన్ రాజకీయ ప్రత్యర్థులలో ఒకరైన అలెగ్జీ నవల్నీపై కేసు వున్న కారణంగా పోటీకి అనర్హుడిగా ప్రకటించారు. దాంతో ఎన్నికలను బహిష్కరించమని ఆయన పిలుపునిచ్చారు. అసోసియేటెడ్ ప్రెస్ వార్తా కథనం ప్రకారం అనేక చోట్ల బ్యాలట్ బాక్సులను పుతిన్ మద్దతుదారులే ఓట్లతో నింపారు. అనేక చోట్ల ఆ విధంగా వేయించిన వీడియో దృశ్యాలు సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున దర్శనమిచ్చాయి. కొన్ని చోట్ల బలవంతంగా ఓట్లు వేయించారు. కంపెనీల యజమానులు బలవంతంగా కార్మికులను బస్సుల్లో తరలించి ఓట్లు వేయించారని నవల్నీ విమర్శించాడు. గత ఎన్నికల కంటే ఓటింగ్ శాతం తగ్గితే తన బహిష్కరణ పిలుపు ప్రభావమే అని నవల్నీ నోరెత్తకుండా వుండేందుకు వీలుగా అంతకంటే ఎక్కువ శాతం బ్యాలట్ బాక్సులలో వేయించే జాగ్రత్త తీసుకున్నట్లుగా భావిస్తున్నారు. అసలు మొత్తంగా ఎన్నికలే ప్రహసనమైతే ఇలాంటివి జరగటంలో ఆశ్చర్యం లేదు. ఎన్నికలలో సరైన అభ్యర్థులు నిజమైన పోటీ లేదని, విమర్శనాత్మక గళాలను అణచివేశారని ఐరోపా భద్రత, సహకార సంస్థ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించింది. ఈ ఎన్నిక రోత పుట్టించిందని కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి పావెల్ గ్రడినిన్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాల గురించి కమ్యూనిస్టు పార్టీ ఛైర్మన్ జుగనోవ్ మాట్లాడుతూ అనేక విశ్వవిద్యాలయాలు, సహకార సంస్థలలో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థికి 25–30 శాతం ఓట్లు పడ్డాయని ఇది నిజమైన మద్దతు, భవిష్యత్‌లో ప్రజలు తమ కార్యక్రమాన్ని బలపరుస్తారని ఆశిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. 'మాకు ఒక కార్యక్రమం వుంది, మా వద్ద సమస్యలకు పరిష్కారాలున్నాయి.' అనుభవం వుంది కనుక అధికారంలో వున్న వారు ప్రతిపక్షం చెప్పేది వినాలని జుగనోవ్ చెప్పారు. కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి గ్రడినిన్ ఎన్నికల రోజున ఒక ప్రకటన చేస్తూ వామపక్ష, దేశభక్త శక్తులు దేశం ముందు 20 అంశాల నిర్దిష్ట కార్యక్రమాన్ని వుంచాయి. దేశ రాజ్యాంగం ప్రకారం ప్రజలే సర్వశక్తిమంతులు. ఎన్నికలలో పోటీ పడుతున్న అభ్యర్థులు, వారి కార్యక్రమాలు, దేశ భవిష్యత్ గురించి వారి అవగాహనను జనానికి తెలియచేయాల్సి వుంది. ఇటువంటి స్థితిలో అభ్యర్థుల చర్చలకు అర్ధరాత్రి లేదా తెల్లవారు ఝామున సమయాలు నిర్ణయించటం, జనం చూసే చోట్ల నాసిరకంగా కార్యక్రమాలను ప్రసారం చేయటం వంటి పనులు చేశారు. అభ్యర్థుల చర్చలను ప్రత్యక్ష ప్రసారం కాకుండా రికార్డు చేయటంతో సెన్సార్‌కు అవకాశం ఇచ్చారు. ఎక్కువ మంది చూసే సమయంలో ప్రత్యక్ష ప్రసారాలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పోటీలో వున్న అభ్యర్థులు, ఎన్నికల సంఘానికి కూడా ఈ మేరకు తాను సూచించానని గ్రడినిన్ పేర్కొన్నారు.

ఎన్నికల సమయంలో నిబంధనావళిని ఎలా తుంగలో తొక్కింది వివరిస్తూ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర ఎన్నికల సంఘానికి 70 ఫిర్యాదులు చేసింది. పోటీ చేసే అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించలేదు. కమ్యూనిస్టు అభ్యర్థి గ్రడినిన్‌కు వ్యతిరేకంగా ఒక యుద్ధమే ప్రకటించారు. తప్పుడు, కల్పితాలను గుప్పించారు. తొంభై శాతం సమాచారం అసహ్యంగా, రెచ్చగొట్టే విధంగా వుంది, ఇది ఒక విధంగా బహిరంగంగా వేధించటమే. ఇది 1990వ దశకం కంటే దిగజారింది. మొత్తం ఎన్నికల ప్రచారం అంతా తమ అభ్యర్థిపై బురద చల్లే విధంగా ఒక ప్రత్యేక కార్యక్రమంతో చేసినట్లుగా వుంది అని కమ్యూనిస్టు పార్టీ ఫిర్యాదు చేసింది. ఇప్పటికే 14 సంవత్సరాలు అధికారంలో వున్న పుతిన్ అనూహ్య పరిణామాలు, సంక్షోభాలేవీ సంభవించకపోతే 2024 వరకు అధికారంలో కొనసాగుతారు. రాబోయే రోజుల్లో ప్రపంచ రాజకీయాలలో రష్యా ప్రభావం చూపాలంటే పుతిన్ పశ్చిమ దేశాల వ్యతిరేక వైఖరిని అనుసరించటం అనివార్యంగా కనిపిస్తోంది.



చాలామంది చిన్నప్పుడే ఏవేవో లక్ష్యాలు నిర్దేశించుకుంటూ ఉంటారు. అయితే రకరకాల కారణాల వల్ల లక్ష్యసాధనలో అవాంతరాలు ఎదురైతే అక్కడే ఆగిపోతారు. కొద్దిమంది మాత్రమే తాము ఎంచుకున్న మార్గంలో ముందుకు సాగుతారు. దారిలో ఎలాంటి అడ్డంకులు ఎదురొచ్చినా.. సర్వశక్తులూ కూడదీసుకుని ముందుకు సాగుతారు. అలాంటి అమ్మాయే.. బుద్దా అరుణ రెడ్డి. నిన్నటిదాకా ఎవరికీ తెలియని ఆ అమ్మాయి.. ఇప్పుడు ప్రపంచ క్రీడా వేదికపై భారత జిమ్నాస్ట్‌గా చరిత్ర సృష్టిస్తోంది. తెలుగమ్మాయి అయిన అరుణరెడ్డి క్రీడా జీవితంలోని అవిరళ కృషి, నిబద్ధతపై 'జీవన' ఫోకస్...


జిమ్నాస్టిక్స్‌లో అరుణ పతాక

హైదరాబాద్‌లో ఉంటున్న 22 సంవత్సరాల బుద్దా అరుణరెడ్డి అందరిలాంటి అమ్మాయే. కానీ ఈమెకు కొన్ని ప్రత్యేకతలున్నాయి. చిన్నప్పుడు ఐదేళ్ల వయసులోనే కరాటేలో ప్రావీణ్యాన్ని సంపాదించింది. ఆ తర్వాత జిమ్నాస్టిక్స్‌లోకి అడుగుపెట్టింది. తండ్రి నారాయణరెడ్డి, తల్లి, అక్క పావనిరెడ్డి, ఓచిన్న కుటుంబం ఆమెది. క్రీడలపట్ల ఎంతో మక్కువతో ఉండే నారాయణరెడ్డి కూతురికి చాలా చిన్నవయసులోనే కరాటే శిక్షణని మొదలుపెట్టారు. అలా మూడేళ్లపాటు కరాటేలో అరుణ రాణించింది. అయితే ఆమె శరీరాకృతి కరాటే కన్నా జిమ్నాస్టిక్స్‌కు మరింత అనుకూలంగా ఉంటుందని కరాటే మాస్టర్ సూచించడంతో నారాయణరెడ్డి అప్పటి నుంచీ జిమ్నాస్టిక్స్‌లో శిక్షణ ఇప్పించారు. ఇక కరాటేని ఆమె విడిచిపెట్టక తప్పలేదు. హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో కోచ్ బ్రిజ్ కిశోర్ వద్ద పదేళ్లుగా శిక్షణ పొందుతోన్న అరుణ ఒక్కో అడుగు ముందుకేస్తూ అంతర్జాతీయ జిమ్నాస్ట్‌గా ఎదిగింది.



తండ్రి మృతితో విషాదంలోకి

అరుణరెడ్డి జిమ్నాస్ట్‌గా కెరీర్‌లో నిలదొక్కుకుంటున్న సందర్భంలోనే ఎనిమిదేళ్ల కిందట 2010లో ఆమె కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది. తన కూతురును ఏనాటికైనా చాంపియన్‌గా చూడాలనుకున్న ఆమె తండ్రి నారాయణరెడ్డి 55 ఏళ్ల వయసులో గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. అప్పుడామెకు పద్నాలుగేళ్లు. ఈ ఘటనతో కలత చెందిన అరుణ ఒకదశలో తన జిమ్నాస్టిక్స్ కెరీర్‌కు వీడ్కోలు చెప్పి, కుటుంబానికి భారం కాకూడదని భావించింది. తండ్రి మరణంతో జిమ్నాస్టిక్స్‌పై ఏకాగ్రత లోపించిన దశలో ఆమె తల్లి, అక్క, బావ ధైర్యం చెప్పి నిరంతరం ప్రోత్సహించడంతో అరుణ కెరీర్ మళ్లీ సరైన మార్గంలోకి మళ్లింది.



నాన్న కల నెరవేరుస్తూ

తండ్రి మరణం ఒక పక్క కుంగదీస్తుండగా మరో పక్క ఆర్థిక సమస్యలు జిమ్నాస్టిక్స్ శిక్షణ పొందడానికి తగిన ఆర్థిక వనరులు లోపించడం ఆమెను అయోమయంలో పడేశాయి. ఏం చేసైనా సరే జిమ్నాస్టిక్స్‌లో ఛాంపియన్‌గా నిలిచి, తండ్రి కలల్ని నిజం చేయాలని భావించింది. అలాంటి సందర్భంలో కుటుంబసభ్యులు ఆమెకు అండగా నిలిచారు. సొంత ఇంటిని అమ్మేసి, కుటుంబం అద్దె ఇంటికి మారింది. వచ్చిన సొమ్ముతో కొంత శిక్షణకు కేటాయించుకుని మరికొంత ఆర్థిక సమస్యల పరిష్కారానికి వినియోగించింది. రెట్టించిన దీక్షతో సాధన చేసింది. ఆ ఏడాది ఉదయ్‌పూర్‌లో జరిగిన జాతీయ పోటీల్లో వాల్ట్, బ్యాలెన్సింగ్ బీమ్‌లో స్వర్ణ పతకాలు సాధించి, తన తండ్రి కలని నిజం చేసింది.



ప్రైజ్ మనీతో కుటుంబ పోషణ

జిమ్నాస్ట్‌గా కెరీర్‌ని కొనసాగిస్తూ వస్తున్న ప్రైజ్‌మనీతో కుటుంబాన్ని పోషిస్తోంది. అలా పద్నాలుగేళ్లుగా జిమ్నాస్టిక్స్‌లో కొనసాగుతున్న అరుణరెడ్డి జాతీయస్థాయిలో ఎన్నో పతకాలు సాధించింది. అయితే 2013 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో, 2014 కామన్వెల్త్ క్రీడలు, 2014 ఆసియా క్రీడలు, 2017 ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించినా క్వాలిఫైయింగ్ దశను దాటలేకపోయింది. ఇది ఆమెలో పట్టుదలను మరింత పెంచింది. తన సాధనకు పదును పెట్టింది. అందులో భాగంగానే గత నెలలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపించింది.

జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌లో

అంతర్జాతీయ జిమ్నాస్టిక్స్ సమాఖ్య ఆధ్వర్యంలో 2010లో ప్రపంచకప్ సిరీస్ మొదలైంది. రియో ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచిన భారత స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ ఆసియా చాంపియన్‌షిప్, 2014 కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకాలు గెలిచినా ప్రపంచకప్‌లో మాత్రం పతకాలను సాధించలేకపోయింది. అయితే ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది అరుణరెడ్డి. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగిన జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు అరుణరెడ్డి భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. వాల్ట్ ఈవెంట్‌లో మూడో స్థానాన్ని సంపాదించి, కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్ తర్వాత అంతే ప్రాముఖ్యత కలిగిన టోర్నమెంట్‌గా జిమ్నాస్టిక్స్ ప్రపంచకప్‌కు పేరుంది. ఇందులో పతకాన్ని ఘనత వహించిన తొలి భారతీయ జిమ్నాస్ట్‌గా రికార్డు సృష్టించింది అరుణ. ఈ ప్రపంచకప్‌కి మొత్తం 16 దేశాల నుంచి అథ్లెట్స్ ప్రాతినిధ్యం వహించారు. వారిలో మన దేశం తరపున పోటీ చేసిన అరుణ 13.469 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. అందులో పతకాన్ని సాధించిన వెంటనే భారతీయులు ఆమె క్రీడా స్ఫూర్తికి జేజేలు పలికారు.

తన తండ్రి చనిపోయినప్పుడే కష్టాలు చుట్టుముట్టాయని అక్కడే ఆగిపోయుంటే ఇన్ని ఘన విజయాలు, అంతర్జాతీయ స్థాయిలో ఇన్ని ప్రశంసలు అరుణకు దక్కేవి కావు. జీవన మార్గంలో ఎదురయ్యే కష్టాలకు తలొగ్గకుండా, ఎదురు నిలిచి.. ధైర్యంగా పోరాడుతూ ముందుకు సాగుతుంటే ఏదో ఒకరోజు విజయం సాధించ వచ్చనడానికి అరుణ రెడ్డి ఓ నిదర్శనం.

- జీవన డెస్క్



అటు జిమ్నాస్టిక్స్.. ఇటు చదువు

జిమ్నాస్టిక్స్‌లోనే నిమగ్నమైన అరుణ రెడ్డి తాను చదువుని ఏమాత్రం నిర్లక్ష్యం చేయలేదు. ఛార్టెడ్ అకౌంటెంట్ కావటం తన లక్ష్యం. ఆ చదువు కొనసాగిస్తూనే- కామన్ వెల్త్ గేమ్స్, ఏషియన్ గేమ్స్ మీద దృష్టిపెట్టింది. కాంస్య పతకాన్ని సాధించిన అరుణకు తెలంగాణా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు రెండు కోట్ల రూపాయల నజరానాని ఈ నెల మొదటివారంలో అందించారు. తెలంగాణా క్రీడాప్రాధికార సంస్థ 20 లక్షల రూపాయలతో ప్రోత్సహించింది.

రాగుల్లో పోషకాలు మెండు



చిరు ధాన్యాల్లో రాగులకు ప్రత్యేక స్థానం ఉంది. వీటి పిండితో రొట్టెలు చేసుకుని తినవచ్చు. కొందరు జావ తయారుచేసుకుని తాగుతారు. అయితే ఎలా తిన్నా రాగులు మాత్రం అనేక లాభాలను అందిస్తాయి. రాగి పిండితో చేసిన రొట్టెలను తింటున్నా, రాగి జావ రోజూ తాగినా, లేదంటే రాగి ముద్దలను తిన్నా మనకు అనేక ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయి. శరీరానికి కావాల్సిన ముఖ్య పోషకాలు అందుతాయి. అందుకే రాగులును పోషకాల్లో రారాజు అంటారు. వీటి ఉపయోగాలిలా ఉంటాయి.

➤ రాగుల్లో క్యాల్షియం పుష్కలంగా ఉంది. 100 గ్రాముల రాగులతో 344 మిల్లీగ్రాముల క్యాల్షియం లభిస్తుంది. ఇది శరీరంలో ఎముకలు, దంతాలకు ఉపయోగపడుతుంది. దంతాలు, ఎముకలు దృఢంగా మారతాయి. కీళ్ల నొప్పులు రాకుండా ఉంటాయి. ఎదిగే పిల్లలకు చాలా మేలు చేస్తుంది. వారిలో ఎముకలు దృఢంగా ఉంటాయి.

➤ రాగుల గ్లయిసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువ. దీంతో దీని ఆహారం రక్తంలో నెమ్మదిగా కలుస్తుంది. ఫలితంగా గ్లూకోజ్ అంత త్వరగా ఎక్కువ స్థాయికి చేరదు. దీంతో డయాబెటిస్ అదుపులో ఉంటుంది. అంతేకాకుండా రాగుల్లో పాలీఫినాల్స్, డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మధుమేహాన్ని అదుపు చేస్తాయి.

రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరగకుండా ఉంటాయి.

➤ రాగుల్లో చర్మానికి మేలు చేసే మిథియోనైన్, లైసిన్ వంటి అమైనోయాసిడ్లు ఉంటాయి. ఇవి చర్మాన్ని ముడతలు పడనీయకుండా చూస్తాయి. దీంతో వృద్ధాప్య ఛాయలు అంత త్వరగా రావు. అలాగే



పాడైపోయిన చర్మ కణాలు పునరుత్తేజం పొందుతాయి. దీంతో చర్మంపై మచ్చలు తగ్గిపోతాయి.

➤ సూర్యకాంతి ద్వారా లభించే విటమిన్ డి రాగుల్లో కూడా ఉంటుంది. నిత్యం రాగులను ఏదో ఒక రూపంలో తీసుకుంటే విటమిన్ డి లోపం సమస్యను అధిగమించవచ్చు.

➤ రక్తహీనత సమస్యతో బాధపడేవారికి రాగులు చక్కని ఔషధం అని చెప్పవచ్చు. వీటిల్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. దీంతో రక్త హీనత సమస్య పోతుంది.

➤ డిప్రెషన్, నిద్రలేమి, మానసిక ఒత్తిడి తదితర సమస్యలను నయం చేసే గుణాలు రాగుల్లో ఉన్నాయి. తలనొప్పిని కూడా ఇవి తగ్గిస్తాయి. శరీరానికి ప్రశాంతతను చేకూరుస్తాయి.

➤ రాగులను నిత్యం ఆహారంలో భాగం చేసుకుంటే బరువు తగ్గవచ్చని వైద్యులు చెబుతున్నారు. వీటిల్లో ఉండే ఫైబర్ కడుపులో ఎక్కువసేపు ఉంటుంది. కనుక అంత త్వరగా ఆకలి వేయదు. దీంతో బరువు తగ్గవచ్చు.

➤ రాగులను నిత్యం ఏదో ఒకవిధంగా తీసుకోవడం వల్ల బీపీ తగ్గుతుంది. గుండె సమస్యలు రావు. జీర్ణ సమస్యలు పోతాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

➤ రాగిజావ వల్ల వేసవిలో దాహం సమస్య తీరుతుంది. రాగుల్లో ఉండే అయోడిన్ థైరాయిడ్ సమస్యలకు చెక్ పెడుతుంది. జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. ★

విజిత.. బొమ్మల కొలువు



మనిషికి నాగరికత పరిచయం కాకముందు నుంచే బొమ్మల్ని తయారుచేయడం నేర్చుకున్నాడు. మట్టి, రాయితో మొదలుపెట్టి ఎన్నో వస్తువులతో తనలాంటి మానవ ఆకృతులకు సజీవ రూపాన్ని అందించాడు. దీనికి కారణాలు ఏవైనా కావచ్చుగానీ, ఇలాంటి బొమ్మలు చిన్నారి బాలలను ఎంతో ఆకట్టుకుంటాయి. ఇలాంటి బొమ్మల తయారీ నేటి కాలంలో వ్యాపారాత్మకంగా ఎంతో మందికి ఉపాధినీ కలిగిస్తున్నాయి. అయితే ప్రస్తుతం బాగా ప్రాచుర్యం పొందుతున్న పర్యావరణ అనుకూలమైన వస్తువుల్ని తయారుచేయడంలో యువత ముందున్నారు. అందులో భాగంగానే ఈ యువతి వేస్ట్ మెటీరియల్ బొమ్మలు తయారుచేస్తూ గిన్నీస్ వరల్డ్ రికార్డ్ సాధించింది.

కేరళ రాష్ట్రానికి చెందిన విజిత రితీష్ సృజనాత్మకతను అందరూ మెచ్చుకోవాల్సిందే. కాదేది బొమ్మల తయారీకి అనర్హమనే ధోరణిలో గోడలపై అతికించే పోస్టర్ల నుంచీ పెళ్లి కార్డుల వరకూ ఆమె తయారుచేసే బొమ్మలకు ప్రాణం పోస్తున్నాయి. విజితాకి చిన్నతనం నుంచీ బొమ్మలు తయారుచేయడమంటే చాలా ఇష్టం. తన నైపుణ్యానికి మెరుగులుపెడుతూ, వేస్ట్ పేపర్‌తో బొమ్మలు తయారుచేస్తూ చిన్ననాటి నుంచీ ఎన్నో బహుమతులు గెలుచుకుంది. చిన్నచిన్న పోటీల్లో పాల్గొని, తాను తయారుచేసిన బొమ్మలతో అందర్నీ ఆకట్టుకునేది. చెత్తని తిరిగి ఉపయోగిస్తూ, పిల్లలకి ఆహ్లాదాన్ని పంచిస్తున్న విజితా ఆలోచనల్ని మెచ్చుకోని వారంటూ ఉండేవారుకాదు. చాలా మందికి ఉపయోగించిన వస్తువులు చెత్తలా కనిపిస్తే విజితకి మాత్రం అవి రెడీమెడ్ వస్తువుల్లా కనిపించేవి. అయితే తన వివాహం తర్వాతే వేస్ట్ పేపర్‌తో బొమ్మలు తయారుచేయడంలో పూర్తి సమయాన్ని గడపడం మొదలుపెట్టింది. భర్త కుటుంబంలో కూడా కళాకారుల వారసత్వం ఉన్నందువల్ల విజిత ఆలోచనలకు సరైన ప్రోత్సాహం కూడా అందింది.



ఆమె తయారుచేసిన హ్యాండీక్రాఫ్ట్ ఆభరణాల సెట్ 2016లో 'ది లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించుకుంది. యాభై అడుగుల నక్లెస్ తయారుచేయడానికి విజిత నెల రోజులు శ్రమించింది. దీన్ని తయారుచేయడానికి కార్డ్‌బోర్డ్ పెట్టెల్ని ఉపయోగించింది. అంతటితో ఆగకుండా క్విల్లింగ్ టెక్నిక్‌తో తాను తయారుచేస్తున్న బొమ్మలకు మార్కెటింగ్ పెంచుకుంది. తనతోపాటు ఇంకొందరికీ ఈ బొమ్మల తయారీలో శిక్షణ ఇస్తూ ఉపాధి కల్పిస్తుంది. గతేడాది వేస్ట్ మెటీరియల్‌తో 1350 బొమ్మలు తయారుచేసి, ప్రదర్శించినందుకుగాను విజిత 'గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం పొందింది. ఈ బొమ్మల్లో ప్రతి ఒక్కటీ వైవిధ్యంగా కనిపించడం ఇందులో ఉన్న మరో ప్రత్యేకత. ప్రస్తుతం విజిత 'డూ ఇట్ యువర్‌సెల్ఫ్' అంటూ ఒక పుస్తకాన్నీ తీసుకురాబోతుంది. వేస్ట్ మెటీరియల్‌తో బొమ్మలు తయారుచేయడమే కాదు.. ఇంట్లో ఉపయోగించుకునేందుకు వివిధ వస్తువుల్నీ ఎలా తయారుచేసుకోవాలో ఈ పుస్తకంలో తెలియజేస్తుంది. ★



మీకోసం

అరడజను అప్పడాలను నీటిలో నానబెట్టి, పెసర పిండిలో కలిపితే.. పెసరట్లు రుచితో పాటు, కరకరలాడతాయి.



జీవన సౌరభం

ఏది తప్పో.. ఏది ఒప్పో.. మన అంతరాత్మ మనల్ని హెచ్చరిస్తూనే ఉంటుంది. తెలియదనడం ఆత్మవంచనే!

సెన్సెక్స్ ⬆ 139
33,136

నిఫ్టీ ⬆ 31
10,155

రూపాయి 00 పై॥
అమెరికా డాలరుకు రూ.
65.20





ఎస్‌సిఆర్.. ఓలా జట్టు

దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ హైదరాబాద్ డివిజన్‌తో క్యాబ్ అగ్రిగేటర్ ఓలా భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీంతో సికింద్రాబాద్, హైదరాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లలో ఓలా కియోస్క్‌లను ఏర్పాటు చేయనుంది. ఈ సేవల ఒప్పందంలో ఎస్‌సిఆర్ సికింద్రాబాద్ డివిజన్ అమిత్ వర్ధన్, ఓలా హైదరాబాద్ సిటీ హెడ్ సందీప్ ఉపధ్యాయ్ పాల్గొన్నారు.

ఐపిఎల్‌తో టాటా నెక్సాన్...

వివో ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు ఆధికృత పార్ట్‌నర్‌గా టాటా నెక్సాన్ ఎంచుకున్నట్లు బిసిసిఐ ప్రకటించింది. వివో ఐపిఎల్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్ బిజినెస్ ప్రెసిడెంట్ మయాంక్ పరీక్ ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.

ఊహాల్లో మార్కెట్ల ఉరకలు



ముంబయి : అంతర్జాతీయ సానుకూల పరిణామాల అంచనాల్లో రెండో రోజూ దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాలను నమోదు చేశాయి. రెండు రోజులపాటు సమావేశమైన అమెరికా ఫెడ్ పాలసీ నిర్ణయాలు బుధవారం అర్ధరాత్రి వెల్లడి కానున్నాయి. కొత్త ఛైర్మన్ పావెల్ అధ్యక్షతన ఫెడ్ కమిటీ కనీసం పావు శాతం వడ్డీ రేటును పెంచే అవకాశముందన్న అంచనాలు మార్కెట్లకు మద్దతునిచ్చాయి. ఈ పరిణామాల మధ్య బిఎస్ఇ సెన్సెక్స్ రోజంతా తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ తుదకు 139.42 పాయింట్లు లేదా 0.42 శాతం పెరిగి 33,136 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 30.90 పాయింట్లు పెరిగి 10,155కు చేరింది. సెన్సెక్స్-30లో టాటా స్టీల్ 1.85 శాతం, టాటా మోటార్స్ 1.58 శాతం, అదానీ పోర్ట్సు 1.44 శాతం, హీరో మోటో కార్ప్ 1.25 శాతం, పవర్ గ్రిడ్ 0.90 శాతం, సన్ ఫార్మా 0.82 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూశాయి. భారతీ ఎయిర్‌టెల్ 4.39 శాతం, ఎన్‌టిపిసి 2.11 శాతం, ఎల్అండ్‌టి 1.14 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1 శాతం, హెచ్‌డిఎఫ్‌సి 1 శాతం, కొటాక్ బ్యాంకు 0.99 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

పర్యాటకంలో 2.59 కోట్ల ఉద్యోగాలు

న్యూఢిల్లీ : దేశంలో ట్రావెల్, పర్యాటక రంగాలు 2017లో 2.59 కోట్ల ఉద్యోగాలు సష్టించాయని ఇండియన్ ఇండస్ట్రీ బాడీ ఫిక్కీ, సర్వీసు సంస్థ కెపిఎంజి ఒక రిపోర్టులు వెల్లడించాయి. అదేవిధంగా జిడిపికి రూ.5 లక్షల కోట్లను అందించాయని పేర్కొంది. ఈ రిపోర్టు ప్రకారం.. దేశీయ ఆర్థిక వ్యవస్థలో ట్రావెల్, టూరిజం, హాస్పిటాలిటీ కీలక రంగాలుగా ఉన్నాయని, ఫారిన్ టూరిస్ట్ అరైవల్స్‌లో ఏడాది ఏడాదికి 15.6 శాతం స్థిరమైన వద్ధి రేటు నమోదు చేస్తున్నాయి. ట్రావెల్ ఇండస్ట్రీ భవిష్యత్తును మొబైల్ అప్లికేషన్లు, సోషల్ మీడియా, బిగ్ డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, వర్చ్యువల్, అగ్‌మెంటెడ్ రియాల్టీ నిర్ధారించనున్నాయని ఈ రిపోర్టులు తెలిపాయి. ఆన్‌లైన్ ట్రావెల్ బుకింగ్ సేల్స్ 2017 నుంచి 2021 నాటికి 14.8 శాతం పెరగనుందని రిపోర్టులు అంచనావేశాయి. 2019 నాటికి ప్రపంచంలో ఆరవ అతిపెద్ద బిజినెస్ ట్రావెల్ మార్కెట్‌గా భారత్ నిలువనుందని పేర్కొన్నాయి.

అశోక్ లేలాండ్‌కు రూ.321 కోట్ల ఆర్డర్

చెన్నయ్ : ప్రముఖ వాహన దిగ్గజ సంస్థ అశోక్ లేలాండ్‌కు తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థనుంచి భారీ ఆర్డర్‌ను సాధించింది. బస్సుల రూపకల్పనకుగాను రూ. 321 కోట్ల విలువైన ఆర్డర్‌ను దక్కించుకుంది. తమిళనాడులో 2,100 బస్సుల సరఫరా కోసం ఈ ఆర్డర్ పొందినట్లు హిందూజ గ్రూప్‌నకు చెందిన అశోక్ లేలాండ్ వెల్లడించింది.

ఇంటి వద్దకే డీజిల్

అందుబాటులోకి తెచ్చిన ఐఒసి
తొలుత పూణెలో ప్రారంభం
త్వరలో పెట్రోల్ అమ్మకాలు..!
ప్రయత్నాల్లో బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్‌లు



న్యూఢిల్లీ : ఒక్క ఫోన్ కాల్‌తో అన్నీ రకాల ఉత్పత్తులు ఎక్కడంటే అక్కడ డెలివరీ చేస్తున్న ప్రస్తుత రోజుల్లో తాజాగా ఈ జాబితాలో డీజిల్ కూడా చేరింది. వాహనదారులకు డీజిల్‌ను ఇంటి వద్దనే అందిస్తామంటూ దేశంలో అతిపెద్ద చమురు కంపెనీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) ఇందుకు ప్రయత్నం మొదలు పెట్టింది. పూణెలో డీజిల్‌ను హోం డెలివరీ చేసే సదుపాయాన్ని తీసుకొచ్చినట్లు ఐఒసి ఛైర్మన్ సంజీవ్ సింగ్ వెల్లడించారు. త్వరలో దేశవ్యాప్తంగా అమల్లోకి తేనున్నట్లు ప్రకటించింది. ఐఒసి అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఇంటి వద్దకే వచ్చి డీజిల్ పోసే ట్యాంకర్ ఫొటోనూ పోస్ట్ చేసింది. కాగా వినియోగదారుల నుంచి స్పందన ఎలా ఉంది. ఎన్ని లీటర్ల వరకు ఆర్డర్ చేసుకోవచ్చు.. చార్జీలు ఎలా ఉంటాయే? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ హోం డెలివరీ సర్వీసును పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పిఇఎస్ఒ) కూడా ఆమోదించింది. డీజిల్ అవసరమున్న వారు ముందుగానే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. వినియోగదారులకు పెట్రోల్, డీజిల్‌ను ఇంటి వద్ద డెలివరీ అంశంపై గతేడాది ఏప్రిల్‌లోనే చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపిన విషయం తెలిసిందే. దేశంలోని ప్రధాన నగరాల్లో గంటల తరబడి పెట్రోల్, డీజిల్ కోసం బంకుల వద్ద వాహనదారులు పడిగాపులు కాయాల్సి వస్తుండటంతోనే హోం డెలివరీ యోచనలో ప్రభుత్వం పడింది. ఈ క్రమంలోనే ఇప్పుడు ఐఒసి ఇంటి వద్దకే డీజిల్ సదుపాయంతో ముందుకొచ్చింది. డీజిల్‌తో పోల్చితే ఈ తరహా పెట్రోల్ అమ్మకాలు కొంత ప్రమాదకరంగా ఉండటంతోనే ముందుగా డీజిల్ అమ్మకాల్ని ప్రారంభించామని సంజీవ్ సింగ్ తెలిపారు. డోర్ డెలివరీ కింద డీజిల్ తీసుకొచ్చే విధానాన్ని తొలిసారి ప్రయోగాత్మకంగా పుణెలో ప్రారంభించామన్నారు. ప్రజల నుంచి దీనికి మంచి స్పందన వస్తే మరిన్ని నగరాలకు విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మూడు నెలల పాటు ఈ ప్రాజెక్టును ప్రయోగాత్మకంగా చేపడతున్నా మన్నారు.

మరో రెండు కంపెనీలు కూడా..

ఐఒసి మాదిరిగానే మరో రెండు చమురు సంస్థలు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ (హెచ్‌పిసిఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ కూడా పిఇఎస్ఒ క్లియరెన్స్ కోసం ఎదురు చూస్తున్నాయి. క్లియరెన్స్ వచ్చిన వెంటనే ప్రయోగాత్మకంగా పెట్రోల్, డీజిల్ ఇంటి వద్దకే సరఫరా చేసేందుకు ఆయా సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. నిజానికి గతేడాది జూన్‌లోనే బెంగళూరుకు చెందిన ఎఎన్‌బి అనే స్టార్టప్ ఈ తరహా సర్వీసుల్ని మొదలు పెట్టింది. అయితే పిఇఎస్ఒ ఆదేశాలతో నిలిపివేసింది. రవాణాలో సరైన భద్రతా ప్రమాణాలను పాటించలేకపోతుండటమే అసలు కారణం. ప్రస్తుతం భారత్‌లో 61,983 పెట్రోల్ బంకులు ఉన్నాయి. 2016-17 ఏడాదిలో దేశంలో 194.6 మిలియన్ టన్నుల చమురు వినియోగం జరిగింది. అందులో 40శాతం వినియోగం డీజిల్‌దే. డీజిల్ వినియోగం ఎక్కువగా ఉండే ప్రాంతాలైన షాపింగ్ మాల్స్, డీజిల్ జనరేటర్ వినియోగదారులు, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు, అత్యధికంగా డీజిల్ వినియోగం చేసే సంస్థలను లక్ష్యంగా చేసుకొని చమురు కంపెనీలు ఈ హోం డెలివరీపై దృష్టి పెట్టాయి.

జెపి అసోసియేట్స్‌కు సుప్రీం హెచ్చరిక

రూ.200 కోట్లు డిపాజిట్ చేయాలని ఆదేశం

న్యూఢిల్లీ : గృహాల అమ్మకాల్లో అక్రమ పద్ధతులు పాటించిన జై ప్రకాశ్ అసోసియేట్స్‌కు సుప్రీంకోర్టులో మరోసారి తీవ్ర ఎదురు దెబ్బ తగిలింది. మే10 నాటికి రూ. 200 కోట్లను కోర్టుకు డిపాజిట్ చేయాలని ఆదేశించింది. అలాగే రిఫండ్ అడుగుతున్న గహకొనుగోలు దారుల జాబితా సమర్పించాలని జెపి అసోసియేట్స్‌కు ఆదేశాలిచ్చింది. గహనిర్మాణ ప్రాజెక్టులో ఫ్లాట్ల కొనుగోలుకు డబ్బులు చెల్లించిన వారికి ఇళ్లు కట్టించనందున వారికి తిరిగి చెల్లించాల్సిందిగా చీఫ్ జస్టిస్ దీపాక్ మిశ్రా నేతత్వంలోని ధర్మాసనం ఆదేశించింది. రెండు దఫాలుగా ఈ రూ.200కోట్లు చెల్లించాల్సిందిగా సూచించింది. ఏప్రిల్ 15, మే 10 తేదీల్లో కోర్టు రిజిస్ట్రీకి ఈ డిపాజిట్లు చేయాల్సిందిగా పేర్కొంది. ఈ కేసు విషయంలో డెవలపర్లు లేవనెత్తిన డిమాండ్లను న్యాయస్థానం తోసిపుచ్చింది. దీంతోపాటు చెల్లింపులు చేయాలంటూ గహ కొనుగోలుదారులకు ఎటువంటి నోటీసులను పంపించకూడదని స్పష్టం చేసింది. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ జెపి ఇన్‌ఫ్రాటెక్ మాత సంస్థ అయిన జెపి అసోసియేట్స్ ఇళ్లను కట్టిస్తామని చెప్పి సరైన సమయానికి వాటిని అప్పగించకపోవడంతో కొనుగోలు దారులు తాము చెల్లించిన డబ్బులను తిరిగి ఇవ్వాలని కోరుతూ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

చదువు

S.S.C. MODEL PAPER

GENERAL SCIENCE PAPER-1

(ప్రాక్టీస్ బిట్ పేపర్లు)

PART – B (1)

Time: 30 Min **Marks: 10**

Instruction:
1. Answer the all questions.
2. Each quention carries 1/2 mark.
3. Part - B answers should be written on the given paper only.
4. No marks given to over writing answers.

14. Units of specific heat in C.G.S. system [ ]
A). Cal/gm- ^{0}C B). Cal/kg. k
C). Cal/gm D). Joul/cal.gm

15. Magnification [ ]
A). $\frac{v}{u}$ B). $\frac{ho}{hi}$
C). $-\frac{v}{u}$ D). $-\frac{ho}{hi}$

16. Angle of deviation of light to glass slab [ ]
A). 90^0 B). 60^0
C). 0^0 D). 30^0

17. Lens formula = ... [ ]
A). $\frac{1}{u}+\frac{1}{v}=\frac{1}{f}$ B). $\frac{1}{u}-\frac{1}{v}=\frac{1}{f}$
C). $\frac{2}{f}=\frac{1}{u}+\frac{1}{v}$ D). $\frac{1}{f}=\frac{1}{v}-\frac{1}{u}$

18. Least distance of distinct vision of a healthy person.... [ ]
A). 20 cm B). 25 cm
C). 30 cm D). 100 cm

19. Resultant resistance when connec-ted in series [ ]
A). 12 Ω B). 6 Ω
C). 2 Ω D). 15 Ω

20. ..... converts mechanical energy into electrical energy [ ]
A). Battery B). Generator
C). Switch D). motor

21. Orbital with lowest energy [ ]
A). 4s B). 1s
C). 2s D). 3s

22. Inertgas which does not contains octet in valency. [ ]
A). Helium B). Argon
C). Neon D). Krypton

23. Formula of But - 1 - ene [ ]
A). CH_3-CH_2-CH_2-CH_3
B). CH_3-CH_2-CH_2-CH_2-CH_3
C). CH_2=CH_2-CH=CH_2
D). CH_3-CH_2-CH_2=CH_2

24. Whar is the suffix used for aldehyde.... [ ]
A). ol B). al
C). one D). ene

25. If the object is placed at focus of a convex lens then image is formed at .... [ ]
A). Centre of curvature
B). Beyound centre of curvature
C). At infinity
D). on the object side

26. Focal length of lens with 2D power [ ]
A). 50cm B). 25cm
C). 100cm D). 20cm

27. What is the colour of sky if atmosphere contains more water vapour [ ]
A). Blue B). White
C). Red D). Black

28. Process used in the concentration of sulphide ores .... [ ]
A). Leaching B). Smelting
C). Froth flotation D). Electrolytic reduction

29. .... gas released when acetic acid reacts with sodium carbonate [ ]
A). oxygen B). Hydrogen
C). Nitrogen D). Carbondioxide

30. If $x^0C = (x+273)^0K$, then 300^0K = ... [ ]
A). 37^0C B). 27^0C
C). 23^0C D). 573^0C

31.

Substance	refractive index
Ice	1.31
Kerosene	1.44
Water	1.33

Velocity of light is maximum in.... [ ]
A). Ice B). Kerosene
C). Water D). All

32.

Substance	PH Value
Lemon Juice	1.31
Backing soda	1.44
Distilled water	1.33

Which of the above is base.... [ ]
A). Lemon Juice B). Backing soda
C). Distiled water D). A & B

33. Electronic configuration of an element is $1S^2\ 2S^2\ 2P^5$ then the element belongs to ... block [ ]
A). s - Block B). p - Block
C). d - Block D). f - Block

Part -B (1) (Answers)

14.C	15.C	16.C	17.D	18.B
19.A	20.B	21.C	22.A	23.D
24.B	25.C	26.A	27.B	28.C
29.D	30.B	31.C	32.B	33.B

PART – B (2)

Time: 30 Min **Marks: 10**

Instruction:
1. Answer the all questions.
2. Each quention carries 1/2 mark.
3. Part - B answers should be written on the given paper only.
4. No marks given to over writing answers.

14. Specific heat S = ... [ ]
A). $\frac{Q}{\ddot{A}T}$ B). Q.ÄT
C). $\frac{Q}{m\ddot{A}T}$ D). $\frac{m.\ddot{A}T}{Q}$

15. Refractive index of glass with respect to air is 2. Then critical angle of plane joning glass ..... air [ ]
A). 0^0 B). 45^0
C). 30^0 D). 60^0

16. Focal length of plano - convexlens is .... when its radius of currature is R and refractive index in 'n'. [ ]
A). R B). $\frac{R}{2}$
C). $\frac{R}{n-1}$ D). $\frac{n-1}{R}$

17. ..... colour has highest wave length in rainbow [ ]
A). Red B). Yellow
C). Blue D).Green

18. Set - I Set - II [ ]
a). Motor i). Chemical energy to electrical energy
b). Generator ii). Mechanical energy to electrical
c). Battery iii). Electrical to mechanical

Right answer is
A). a-ii, b-iii, c-i B). a-ii, b-i, c-iii
C). a-i, b-ii, c-iii D). a-iii, b-ii, c-i

19. ● value of sub orbit in an atom is 2, then number of orbitals. [ ]
A). 10 B). 3
C). 5 D). 6

20. Colour of methyl orange indicator in Hydrochloric acid.... [ ]
A). Yellow colour B). Red colour
C). Blue colour D). No colour

21. Set - I Set - II [ ]
a). Triads i). Mosley
b). Octet ii). Dobereiner
c). Modern Periodic table iii). Newlands
A). a-i, b-ii, c-iii B). a-iv, b-iii, c-i
C). a-iii, b-ii, c-i D). a-ii, b-i, c-iii

22. Metal which is highly reactive [ ]
A). Lithium B). Sodium
C). Cesium D). Potassium

23. An element Z forms ZCl_3. Then the valency of Z is ..... [ ]
A). 2 B). 4 C). 1 D). 3

24.

Molecule	Bond angle
Be Cl2	X
Y	1090 281

The values of X,Y are.... [ ]
A). 180^0, CH_4 B). 120^0, CO_2
C). 180^0, NH_3 D). 107^0, CH_4

25. Formula of Gypsum [ ]
A). $Cuso_4.5H_20$ B). $Caso_4.2H_20$
C). $Caso_4.\frac{1}{2}H_20$ D). $Cuso_4.2H_20$

26. General electronic configuration of alkaline earth metals.... [ ]
A). $1S^2$ B). ns^1
C). ns^2 D). ns^1 to ns^2

27. ..... is formed by the reaction between carboxylic acid and alcohol [ ]
A). Ether B). Soap
C). Amide D). Ester

28. Materials required to observe scattering of light..... [ ]
A). Hypo, sodium hydroxide, beaker
B). Sodium suplhate, sulphuric acid
C). Hypo, sulphuric acid, beaker
D). Sodium sulphate, sodium hydroxide beaker

29. Reducing agent in thermit process [ ]
A). Al B). Mg C). Fe D). Si

30.

Substance	Resistance
Silver	1.59×10^{-8} Ω-m
Copper	1.68×10^{-8} Ω-m
Gold	2.44×10^{-8} Ω-m

Best electrical conductor [ ]
A). Silver B). Copper
C). Gold D). All

31.

n	●	m	s
2	0	0	$+\frac{1}{2}$

The above values belongs to ..... orbital [ ]
A). 2p B). 2d C). 3s D). 2s

32. .... is used as rear view mirror [ ]
A). Plane mirror B). Concave Mirror
C). Convex Mirror D). Plane/convex mirror

33. Silver articles changes colour to ...... after sometime [ ]
A). Red B). Black
C). Green D). Brown

Part -B (2)(Answers)

14.C	15.C	16.C	17.A	18.D
19.C	20.B	21.B	22.C	23.D
24.A	25.B	26.C	27.D	28.C
29.A	30.A	31.D	32.C	33.B

సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో పీహెచ్‌డీ

కోల్‌కతాలోని సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్ (ఎస్ఎన్ఐపీ) 2018-19కి గాను పీహెచ్‌డీలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన అభ్యర్థులకు ఫెలోషిప్ కూడా లభిస్తుంది.
విభాగాలు: ఫిజిక్స్ (ఎక్స్‌పెరిమెంటల్/ థియరిటికల్), బయోఫిజికల్ సైన్సెస్.
ఎంపిక: అకడమిక్ రికార్డుల ఆధారంగా స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
దరఖాస్తు చివరి తేదీ: ఫిజిక్స్‌కు ఏప్రిల్ 16, 2018, బయోఫిజికల్ సైన్సెస్‌కు మే 7, 2018.
పూర్తి వివరాలు: వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్: www.saha.ac.in

గుండెపోటుతో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-కారంపూడి (గుంటూరు)

బస్సు నడుపుతుండగా గుండెపోటుకు గురై ఆర్‌టిసి డ్రైవర్ మృతిచెందాడు. అనంతరం అదుపుతప్పిన బస్సు చెట్టును ఢీనడంతో పలువురు గాయపడ్డారు. గుంటూరు జిల్లా కారంపూడి మండలం జూలకల్లు సమీపంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మాచర్లకు చెందిన సయ్యద్ బాబు (45) పిడుగురాళ్ల డిపోలో ఆర్‌టిసి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా 30 మంది ప్రయాణికులతో పిడుగురాళ్ల నుంచి కారంపూడికి బయలుదేరాడు. పది గంటల సమయంలో కారంపూడి మండలం జూకల్లు దాటగానే అతను గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే బస్సును రోడ్డు పక్కకు తీసుకెళ్లి చెట్టును ఢీకొట్టి నిలిపేశాడు. ఆక్రమంలోనే సయ్యద్ బాబు మృతిచెందాడు. సమాచారం అందుకున్న పిడుగురాళ్ల సిఐ హనుమంతరావు, ఎస్ఐ రఫీ, కారంపూడి ఎస్ఐ ఎం.మురళి ఘటనా స్థలిని పరిశీలించారు.



ప్రమాదం గుంటూరు జిల్లా కారంపూడి మండలం జూలకల్లు సమీపంలో బుధవారం ఉదయం డ్రైవర్‌కు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో బస్సును చెట్టుకు ఢీ కొట్టి నిలిపేశాడు

గ్రామాలను ఖాళీ చేసేది లేదు

ఐదు గ్రామాల సమావేశంలో పెద్దల నిర్ణయం

ప్రజాశక్తి-నక్కపల్లి (విశాఖపట్నం)

వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం గ్రామాలను ఎట్టి పరిస్థితిలోనూ ఖాళీ చేసేది లేదని, ఐక్యంగా పోరాడి తిప్పికొడతామని ఐదు గ్రామాల పెద్దలు స్పష్టం చేశారు. ఈ మేరకు విశాఖ జిల్లా నక్కపల్లి మండలం చందనాడ గ్రామంలో బుధవారం ఐదు గ్రామాలకు చెందిన పెద్దలు సమావేశమై నిర్ణయించుకున్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం భూములు తీసుకుంటామని చెప్పిన అధికారులు ఇప్పుడు గ్రామాలను తీసుకుంటామని చెప్పడం దారుణమన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ గ్రామాల్లో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు పరిశ్రమల పేరుతో గ్రామాలను ఖాళీ చేయిస్తే ఏం చేయాలి, ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటిలోగా భూములు ఇవ్వమని అనేక పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. అధికారులు ప్రజలను బెదిరించి బలవంతంగా భూసేకరణ చేపట్టారని, ఇప్పుడు అన్యాయంగా పరిశ్రమల ఏర్పాటు కోసం గ్రామాలను ఖాళీ చేయించాలని చూస్తున్నారని వాపోయారు. ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలతో సంబంధం లేకుండా అధికారులు చట్టాలను ఉల్లంఘించి గ్రామసభలు నిర్వహించడం, సర్వేలు చేపట్టడం సమంజసం కాదని, ఆ రకమైన ప్రయత్నాలు మానుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో చందనాడ నాయకులు గంటా తిరుపతిరావు, ఎంపిటిసి గట్టెం గణేష్, బుచ్చిరాజుపేట సర్పంచ్ భర్త గొర్ల బాబూరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రైల్వేజోన్ కోసం మహా పాదయాత్ర

- కేంద్రం మెడలు వంచైనా సాధిస్తాం
- 'ఉక్కు' సంకల్పంతో ఉద్యమిస్తాం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

'ఎపికి ప్రత్యేక హోదా వల్ల ఏం లాభం.. అవిశ్వాసం పెట్టడం వల్ల ఏం లాభం.. అన్న చంద్రబాబు.. నేడు ప్యాకేజీ వల్ల లాభం లేదని, అవిశ్వాసానికి నువ్వే మద్దతిచ్చావు.. నీది నోరా.. తాటి మట్టా..? జనసేన, వైసిపిని బిజెపి ఆడిస్తుందంటున్నావు... నిన్నటివరకూ నిన్నెవరు ఆడించారో చెప్తావా? నీకేమైనా మతిభ్రమించి మాట్లాడుతున్నావా? అంటూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు విరుచుకుపడ్డారు. తొలుత విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ సాధన కోసం బుధవారం నగరంలోని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యాన మద్దిలపాలెం నుండి మహాపాదయాత్ర ప్రారంభమైంది. ఈ పాదయాత్ర నగరంలోని 72 వార్డుల్లో ఈనెల 29 వరకు కొనసాగనుంది. బుధవారం ఉదయం కళాభారతి, పీఠాపురం కాలనీ మీదుగా అంజయ్యనగర్ వరకు 16 కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగింది. అంతకుముందు ఎయు ఇంజినీరింగ్ కళాశాల గేటు వద్ద బుధవారం ఉదయం జరిగిన సభకు ముఖ్య అతిథిగా పి.మధు హాజరై ప్రసంగించారు. కేంద్రం మెడలు వంచైనా రైల్వేజోన్‌ను సాధిస్తామని, అందుకు విశాఖలో గతంలో జరిగిన 'ఉక్కు ఉద్యమమే' స్ఫూర్తి అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో తెలుగుదేశం, బిజెపియేతర పక్షాలతో సిపిఎం నిర్వహించే రాష్ట్రబంద్‌లు, హర్తాళ్‌లు, నిరసన ఉద్యమాలు, నిరవధిక నిరాహార దీక్షలతో రైల్వేజోన్‌ను సాధిస్తామని హెచ్చరించారు.

రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 2 వరకూ జరగనున్నాయని, ఈనెల 22న జాతీయ రహదారుల బంద్‌కు తమ పార్టీ పిలుపునిచ్చిందని, పిల్లలు, తల్లిదండ్రులకు ఇబ్బంది లేకుండా నిర్వహించాలని ప్రతిపక్ష పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తరువాత ఒంటరి కావడం ఇదే తొలిసారని తెలిపారు. లోక్‌సత్తా, జనసేన, ఆమ్‌ఆద్మీ పార్టీల నేతలంతా తాము నిరవధిక నిరహార దీక్షలకు సిద్ధంగా ఉన్నామని, ఎప్పుడు చేయాలో చెప్పాలని కోరుతున్నారన్నారు. ఏప్రిల్ వరకూ వారిని ఆగమన్నామని, తర్వాత పోరాటాలను ఉధృతం చేస్తామని చెప్పారు. అంగన్‌వాడీలు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తుంటే వారిని ఎక్కడికక్కడ ఇళ్ల దగ్గర, బస్టాండుల్లోనూ, రైల్వేస్టేషన్లలోనూ అమానుషంగా చంద్రబాబు ప్రభుత్వం అరెస్టులు చేయించడం దారుణమని పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సిహెచ్.నరసింగరావు, ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్, మాజీ మంత్రి, మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాసరావు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్, సిపిఐ నాయకులు వామనమూర్తి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు సితార తదితరులు ప్రసంగించారు.

అంతకుముందు రైల్వేజోన్ సాధనకు పాదయాత్రను డప్పు వాయించి మధు ప్రారంభించగా, సభకు సిపిఎం నగర కార్యదర్శి డాక్టర్.బి.గంగారావు అధ్యక్షత వహించారు. ఈ పాదయాత్రలో ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.



విశాఖలో పాదయాత్రను ప్రారంభిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు, ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ, వైసిపి నేత తైనాల విజయ్‌కుమార్ తదితరులు

బిజెపి ఉన్మాదం వల్ల ప్రమాదంలో ప్రజాస్వామ్య వ్యవస్థ

కేంద్రంలోని బిజెపి ఉన్మాదంతో పార్లమెంటరీ, ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాదంలో పడిందని, నాలుగు రోజులుగా పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం పెడుతూ ఉంటే అన్నాడిఎంకె, టిఆర్‌ఎస్ ఎంపిలను అడ్డం పెట్టుకుని తీర్మానం ఆమోదానికి రాకుండా నరేంద్రమోడీ సర్కారు తీర్మానాన్ని తోసేస్తుందని, ఇదే తీరు కొనసాగితే ప్రజాస్వామ్యంలో 'అవిశ్వాస తీర్మానం' ఇంకా నాలుక గీసుకోవడానికి కూడా పనికి రాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ఎద్దేవా చేశారు. బుధవారం ఉదయం విశాఖ నగరంలో పాదయాత్ర, సభను ప్రారంభించడానికి విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడారు.

భూ కబ్జాలను ప్రోత్సహిస్తున్న మంత్రి సోమిరెడ్డి

సర్వేపల్లి వైసిపి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్

భూ కబ్జాలను మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో రాందాసు కండ్రిగ భూ కుంభకోణానికి సంబంధించిన వివరాలు తెలిపారు. వెంకటాచలం మండలం రాందాసు కండ్రిగలో నిరుపేదలకు చెందిన సిజెఎఫ్ఎస్ భూములకు డి-ఫామ్ పట్టాలు సృష్టించి రూ.3 కోట్ల కుంభకోణానికి మంత్రి సోమిరెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 40 ఏళ్లుగా భూ యజమానులు యూకలిప్టస్ చెట్లు సాగు చేసుకుంటున్న భూమిని ఫోర్జరీ చేసి డి-ఫామ్ పట్టాలు సృష్టించారన్నారు. మంత్రికి సిజెఎఫ్ఎస్‌కు, డి-ఫామ్‌కు తేడా తెలియకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తహశీల్దార్ వద్దకు వెళ్లి ఈ పత్రాలకు సంబంధించిన వివరాల సేకరణను వీడియో రికార్డింగ్ చేశామన్నారు. నీతిమంతుడుగా చెప్పుకుంటున్న మంత్రి సోమిరెడ్డి ఎవరికి మద్దతుగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ప్రశ్నించారు. పేదవారి భూములకు పరిహారాలను వారికి దక్కనీయకుండా దిగమింగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కలెక్టరు ఉదాసీనంగా ప్రవర్తించడం సరికాదన్నారు. సోమిరెడ్డి ప్రజాప్రతినిధి కాదని, అధికారంలో భాగస్వామి మాత్రమేనన్నారు. సోమిరెడ్డిని మంత్రి స్థాయి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు రమణయ్య, జయరామయ్య, తిరుపాలు, శివయ్య పాల్గొన్నారు.



విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద భిక్షాటన చేస్తున్న నిరుద్యోగులు

ఖాళీ పోస్టుల భర్తీకి బిక్షాటన

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ నిరుద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యాన విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బుధవారం నిరుద్యోగులు బిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జాతీయ అధ్యక్షులు లగుడు గోవిందరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ఎపిపిఎస్‌సి ద్వారా వెంటనే భర్తీ చేయాలని, కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని, టిడిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరుద్యోగులమంతా కలిసి ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. నిరుద్యోగుల గురించి జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్, ప్రతిపక్ష నేత, వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోపోవడం దారుణమన్నారు. టిడిపి అధికారంలోకొచ్చి నాలుగేళ్లు గడుస్తున్నా ఎటువంటి గ్రూపు నోటిఫికేషన్లూ విడుదల చేయలేదని, నిరుద్యోగ భృతి ఇస్తామనే హామీని అమలు చేయకుండా నిరుద్యోగులను చంద్రబాబు మోసం చేస్తున్నారన్నారు.

'కల్తీ మిరపనారు' కౌలు రైతులను ఆదుకోవాలి

ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగబోయిన రంగారావు

ప్రజాశక్తి-తిరువూరు (కృష్ణా)

కల్తీ మిరపనారుతో నష్టపోయిన రైతులకు నర్సరీ యజమానులు నష్టపరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో ఆర్అర్ యాక్టు కింద వారి ఆస్తులను జప్తుచేసి పరిహారం చెల్లించాలని కలెక్టర్ ఆదేశాల్చి నెలలు గడుస్తున్నా నేటికీ అమలు చేయకపోవడం దారుణమని కౌలు రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగబోయిన రంగారావు అన్నారు. ఏపి కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా తిరువూరులోని సుందరయ్య భవన్‌లో గంపలగూడెం మండలం పెనుగొలను రైతులకు నష్టపరిహారం చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై చర్చించేందుకు అఖిలపక్ష రైతు సంఘాల నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో రంగారావు మాట్లాడుతూ.. రైతులకు ప్రభుత్వమే పరిహారం ఇవ్వనీయకుండా అడ్డుకుంటుందని విమర్శించారు. పరిహారం ఇప్పించేందుకు అన్ని రైతుసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం పశ్చిమ కృష్ణా అధ్యక్షులు ఎస్.నాగేశ్వరరెడ్డి, వైసిపి రైతు విభాగం జిల్లా నాయకులు ఆలపాటి శ్రీనివాసరావు, చలమాల సత్యనారాయణ, కాంగ్రెస్ రైతుసంఘం నాయకులు ఉప్పలపాటి లక్ష్మీదాసు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎఫ్‌డిసి రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు సిటీ

నేషనల్ షెడ్యూల్ క్యాస్ట్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఎఫ్‌డిసి) పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు వెంటనే రుణాలను మంజూరు చేయాలని దళిత ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎఫ్‌డిసి పథకం లబ్ధిదారులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థి పరిషత్ నాయకులు ఓబులేష్, ఎంఆర్‌పిఎస్ దండోర నాయకులు సోమసుందరం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఇచ్చే ఎన్ఎస్ఎఫ్‌డిసి రుణాలలో అవకతవకలు జరగడంతో జిల్లా కలెక్టర్ వాటిని రద్దు చేశారని చెప్పారు. ఇందులో అవినీతి ఏ రూపంలో, ఎవరు చేశారనే దానిలో కలెక్టర్‌కు స్పష్టత ఇవ్వలేదన్నారు. స్పష్టత వుంటే ఇప్పటికే అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేవారన్నారు. ఎన్ఎస్ఎఫ్‌డిసి రుణాల్లో అధికారులకు తెలియకుండా అవకతవకలు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. ఇది కేవలం దళితుల పట్ల కలెక్టర్ చూపుతున్న వివక్షగానే భావించాల్సి వస్తోందని అన్నారు. వెంటనే రుణాలను మంజూరు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పవన్‌ను విమర్శించడం సరికాదు

ప్రజాశక్తి-సత్యనారాయణపురం (విజయవాడ)/హైదరాబాద్ బ్యూరో

జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై టిడిపి కాపు మంత్రులు చేసిన విమర్శలను కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం ఖండించారు. విజయవాడలోని కాపునాడు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కులమతాలకు అతీతంగా సామాజిక విప్లవం తీసుకువచ్చేందుకు పోరాడుతున్న ఒక పార్టీ అధ్యక్షుడిని విమర్శించడం సరికాదన్నారు. కాపుల మధ్య విబేధాలు సృష్టించడానికి చంద్రబాబు ఆడే డ్రామాలో పావులుగా మారవద్దని హితవు పలికారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పాలకులను విమర్శించని శాసన మండలి సభ్యుడు రాజేంద్రప్రసాద్ పవన్‌ను విమర్శించడం పద్ధతి కాదన్నారు. హోదా కోసం చిత్తశుద్ధితో పోరాటం చేస్తున్నామని జనసేన అధికార ప్రతినిధి అద్దేపల్లి శ్రీధర్ అన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మంత్రులు చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. మంత్రులు తమ పార్టీపై కాకుండా ప్రజా సమస్యలపై దృష్టిపెడితే బాగుంటుందని సూచించారు.

ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

వేతన సవరణ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి - కడపఅర్బన్

ఎల్ఐసి డివిజన్ కార్యాలయ ఆవరణలో దేశవ్యాప్త పిలుపు మేరకు ఉద్యోగులు బుధవారం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గతేడాది ఆగస్టు నుంచి పెండింగులో ఉన్న వేతన సవరణ సమస్యలపై తక్షణం ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాధరెడ్డి, క్లాస్-1 అధికార్ల సంఘం ప్రధాన కార్యదర్శి టి.మురళీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతన సవరణపై ఇంత వరకు సరైన చర్చలే ప్రారంభం కాలేదని తెలిపారు. ఎల్ఐసిలో 12 వేల మంది అధికారులు, ఉద్యోగులు, పెన్షన్ సదుపాయాన్ని కోరుకోవడానికి, మరో ఆప్షన్ కోసం వేచి ఉన్నారన్నారు. యాజమాన్యం సానుకూలంగా ఉన్నా ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం లేదని విమర్శించారు.

ప్రజ్ఞ

జవాబులు

1. భావనాకాంత్
2. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో (ఈ నెల 19న)
3. యూకే గోల్డెన్ ఫ్లేమ్
4. ముంబై
5. మార్చి 21

రహదారుల దిగ్బంధనాన్ని జయప్రదం చేయండి

- అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల పిలుపు
- రాష్ట్రవ్యాప్తంగా రౌండ్‌టేబుల్ సమావేశాలు, సదస్సులు, జీపు జాతాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీల అమలుకు గురువారం చేపడుతున్న జాతీయ రహదారుల బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విస్తృత ప్రచారం జరిగింది. అఖిలపక్షాలు, ప్రజాసంఘాలు, ఎపి ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యాన పలు జిల్లాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు, పలుచోట్ల బైక్ ర్యాలీలు నిర్వహించారు. సిపిఎం, సిపిఐ, వైసిపి, జనసేన పార్టీలతో పాటు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థులకు ఆటంకం కలగకుండా గురువారం ఉదయం పది గంటల నుంచి 12 గంటల వరకు జాతీయ రహదారులను దిగ్బంధం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశాల్లో వక్తలు పిలుపునిచ్చారు.

ఎపి ప్రత్యేక హోదా హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో విశాఖ జిల్లా అనకాపల్లిలో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆంధ్ర మేధావుల ఫోరం అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం ఆంధ్రప్రదేశ్‌లో జరిగే ఆందోళనల దెబ్బకు ఢిల్లీ గోడలు బద్దలవ్వాలన్నారు. గద్దెనెక్కిన ఢిల్లీ పెద్దలు దిగి వచ్చేలా ఉద్యమం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇది భావితరాల భవిష్యత్తు కోసం జరుగుతున్న పోరాటమని, రాజకీయాలకు అతీతంగా అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడాల్సి ఉందని తెలిపారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ప్రసంగించారు. ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



విశాఖ జిల్లా అనకాపల్లిలో అభివాదం చేస్తున్న చలసాని, దాడి వీరభద్రరావు, లోకనాథం, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

కర్నూలులో వామపక్షాల ఆధ్వర్యాన కార్మిక కర్షక భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిపిఎం, సిపిఐ, వైసిపి, జనసేన పార్టీలతో పాటు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లాలో వైసిపి, సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో ప్రత్యేక సాధన సమితి ఆధ్వర్యాన సమావేశం జరిగింది. సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, జనసేన పార్టీ, మర్చంట్ ఛాంబర్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఎపి ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యాన ప్రకాశం జిల్లా ఒంగోలులో సమావేశం నిర్వహించారు. శ్రీకాకుళంలో సిపిఐ కార్యాలయంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు, వామపక్షాలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కృష్ణా జిల్లా నందిగామలో ఎపి ప్రత్యేక హోదా హామీ-విభజన హామీల సాధన సమితి, అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో తాడ్డి యువసేన అధ్యక్షులు డాక్టర్ తాడ్డి జశ్వంత్‌నాయుడు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. సిపిఐ, సిపిఎం, వైసిపి నాయకులు సంఘీభావం తెలిపారు.

పలు చోట్ల బైక్ ర్యాలీలు

విజయనగరంలో టిడిపి ఆధ్వర్యాన భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్, ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. పశ్చిమగోదావరి జిల్లా చాగల్లులోని మెయిన్ బజార్‌లో టిడిపి ఆధ్వర్యాన మానవహారం నిర్వహించారు. తాళ్లపూడిలో మోటార్ సైకిల్ ర్యాలీ చేపట్టారు. అవనిగడ్డ సీతాయిలంక అంబేద్కర్ విగ్రహం వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యాన మౌనదీక్ష చేపట్టారు.

అనకాపల్లిలో సిపిఎం ఆధ్వర్యాన జీపు జాతా ప్రారంభం

ప్రత్యేక హోదా సాధన ఉద్యమ సందేశాన్ని గడపగడపకూ చేరవేసేందుకు సిపిఎం ఆధ్వర్యాన జీతా జాతాను విశాఖ జిల్లా అనకాపల్లిలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి ప్రారంభించారు. ఈ నెల 28వ తేదీ వరకూ ఆ జాతా కొనసాగనుంది.

కుంభకోణం

ఆ రూ.25 కోట్లు ఏమైనట్లు..!

- నిధుల దుర్వినియోగంలో అధికారిణి పాత్రపై విజిలెన్స్ నివేదిక
- ఆరోపణలు ఎదుర్కొంటున్న డిప్యూటేషన్‌పై కొనసాగింపు
- ఓ మంత్రి జోక్యంతో చర్యలకు వెనుకాడుతున్న యంత్రాంగం

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ జిల్లా చింతపల్లి సబ్‌ట్రెజరీ కార్యాలయ కేంద్రంగా రూ.25 కోట్ల వరకు జరిగిన కుంభకోణంపై అధికారులు మౌనం దాల్చుతున్నారు. అవినీతిపరుల గుండెల్లో నిద్రపోతామన్న ప్రభుత్వాధినేత ఆచరణలో మాత్రం అలాంటి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనపడటం లేదని సర్వత్రా వినవస్తోంది. చింతపల్లి సబ్‌ట్రెజరీ కార్యాలయంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం దాదాపు ఆర్నెల్ల క్రితం ఇచ్చిన నివేదికను సైతం ప్రభుత్వం బుట్టదాఖలు చేస్తున్నట్లు కనబడుతోంది.

సబ్‌ట్రెజరీలో 2010-11 ఆర్థిక సంవత్సరం నుంచి 2014 జులై వరకు దాదాపు రూ.25 కోట్ల మేర నిధులు దుర్వినియోగంపై ఆ కాలంలో జిల్లా ఖజానా శాఖాధికారిగా పనిచేసిన గీతాదేవిపై తీవ్రస్థాయిలో ఆరోపణలున్నాయి. సబ్‌ట్రెజరీ పరిధిలోని పిహెచ్‌సిల్లో 300 ఒసిఎస్ పద్దు కింద పనిచేస్తున్న ఉద్యోగులను కాక ఎక్కువగా చూపించి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు 2014 నవంబర్లో వెలుగుచూసింది. 300 ఒసిఎస్ పద్దు కింద 774 వాంటింగ్ ఓచర్ల విషయంలో గీతాదేవి దృష్టి పెట్టకపోవడంతో ప్రజాధనం దుర్వినియోగమైనట్లు సమాచారమున్నా రాష్ట్ర ఖజానా శాఖ ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని కోడై కూసింది.

నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో వైద్య, ఆరోగ్యశాఖాధికారులు పెట్టిన బడ్జెట్‌కు అభ్యంతరం చెప్పకుండా నిధులు విడుదల చేయడంలో గీతాదేవి కీలకంగా వ్యవహరించారన్న విమర్శలున్నాయి. దీనిపై 2012-13, 2013-14 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి అనకాపల్లి పోలీసు నేర విభాగం చేపట్టిన విచారణలో రూ.8.20 కోట్లు దుర్వినియోగమైనట్లు ప్రాథమికంగా నిర్ధారించి వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులను అరెస్టు చేశారు. రూ.25 కోట్ల నిధులు దుర్వినియోగంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న గీతాదేవిపై అటు శాఖాపరంగాగానీ, ఇటు నేరవిభాగంగానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. చింతపల్లి ఉపఖజానా కార్యాలయంలో జరిగిన నిధులు దుర్వినియోగంపై విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని విశాఖ రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని ప్రభుత్వం కొన్నినెలల క్రితం ఆదేశించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేపట్టిన విచారణలో దాదాపు రూ.10 కోట్లు నిధులు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించి ఆ విభాగం డైరెక్టర్ జనరల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నివేదిక సమర్పించినట్లు తెలిసింది. నిధుల దుర్వినియోగంలో గీతాదేవి పాత్రపై నివేదికలో పొందుపర్చినట్లు తెలిసింది. అయినా ఇంతవరకు ఆమెపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు సరికదా విశాఖలో బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించి జిల్లాలోనే కొనసాగిస్తున్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆమెపై చర్యలు తీసుకోని ప్రభుత్వం అదే జిల్లాలోనే ఆమె కోరుకున్న స్థానానికి డిప్యూటేషన్‌పై నియమించడం గమనార్హం. ఇక్కడ కూడా జిల్లాకు చెందిన ఓ మంత్రి జోక్యం ఎక్కువగా ఉండడంతో గీతాదేవిపై అధికారులు చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నట్లు సమాచారం.

మేజర్ పోర్టుల అథారిటీ బిల్లును ఉపసంహరించాలని ధర్నా

ప్రజాశక్తి- వన్‌టౌన్, విశాఖ

మేజర్ పోర్టుల అథారిటీ బిల్లును కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్, విడిఎల్‌బి అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన బుధవారం స్థానిక పోర్టు సీహార్స్ జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి విఎస్.పద్మనాభరాజు మాట్లాడుతూ, మేజర్ పోర్టుల చట్టం-1963 స్థానంలో మేజర్ పోర్టుల అథారిటీ బిల్లు-2016ను పార్లమెంటులో ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ బిల్లు చట్ట రూపం దాల్చితే మేజర్ పోర్టులన్నీ ప్రయివేటుపరం కానున్నాయని తెలిపారు. దీని వల్ల కార్మికులు ఉద్యోగ భద్రత కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంటుందని పేర్కొన్నారు. విలువైన ప్రభుత్వ భూములు కార్పొరేట్ వ్యక్తులకు, విదేశీ పెట్టుబడిదారులకు కారుచౌకగా అమ్ముకునేందుకు ప్రభుత్వానికి మరింత వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. దేశ భద్రతకు, రాష్ట్ర ఆదాయానికి, అభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారే ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పులివెందులలో జంట హత్యలు

ప్రజాశక్తి-పులివెందుల (కడప)

పులివెందులలో జంట హత్యలు కలకలం రేపాయి. మంగళవారం అర్ధరాత్రి అశోక్‌బాబు (22), ఖాదర్ (23) అనే ఇద్దరు యువకులను ప్రత్యర్థులు దారుణంగా హతమార్చారు. ఈ హత్యలకు వివాహేతర సంబంధం, ఆర్థిక లావాదేవీలే కారణమని తెలుస్తోంది. హత్య జరిగిన అనంతరం కొంతమంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనకు సంబంధించి పోలీసులు, బంధువుల వివరాల ప్రకారం.. ఇటీవల కాలంలో నాగరాజు, అశోక్‌బాబు మధ్య మనస్పర్థలు ఎక్కువయ్యాయి. దీంతో అశోక్‌బాబుతో పాటు ఖాదర్‌ను మారణాయుధాలతో విచక్షణా రహితంగా దాడిచేసి హతమార్చారు. తన కుమారుడిని దాడి చేసి చంపారని అశోక్ తల్లి రామలక్షుమ్మ ఆరోపించారు.

కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

ఐదుగురు ఉగ్రవాదులు, నలుగురు భద్రతా సిబ్బంది మృతి

శ్రీనగర్ : కాశ్మీర్‌లో కుప్వారా జిల్లాలో బుధవారం జరిగిన ఎదురు కాల్పుల సంఘటనలో ఐదుగురు ఉగ్రవాదులు నలుగురు భద్రత సిబ్బంది మృతి చెందారు. మృతి చెందిన భద్రతా సిబ్బందిలో ఇద్దరు సైనికులు, ఇద్దరు పోలీసులు ఉన్నారు. అరంపోరా ప్రాంతంలో తనిఖీలు చేస్తున్న భద్రతా సిబ్బందిపై ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించారని, దీంతో భద్రతా సిబ్బంది కూడా ఎదురుకాల్పులు ప్రారంభించారని అధికారులు తెలిపారు. కాగా, ఇదే ప్రాంతంలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు ఉగ్రవాదులు మృతి చెందారు.

వేడుక

నవ తెలంగాణ దినపత్రిక 3వ వార్షికోత్సవ వేడుకలు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగాయి. అత్యధిక ఉత్తమ కథనాలు రాసిన బ్యూరో రిపోర్టర్ జగదీష్‌ను అభినందిస్తున్న ముఖ్య అతిథి అంపశయ్య నవీన్. చిత్రంలో 10 టివి ఎండి వేణుగోపాలరావు, నవ తెలంగాణ ఎడిటర్ వీరయ్య ప్రభృతులు





సదస్సు

న్యూఢిల్లీలో భూమి అధికార్ ఆందోళన్ నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

దళితులపై దాడులు ఆపాలి

డిఎస్ఎంఎం ఆధ్వర్యంలో పార్లమెంట్‌కు మార్చ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో దళితులపై దాడులను నివారించాలని దళిత శోషన్ ముక్తి మంచ్(డిఎస్ఎంఎం) ప్రధాన కార్యదర్శి రామచందర్ డోమ్ డిమాండ్ చేశారు. దళిత యువతకు ఉద్యోగాలను ఇవ్వాలని, ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఆయన కోరారు. దేశంలో దళితులపై దాడులను నివారించాలని, ఎస్సీ సబ్ ప్లాన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ డిఎస్ఎంఎం ఆధ్వర్యంలో పార్లమెంట్‌కు మార్చ్ జరిగింది. ఈ ధర్నాలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, సుభాషిణీ అలీ, సిపిఎం ఎంపిలు శ్రీమతి టీచర్, సోం ప్రసాద్, ఎఐకెఎస్ జాతీయ సహాయ కార్యదర్శి విజూ కృష్ణన్, ఎఐఎడబ్ల్యుయు జాతీయ అధ్యక్షుడు తిరువక్కరసు పాల్గొని సంఘీభావం తెలిపారు. "దేశంలో ప్రతి 15 నిమిషాలకు దళితులపై ఒక నేరం జరుగుతోంది. ప్రతి రోజు ఆరుగురు దళిత మహిళలు అత్యాచారాలకు గురవుతున్నారు. 2007-2017 మధ్య కాలంలో దళితులపై అత్యాచారాలు 66శాతం పెరిగాయని వివిధ గణంకాలు తెలుపుతున్నాయి" అని డిఎస్ఎంఎం ఆందోళన వ్యక్తం చేసింది. జంతర్ మంతర్ క్రాస్ రోడ్డు వద్ద ప్రారంభమైన డిఎస్ఎంఎం ర్యాలీ పార్లమెంట్ స్ట్రీట్ వరకు సాగింది. దారిపొడువునా పెద్ద పెట్టున నినాదాలతో హోరెత్తించారు. వివిధ డిమాండ్లతో కూడిన ప్లకార్డులను చేబూని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. దేశ నలుమూలల నుండి వచ్చిన వేలాది మంది దళితులు తమ హక్కుల కోసం గళమెత్తారు. "తొమ్మిది ప్రధానమైన డిమాండ్లపై పార్లమెంట్ మార్చ్ జరిగింది. 1. దళితులపై అణచివేత, దాడులు, వివక్షతలను నివారించాలి 2, తక్షణమే భీమ్ కోరిగావ్‌లో దాడులకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలి. అరెస్టు చేసిన అమాయక దళిత కార్యకర్తలను విడుదల చేయాలి. 3. షరతులు లేకుండా భీమ్ ఆర్మీ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్‌ను, నేతలు సోను, శివ కుమార్‌లను విడుదల చేయాలి. 4. దళిత యువతకు ఉద్యోగాలు కల్పించాలి. రిజర్వేషన్లను ప్రైవేట్ రంగానికి వర్తింపచేయాలి. 5. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో నిషేధాన్ని ఎత్తివేయాలి. 6. దళితుల పిల్లలందరికీ విద్యను అందించాలి. విద్యార్థులకు స్కాలర్ షిప్స్ పెంచాలి. 7. ప్రతి దళిత కుటుంబానికి కనీసం రెండు ఎకరాల భూమిని ఇవ్వాలి. 8. లక్షిత కుటుంబాలకు తగినంత ఆరోగ్య సంరక్షణలను కల్పించాలి. 9. ప్రతి దళిత కుటుంబానికి ఇల్లు, ఆహార భద్రత కల్పించాలి" వంటి డిమాండ్లతో ధర్నా జరిగింది.

ఈ సందర్భంగా జరిగిన ధర్నాలో డిఎస్ఎంఎం ప్రధాన కార్యదర్శి రామచందర్ డోమ్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలో వచ్చినప్పటి నుండి ఈ నాలుగేళ్లలో దేశంలో పరిస్థితి మరింత దిగజారిందని, దళితులకు వ్యతిరేకంగా హింస పెరిగిందని అన్నారు. కేంద్రంలోనూ, వివిధ రాష్ట్రాల్లోనూ బిజెపి పాలనలో హిందూత్వ భావజాలాన్ని అమలు చేయడంతో మత విభజన పెరిగిందని విమర్శించారు. 2006లో దళితులకు వ్యతిరేకంగా 27,070 నేరాలు జరిగాయని, 2011కు నాటికి ఆ సంఖ్య 33,719 కు పెరిగిందని తెలిపారు. బిజెపి గద్దెనెక్కిన నాటి నుంచీ గత నాలుగేళ్లలో దళితులపై 33,659 దాడులకు సంబంధించి కేసులు నమోదు అయ్యాయని అన్నారు. ఇది చాలా ఆందోళనకరమని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో తృణముల్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత దారుణమైన పరిస్థితి నెలకొందని విమర్శించారు. అక్కడ దళితులపైన, ఆదివాసులపైన అత్యాచారాలు, హింస పెరిగాయని, మమతా బెనర్జీ ప్రభుత్వం బహిరంగంగానే నేరస్తులను కాపాడుతోందని దుయ్యబట్టారు. డిఎస్ఎంఎం జెండా కిందకు ఎక్కువ మందిని తీసుకురావాలని, రోజు వారీ వార్తలుగా మారిన దళితులపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దళిత యువతకు ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికల్లో మోడీ ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శించారు. దేశంలో దళిత యువత నిరుద్యోగులుగా ఉన్నారని, వారికి ఉద్యోగాలు కల్పించాల్సిన ప్రభుత్వం కనీసం ఆ దిశగా యత్నించడం లేదని మండిపడ్డారు. మోడీ సర్కార్ ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయటం లేదని, రోజు రోజుకి దాని పాత్రను కుదిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని ప్రవేటీకరిస్తోన్నారని, దీన్ని డిఎస్ఎంఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. రోజురోజుకి విస్తరిస్తున్న ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా జరగడం లేదని, అందులో దళితుల సమస్యలు చర్చించేందుకు ప్రభుత్వం ముందుకు రావటం లేదని దుయ్యబట్టారు.



విగ్రహాలను ధ్వంసం చేయగరేమో.. కానీ సిద్ధాంతాలను కాదు : సుభాషిణీ అలీ

ఎస్సీ సబ్ ప్లాన్‌ను ఎత్తివేసేందుకు మోడీ సర్కార్ ప్రయత్నం చేస్తోందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు సుభాషిణీ అలీ విమర్శించారు. ఎస్సీ సబ్‌ప్లాన్‌ను పునరుద్ధరించాలని ఆమె డిమాండ్ చేశారు. దళితుల అభివృద్ధికి, సంక్షేమానికి నిధులు కేటాయింపు పెంచాలని కోరారు. నేషనల్ క్రైం రికార్డ్సు బ్యూరో గణాంకాల ప్రకారం బిజెపి పాలిత ఉత్తం ప్రదేశ్‌లో దళితులపై అత్యాచారాలు పెరిగా యని, దేశంలో 20 శాతం ఉన్న దళిత జనాభాలో 17 శాతంపై దాడులు జరుగుతున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. రాజస్థాన్, బీహార్‌లలో కూడా దళితులపై పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయని తెలిపారు.

బిజెపి పాలిత రాష్ట్రాల్లో గో గూండాలు దళితులపై విరుచు కుపడుతున్నారని, హత్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బిజెపి అనుబంధ విద్యార్థి సంఘం ఎబివిపి నేతలు చిన్న పిల్లలపైన కూడా దాడులకు పాల్పడుతున్నారని, వారికి మానవత్వం కూడా లేదా? అని ప్రశ్నించారు. జెఎన్‌యులో ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన ప్రొఫెసర్ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడితే, ఆయనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే కనీసం అరెస్టు చేయలేదని, కానీ ఉత్తర ప్రదేశ్‌లో దళితుల హక్కుల కోసం పోరాడుతున్న భీమ్ ఆర్మీ నేత చంద్రశేఖర్‌ను మాత్రం అరెస్టు చేసి జైల్లో ఉంచారని విమర్శించారు. అంబేద్కర్, పెరియార్, పూలే విగ్రహాలను ధ్వంసం చేయడం అమానుషమని, అధికారాన్ని అడ్డుపెట్టుకొని వారి విగ్రహాలను ధ్వంసం చేయగలరేమో కానీ వారి సిద్ధాంతాలను ధ్వంసం చేయలేరని స్పష్టం చేశారు. ఎస్ఎంఎం జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో అన్ని ప్రాంతాల్లో దళితులపై దాడులు పెరుగుతున్నాయని, కానీ ప్రభుత్వానికి పట్టనట్టు వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎంఎం ఢిల్లీ కార్యదర్శి నత్తు ప్రసాద్, జాతీయ నాయకురాలు జి.మమత, కెవిపిఎస్ ఏపి, తెలంగాణ కార్యదర్శులు మాల్యాద్రి, భాస్కర్, వివిధ రాష్ట్రాల నేతలు పాల్గొన్నారు.

వ్యవసాయ సంక్షోభం పట్టని మోడీ ప్రభుత్వం

భూమి అధికార్ ఆందోళన సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో వ్యవసాయ సంక్షోభం మోడీ సర్కార్ పట్టడం లేదని భూమి అధికార్ ఆందోళన్(బిఎఎ) సదస్సులో వక్తలు ధ్వజమెత్తారు.. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే, బాధ్యత గల ప్రధాన మంత్రి కనీసం మాట్లాడటం లేదని విమర్శించారు. రైతాంగం చిన్నాభిన్నం అవుతున్నారని, వ్యవసాయ రంగం క్షీణిస్తోందని అన్నారు. ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించడం సబబు కాదని అన్నారు. వ్యవసాయం లేనిదే దేశం లేదని, అలాంటి రైతు బతుకు చితికిపోతుంటే పాలక వర్గాలు గద్దల్లా చూస్తున్నాయని ధ్వజమెత్తారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయలేదని, రుణమాఫీ హామీని పక్కన పెట్టారని అన్నారు. రాజకీయాలు మతం వేరని, మతం కొందరికి సంబంధించినదని, రాజకీయాలు అందరికీ సంబంధించినవని వక్తలు అన్నారు. కనుక రాజకీయాల్లో మతాన్ని జొప్పించొద్దని కోరారు. దేశంలో "వ్యవసాయ సంక్షోభం, దళిత, మైనార్టీలపై గో గూండాల దాడులు"పై 200 రైతుల సంఘాలతో కూడిన బిఎఎ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు స్థానిక కాన్సుట్యూషన్ క్లబ్‌లో ఫోటో ఎగ్జిబిషన్, జాతీయ సదస్సులు జరిగాయి. పలు అంశాలపై మేథావులు, వివిధ ప్రజా సంఘాలు నేతలు, సామాజిక సంఘాల నేతలు మాట్లాడారు.

ఈ సందర్భంగా సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలని భూమి అధికార్ ఆందోళన్ నేతలకు పిలుపు నిచ్చారు. రైతాంగ సమస్యలతో పాటు సామాన్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా పాలక వర్గాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతాంగం ఏకం కాకుండా విడదీసే ప్రయత్నం చేస్తోందని, దాన్ని రైతు సంఘాలు తిప్పికొట్టాలని కోరారు. మతం పేరుతో విభజన దేశానికి ప్రమాదమని, మనందరం ఇటువంటి యత్నాలను త్రిప్పికొట్టాలని అన్నారు. వ్యవసాయం సంక్షోభం కారణంగా వ్యవసాయోత్పత్తి తగ్గిపోయిందని, ఆహార భద్రత కల్పించలేకపోతున్నామని అన్నారు. రైతాంగ సమస్యలపైన, వ్యవసాయ సంక్షోభంపైన సిపిఎం పార్లమెంట్‌లోనూ, పార్లమెంట్ వెలుపల గళం విప్పుతోందని ఏచూరి వెల్లడించారు. బిఎఎ చేపట్టిన ఆందోళనకు మద్దతుగా సిపిఎం నిలుస్తుందని అన్నారు. దేశంలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయని, ఏం తినాలో, ఏ బట్టలు వేసుకోవాలో, ఏం మాట్లాడాలో వంటి వాటిని కూడా నిర్ణయించే శక్తులు పెరిగాయని, కేంద్ర ప్రభుత్వ ప్రోద్బలంతోనే ఈ కుట్రలు సాగుతున్నాయని అన్నారు. మోరల్ పోలీసింగ్ చేస్తోంటే, రాజ్యాంగేతర శక్తులుగా చలామణీ అవుతుంటే కనీసం చర్యలు లేవని, పైపెచ్చు ప్రశ్నించిన వాళ్లపై దాడులు చేస్తున్నారని అన్నారు. దేశంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రైతులు, దళితులు, ఆదివాసులు, మైనార్టీలపై దాడులు జరుగుతుంటే ప్రభుత్వాలు పట్టనట్టు వ్యవహరిస్తున్నాయని దుయ్యబట్టారు. తప్పులు చేసిన వారు రోడ్డుపై కాలర్ ఎగరేసుకొని తిరుగుతుంటే, అమాయకులు జైల్లో, పోలీస్ స్టేషన్‌లో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు కుట్రలు పన్నుతోందని, ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన చట్ట సభల పాత్రను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. దేశంలో నెలకొన్న ఈ అనిశ్చిత, ప్రమాదకర పరిస్థితిని మార్చాలని, అందుకు అందరం ఐక్యంగా ఉద్యమించాలని కోరారు.

సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఫాసిస్టు పాలన సాగుతోందని, మతాలు, కులాలు, ప్రాంతాలు, జాతులు పేరుతో విభజనకు కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని అధిగమించి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. వ్యవసాయాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, అందుకను గుణంగానే ప్రభుత్వ విధానాలు ఉన్నాయని అన్నారు. కార్పొరేట్లకు దోచిపెట్టి, పేదల నోట్లో మట్టి కొడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జెడియు మాజీ ఎంపి శరద్ యాదవ్, సిపిఐ ఎంపి డి.రాజా, ఆర్జెడి ఎంపి మనోజ్ జా, ఎన్సీపి ఎంపి డిపి తిరుపతి, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి దేబబ్రత బిశ్వాస్, ఆప్ ఎంపి సంజయ్ సింగ్, టిఎంసి ఎంపి సుఖేందు శేఖర్ రాయ్, ఎస్పీ ఎంపి నీరాజ్ శేఖర్, ఎంపి రాజు శెట్టి, సామాజిక ఉద్యమ కారులు తీస్తా సెతల్వాద్, కంచె ఐలయ్య, మౌలానా అనీఫ్, సప్త మనగీర్, మేధా పాట్కర్, ఎఐకెస్ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా, సిపిఎం ఎంపిలు జితేంద్ర చౌదరి, సోం ప్రసాద్, గో గూండాల బాధితులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు లేఖకు బిజెపి కౌంటర్ లేఖ

నేడు విడుదల చేయనున్న అమిత్ షా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

టిడిపి అధ్యక్షుడు, ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లేఖకు బిజెపి కౌంటర్ సిద్ధం చేసింది. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా నేడు (గురువారం) ఆ లేఖను విడుదల చేసే అవకాశం ఉంది. చంద్రబాబు చేసిన ప్రతి ఆరోపణకు లేఖలో సమాధానం ఇవ్వాలని బిజెపి నిర్ణయించింది. మిత్ర ధర్మాన్ని టిడిపి ఎలా విస్మరించిందో, బిజెపిని ఎలా ద్రోహం చేసిందో ఆ లేఖలో అమిత్ షా ప్రస్తావించనున్నారు. ఇప్పటి వరకూ ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం చేసిన సాయం, భవిష్యత్‌లో చేయబోయే సాయాన్ని ఆ లేఖలో వివరించనున్నారు. అలాగే ప్రత్యేక హోదాపై చంద్రబాబు వైఖరి, మాట మార్చిన తీరును అమిత్ షా ఎండగట్టనున్నారు. కాగా చంద్రబాబు నాయుడు కొద్ది రోజుల క్రితం అమిత్ షాకు లేఖ రాసిన విషయం తెలిసిందే. ఎన్డీఏ నుంచి టిడిపి బయటకు రావడానికి గల కారణాలను ఆయన ఆ లేఖలో వివరించారు. రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజించడం వల్ల ఐదు కోట్ల మంది ప్రజలు రోడ్డున పడ్డారని, ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రానికి ఏదైనా చేస్తుందని ఎన్నో ఆశలతో వేచి చూశామని, కానీ ఏమి చేయలేదని, హామీల అమలులో బిజెపి ఎంత మాత్రం చిత్తశుద్ధి చూపించలేదంటూ అందుకే తప్పని పరిస్థితుల్లో ఎన్డీఏ నుంచి బయటకు వచ్చామని అమిత్ షాకు చంద్రబాబు ఆ లేఖలో పేర్కొన్నారు.

ఆధార్‌పై పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌కు అనుమతివ్వండి

సుప్రీంను కోరిన కేంద్రం

న్యూఢిల్లీ : ఆధార్‌పై నెలకొన్న ఆందోళనలను తొలగించేందుకు కోర్టులో దానిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చేందుకు సిఇఓను అనుమతించాలని కేంద్ర ప్రభుత్వం బుధవారం సుప్రీం కోర్టును కోరింది. ఆధార్‌కు రాజ్యాంగ పరమైన చెల్లుబాటును సవాల్‌చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వం లోని ధర్మాసనం విచారణ జరుపుతున్నది. కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తిపై మిశ్రా స్పందిస్తూ రాజ్యాంగ ధర్మాసనంలోని ఇతర ఐదుగురు న్యాయమూర్తులతో చర్చించిన తరువాత దానిపై ముందుకెళ్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం తరుపున తన వాదనను వినిపించేందుకు కోర్టు హాజరైన అటార్నీ జనరల్ కె.కె. వేణు గోపాల్ మాట్లాడుతూ ఆ సాంకేతిక కోణాలపై సిఇఓ మరింత స్పష్టత ఇస్తారనిచెప్పారు.

జైలుకెళ్ళిన అభ్యర్థి ముఖ్యమంత్రా?

చిక్‌మగ్‌లూర్ సభలో రాహుల్

న్యూఢిల్లీ : కర్ణాటక ముఖ్యమంత్రిగా జైలుకెళ్ళిన అభ్యర్థినిప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయించారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. బిజెపి సిఎం అభ్యర్థి బిఎస్ యడ్యూరప్ప పేరును ప్రస్తావించకుండా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలోని చిక్‌మంగలూర్‌లో బుధవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మోడీపై విమర్శల వర్షం కురిపించారు.. దేశంలో అవినీతిని అంతం చేస్తానని బూటకపు కబుర్లు చెబుతున్న మోడీ జైలుకెళ్ళి వచ్చిన నేతలతో వేదికను పంచుకున్నారని విమర్శించారు. "మోడి ఇక్కడకు వచ్చి బిజెపి ముఖ్యమంత్రి అభ్యర్థితో సహా అవినీతి అభియోగాలపై జైలుకెళ్ళి వచ్చిన నాయకులతో వేదికపై కూర్చుని అవినీతి గురించి ఉపన్యాసాలిస్తారని' అని



వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అక్రమ మైనింగ్ కేసులో లోకాయుక్త కోర్టులో లొంగిపోయిన యడ్యూరప్ప బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలులో శిక్ష అనుభవించిన సంగతి తెలిసిందే. చిక్‌మగ్‌లూరు నియోజక వర్గానికి తన మదిలో ప్రత్యేక స్థానమున్నదని రాహుల్ అన్నారు. 1978లో జరిగిన ఉప ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఈ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారని, అవసరమైన సమయంలో ఆమెకు మద్దతిచ్చిన ఓటర్లు ఈ నియోజకవర్గం వారేనన్నారు. ఈ విషయాన్ని తాను ఎన్నటికి మరిచిపోనన్నారు.

తాను ఓటర్లకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. త్వరలో జరుగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాహుల్ గాంధీ కర్ణాటకలో పర్యటించడం ఇది మూడో సారి.

భీమా-కోరేగావ్ ఘర్షణల ప్రధాన నిందితుడికి కస్టడీ

న్యూఢిల్లీ : భీమా-కోరేగావ్ ఘర్షణల కేసులో ప్రధాన నిందితుడు మిలింద్ ఎక్బోతేకు సెషన్స్ కోర్టు బుధవారం 14 రోజుల జ్యూడిషల్ కస్టడీ విధించింది. మిలింద్ ఎక్బోతేను ఈ నెల 14న మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఎక్బోతే ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ కేసులో ఘర్షణలను ప్రోత్సహించడం, హత్యాయత్నం వంటి ఆరోపణలను అతను ఎదుర్కొంటున్నాడు. జనవరి 1న పూణేలో జరిగిన ఈ ఘర్షణల్లో ఒకరు మృతి చెందగా, 10 మంది పోలీసులతో సహా అనేక మంది గాయపడ్డారు. భీమా-కోరేగావ్ యుద్ధం జరిగి 200 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ర్యాలీ చేస్తున్న దళితులపై కాషాయ జెండాలు ధరించిన గూండాలు కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు.

ఆసుపత్రికి వెళ్లంటే జయలలిత వినలేదు

విచారణ కమిటీకి శశికళ



చెన్నై : ఆసుపత్రికి వెళ్లమనే తన సలహాను తమిళ నాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత వినిపించుకోలేదని వికె శశికళ తెలిపారు. జయలలిత మృతిపై విచారణ చేస్తున్న జస్టిస్ అరుముగస్వామి కమిషన్‌కు అందచేసిన 55 పేజీల అఫిడవిట్‌లో ఈ విషయాన్ని శశికళ ఈ విషయాన్ని తెలిపారు. తీవ్ర జ్వరంతో ఉన్న జయలలిత రాత్రి సమయంలో స్పృహ కోల్పోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆమెను హాస్పిటల్‌కు తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ నెల 12న ఈ అఫిడవిట్‌ను కమిషన్‌కు శశికళ అంద చేశారు. డాక్టర్ కె.ఎస్. శివకుమార్, ఇద్దరు భద్రతా సిబ్బంది, డ్రైవర్ సహాయంతో జయలలితను ఆసుపత్రికి తీసుకుని వెళ్లినట్లు శశికళ తెలిపారు. సెప్టెంబరు 22, 2016 ఉదయమే డాక్టర్ శివకుమార్ జయలలితను రెండు సార్లు పరీక్షించారు. ఆసుప్రతికి రావాలని చెప్పినా అందుకు అమ్మ ఒప్పుకోలేదు. జ్వరం ఎక్కువవడంతో రాత్రి స్ప హ కోల్పోయారని శశికళ చెప్పారు. అక్రమాస్తుల కేసు వ్యవహారం వల్ల జయలలిత తీవ్ర ఒత్తిడికి గురయ్యారని.. దీంతో ఆమె ఆరోగ్యం క్షీణించిందని శశికళ తెలిపారు. 2016 సెప్టెంబరు మొదటి వారంలో ఆమెకు షుగర్ లెవల్స్ బాగా పెరిగిపోవడంతో వైద్యులు చికిత్స చేశారని చెప్పారు. ఆ తర్వాత కోలుకున్నా సెప్టెంబరు 19న మళ్లీ జ్వరం వచ్చిందన్నారు. ఆసుపత్రిలో ఉన్న సమయంలో జయలలితను చూసేందుకు ఎవరినీ అనుమతించలేదని వార్తలను శశికళ ఖండించారు. అక్టోబరు 22, 2016న అప్పటి రాష్ట్ర గవర్నర్ విద్యాసాగర్ రావు జయలలితను చూశారు. 'అప్పుడు మంచంపై ఉన్న ఆమె గవర్నర్‌ను చూసి చేయి పైకెత్తారు. ఈ విషయాన్ని గవర్నరే నాతో చెప్పారు' అని అన్నారు. సెప్టెంబరు 22-27 మధ్య అన్నాడీఎంకే నేతలు పన్నీర్‌సెల్వం, తంబిదురై, విజయ భాస్కర్ ఆమెను చూసినట్లు చెప్పారు. జయలలిత ఆసుపత్రిలో ఉన్నప్పుడు నాలుగు వీడియోలు రికార్డ్ చేశారు. అవన్నీ ఆమె అనుమతితోనే తీశామని శశికళ చెప్పారు. వాటిని కమిషన్‌కు సమర్పించామన్నారు. జయలలిత తీవ్ర అనారోగ్యంతో డిసెంబర్ 5, 2016న అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. జయలలిత మృతి అనేక అనుమానాలు వ్యక్తం కావడంతో తమిళనాడు ప్రభుత్వం విచారణకు జస్టిస్ అరుముగస్వామి కమిషన్‌ను నియమించింది.

ప్రత్యేకం

భారత్‌లో సిఎ క్లయింట్‌లు ఎవరెవరు?

న్యూఢిల్లీ : ఫేస్‌బుక్ సమాచార చౌర్యంతో వివాదంలో చిక్కుకున్న రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ కేంబ్రిడ్జ్ ఎనలిటికా (సిఎ) సహాయాన్ని భారత్‌లో ఏఏ రాజకీయ పార్టీలు స్వీకరించాయి? సమాచార చౌర్యం కేసు వెలుగులోకి వచ్చిన తరువాత ప్రతిఒక్కరి నోటా వెలువడుతున్న మిలియన్ డాలర్ ప్రశ్న ఇదే..! సిఎ సంస్థ ఎవరెవరికి, ఎటువంటి సేవలు అందించిందన్న అంశంపై ఎన్నికల కమిషన్ సమగ్ర దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి మనిష్ తివారీ ట్విట్టర్‌లో విజ్ఞప్తి చేశారు. కాగా ఈ సంస్థతో కాంగ్రెస్ పార్టీకే సంబంధాలున్నాయని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. ఇందులో ఏది నిజమన్నది ఇప్పుడు పలువురిని వేధిస్తున్న ప్రశ్న సిఎ, దాని మాతృసంస్థతో పాటు ఇతర అనుబంధ సంస్థలు కూడా ఈ సాలెగూటిలో చిక్కుకుని వుండటమే ఇందుకు కారణం. బ్రిటన్‌కు చెందిన సిఎ సంస్థ దాదాపు 5 కోట్ల మందికి పైగా ఫేస్ బుక్ వినియోగదారుల సమాచారాన్ని వారి అనుమతి లేకుండానే వివిద దేశాలలో ఆయా పార్టీల రాజకీయ ప్రయోజనాలకోసం వినియోగించినట్లు ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. 2010నాటి బీహార్ అసెంబ్లీ ఎన్నికలో తాము భారత్‌లోని ఒక రాజకీయ పార్టీ లేదా పార్టీలతో కలిసి పనిచేసినట్లు సిఎ సంస్థ తన సొంత వెబ్‌సైట్‌లో స్వయంగా అంగీకరించింది. సిఎ



మాతృసంస్థ స్ట్రాటజిక్ కమ్యూనికేషన్స్ లేబరేటరీస్ (ఎస్‌సిఎల్)కు సంబంధించి భారత్‌తో ఆన్‌లైన్ సంబంధాలను పరిశీలించినపుడు భారత్‌లో ఆ సంస్థ వెబ్ ఉనికి ఎక్కడా కన్పించలేదు. అయితే 'ఒవ్‌లెనో బిజినెస్ ఇంటెలిజెన్స్' (ఒబిఐ) అనే సంస్థ తన వెబ్‌సైట్‌లో తాము ఎస్‌సిఎల్ ఇండియా సంస్థతో కలిసి జాయింట్ వెంచర్‌లో భాగంగా వున్నామని ప్రకటించింది. లండన్‌కుచెందిన ఎస్‌సిఎల్ గ్రూప్‌తో తాము ఈ జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ తన వెబ్‌సైట్‌లో వివరించింది. భారత్‌లో తాము 'రాజకీయ ప్రచార నిర్వహణ'పై పనిచేసినట్లు ఎస్‌సిఎల్ ఒబిఐ తన వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ఈ సంస్థ తన క్లయింట్ల జాబితాలో బిజెపి, కాంగ్రెస్, జెడి(యు) వంటి రాజకీయ పార్టీలతోపాటు ఐసిఐసిఐ బ్యాంక్, ఎయిర్‌టెల్ వంటి సంస్థల పేర్లను కూడా వెల్లడించింది. తాము భారత్‌లో పని చేసినట్లు ఒబిఐ సిఎ వెబ్‌సైట్ ప్రకటించినప్పటికీ ఏ పార్టీకి తాము సేవలందించిందీ వివరాలను మాత్రం వెల్లడించలేదు. అయితే ఒక క్లూ మాత్రం తన వ్యాఖ్యల్లో వదిలింది. 15 ఏళ్లుగా సాగుతున్న ఏక పార్టీ పాలనలో రాష్ట్రంలో పరిస్థితులు ఏ మాత్రం మారకపోవటంతో ప్రభుత్వ వ్యతిరేకత నాటి ఎన్నికల్లో వ్యక్తమయింద'ని ఆ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. అవిభక్త జనతాదళ్ లేదా రాష్ట్రీయ జనతాదళ్ బీహార్‌ను 1990 నుండి 2005 వరకూ పాలించిన విషయం తెలిసిందే. ఈ కాలంలో తొలుత లాలూ ప్రసాద్, తరువాత ఆయన భార్య రబ్రీదేవి ముఖ్యమంత్రులుగా వ్యవహరించారు. 2005 నాటి ఎన్నికల్లో లాలూ పార్టీని ఓడించిన జెడి(యు) అక్కడి అధికార పగ్గాలను చేపట్టి 2010 వరకు పరిపాలన కొనసాగించింది. 2010లో సిఎ సంస్థను ఒక రాజకీయ పార్టీ తన ప్రచార పర్వం కోసం నియమించుకుంది. 2010 తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సైతం జెడి(యు) మరో సారి విజయం సాధించిన విషయం తెలి సిందే. రాజకీయ ప్రచార నిర్వహణలో భాగస్వామ్యం వహించినట్లు వెల్లడించిన ఒబిఐ సంస్థ తన వెబ్‌సైట్ పేజిపై ప్రధాని నరేంద్రమోడీ, ఆమాద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ చిత్రాలను ప్రచురించింది. అయితే ఈ సంస్థ తన క్లయింట్ల జాబితాలో ఆప్ పేరును ప్రస్తావించకపోవటం గమనార్హం.

సంక్షిప్తం

ఒడిషా గవర్నర్‌గా సత్య పాల్ మాలిక్

భువనేశ్వర్ : బీహార్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ బుధవారం ఒడిషా గవర్నర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఒడిషా గవర్నర్‌గా ఉన్న ఎస్‌సి జమిర్ పదవీకాలం ముగియడంతో సత్య పాల్ ఈ పదవి చేపట్టారు. రాజ్‌భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సత్యపాల్ చేత ఒడిషా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వినీత్ శరణ్ ప్రమాణస్వీకారం చేయించారు.

చంద్రునిపై నివాసాల కోసం ఇస్రో పరిశోధనలు

న్యూఢిల్లీ : చంద్రునిపై నివాసాల గురించి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రయోగాలు చేస్తోం దని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం లోక్‌సభలో తెలిపారు. ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ 'ఇతర సంస్థలతో కలిసి చంద్రునిపై ఇగ్లూ తరహా నివాసాల గురించి ఇస్రో ప్రయోగాలు నిర్వహిస్తోందని' ఆయన వెల్లడించారు.

సిక్కు యువతకు పాక్‌లో తీవ్రవాద శిక్షణ

న్యూఢిల్లీ : పలువురు సిక్కు యువత పాకిస్తాన్‌లోని ఐఎస్‌ఐ స్థావరాలలో తీవ్ర వాద శిక్షణ పొదుతున్నారని కేంద్ర హోం మంత్రిత్వశాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘానికి తెలియచేసింది. భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాల కోసం కెనడా, తదితర ప్రాంతాలలో స్థిరపడిన సిక్కు యువతను తప్పుడు ప్రచారంతో ఆకర్షిస్తూ తీవ్రవాద శిక్షణకు పంపుతున్నారని హోంశాఖ కార్యదర్శి నేతృత్వంలోని అధికారుల బృందం బిజెపి సీనియర్ నేత డా.మురళీమనోహర్ జోషి నేతృత్వంలోని అంచనాల కమిటీకి తెలియచేసింది.

సిబిఐకి పెరిగిన కేసుల భారం : కేంద్రం

న్యూఢిల్లీ : సిబిఐకి కేసుల భారం పెరిగిపోయిందని సిబ్బంది, ప్రజా ఇబ్బందులు, పెన్షన్స్ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బుధవారం లోక్‌సభలో అన్నారు. రాజ్యాంగ కోర్టులు అప్పగిస్తున్న కేసుల సంఖ్య పెరిగిపోతుండటంతో సిబిఐపై భారం అధికమైందని ఆయన చెప్పారు. గడిచిన మూడేళ్ళలో వివిధ రాష్ట్రాలు 121 కేసులను సిబిఐ పరిశీలనకు పంపాయని, వాటిల్లో 85 కేసుల దర్యాప్తు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

ఆస్టిన్ పేలుళ్ళ అనుమానితుడు ఆత్మహత్య

ఆస్టిన్ : టెక్సాస్ రాజధాని ఆస్టిన్‌లో మంగళవారం వరుస బాంబు పేలుళ్ళతో సంబంధమున్నట్లుగా భావిస్తున్న బాంబర్ బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తి ఒకడేనా, లేక ఇంకెవరైనా వున్నారా అనేది వెంటనే తెలియరాలేదు. ఆస్టిన్ పేలుళ్ళకు అతనే బాధ్యుడని భావిస్తున్నట్లు ఆస్టిన్ పోలీసు చీఫ్ బ్రియాన్ మేన్లీ తెలిపారు. ఈ నెల 2 నుండి వరుసగా సంభవిస్తున్న బాంబు పేలుళ్ళ వెనుక, మారుతున్న ఎత్తుగడల వెనుక ఒకే బాంబర్ వున్నాడని పోలీసులు అనుమానిస్తూనే వున్నారు.



వర్సిటీ సమీపాన ఉగ్రపంజా

ఆఫ్గనిస్తాన్‌లో కాబూల్ విశ్వవిద్యాలయానికి సమీపాన ఐసిస్ ఉగ్రవాద పేలుళ్లలో గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలిస్తున్న సహాయక సిబ్బంది

కాబూల్‌లో ఆత్మాహుతి పేలుడు

29 మంది మృతి - 52 మందికి గాయాలు

కాబూల్ : ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్‌లో కాబూల్ విశ్వవిద్యాలయానికి సమీపంలో షియా ముస్లింల ఆరాధనా స్థలానికి సమీపంలో ఆత్మాహుతి బాం బర్ తనను తాను పేల్చుకోవడంతో 29 మంది మరణించారు. 52 మంది గాయపడ్డారని అధి కారులు తెలిపారు. పర్షియన్ కొత్త సంవత్సరం ప్రారంభం వేడుకలను ఆఫ్ఘన్ ప్రజలు ఆనందో త్సాహాలతో జరుపుకుంటుండగా ఈ పేలుడు సంభవించింది. జనవరిలో దాదాపు వంద మంది కి పైగా మరణించిన దాడి ఘటన అనంతరం ప్రభుత్వం స్పందిస్తూ భద్రతను మరింత కట్టు దిట్టం చేస్తామని హామీ ఇచ్చింది. అయినా కాబూ ల్ నగరానికి తీవ్రవాదుల ముప్పు తొలగి పోలేదని తాజా పేలుడు రుజువు చేస్తోంది. కాబూల్‌లో షియాలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడుల్లో ఇది తాజాది కావడం విశేషం.

ట్రినిడాడ్ తొలి మహిళా అధ్యక్షురాలిగా పాలా మే వీకెస్



రోసెయు (ట్రినిడాడ్ టుబాగో) : పౌలా మే వీకెస్ ట్రినిడాడ్ టుబాగో తొలి మహిళా అధ్యక్షు రాలిగా మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. క్వీన్స్ పార్క్ సవన్నాలో జరిగిన ఈ పదవీ స్వీకార కార్యక్రమానికి ప్రభుత్వ విభాగాల ప్రతినిధులు, మంత్రులు, పార్లమెంట్ సభ్యులు హాజరయ్యారని ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. వీరితో పాటు పలు విద్యాలయాలకు చెందిన విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని వివరించింది. 2013 నుండి అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆంథోనీ కార్మోనా స్థానంలో పౌలా మే అధ్యక్ష బాధ్యతలను స్వీకరించారు.

కిడ్నాపైన నైజీరియా బాలికల్లో కొంత మంది స్వస్థలానికి

అబుజ : ఈశాన్య నైజీరియా పట్టణమైన దాప్చి నుండి గత నెల్లో కిడ్నాప్ చేసిన 110 మంది స్కూలు బాలికల్లో కొంతమంది బుధవారం వెనక్కి తిరిగి వచ్చారని ఇద్దరు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బొకో హారం గ్రూపునకు చెందిన ఉగ్రవాదులు భావిస్తున్న ఇద్దరు వ్యక్తులు ఆ బాలికలను తీసుకుని వచ్చారని ఆ పట్టణ ప్రజలు తెలిపారు. అయితే ఎంతమంది వెనక్కి తిరిగి వచ్చారో కచ్చితంగా తెలియరాలేదు. దాప్చి సమీపంలోని చెకపాయింట్ వద్ద గల మిలటరీ అధికారి మాట్లాడుతూ, బొకో హారం ఉగ్రవాదులే ఆ బాలికలను వెనక్కి తీసుకువచ్చారని చెప్పారు. 11-19ఏళ్ళ వయస్సు కలిగిన వందమందికి పైగా బాలికలను ఫిబ్రవరి 19న ఉత్రవాదులు కిడ్నాప్ చేయగా, తిరిగి వచ్చిన వారిలో ఆ బాలికలున్నారని సమాచారం.

మయన్మార్ అధ్యక్షుని ఆకస్మిక రాజీనామా

కారణాలు వెల్లడించని అధ్యక్ష భవనం

రాజకీయంగా ఏకాకైన సూకీ



యాంగాన్ : మయన్మార్ అధ్యక్షుడు హితిన్ కియా బుధవారం అకస్మాత్తుగా తన పదవికి రాజీనామా చేశారు. రాఖినె సంక్షోభంపై ఆంగ్ సాన్ సూకీ అంతర్జాతీయంగా తీవ్రంగా విమర్శలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆమెకు విశ్వాసపాత్రుడు, రాజకీయంగా మిత్రుడు అయిన అధ్యక్షుడు వైదొలగడంతో సూకీ రాజకీయంగా ఏకాకైనట్లు పరిశీలకులు పేర్కొంటున్నారు. అధ్యక్షుడు హితిన్, సూకీకి బాల్య మిత్రుడు.. మయన్మార్ సైన్యం రూపొందించిన రాజ్యాంగం ప్రకారం ఆమె అధ్యక్ష పదవి స్వీకరించే అవకాశం లేకపోవడంతో ఆమె బదులుగా హితిన్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. అయితే ఆయన పాత్ర కేవలం లాంఛనప్రాయం. స్టేట్ కౌన్సిలర్ పేరుతో సూకీ రాజకీయ దిశా నిర్దేశం చేస్తారు. దేశానికి అధినేతగా వున్న హితిన్ సూకీకి పార్టీలో అత్యంత సన్నిహితుడు. హితిన్ (72) ఆరోగ్యంపై గత కొన్ని మాసాలుగా ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఇటీవల బాగా బరువు తగ్గిపోయిన హితిన్‌కి గతంలో హృదయ సంబంధమైన సమస్యలు కూడా వున్నాయి. అయితే ఆయన రాజీనామాకు గల కారణాలను అధ్యక్ష భవనం వెల్లడించలేదు. ప్రస్తుత బాధ్యతల నుండి ఆయన విశ్రాంతి తీసుకోవాలని భావిస్తున్నారని మాత్రమే పేర్కొంది. వారం రోజుల్లో కొత్త నేతను ఎన్నుకోనున్నారు. కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేవరకు ఉపాధ్యక్షుడు, మాజీ జనరల్ మియింట్ సూ ఆ బాధ్యతలను స్వీకరిస్తారు. రోహింగ్యా ముస్లింలకు బాసటగా నిలబడలేదంటూ అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తినా, సూకీ పేరు ప్రతిష్టలు దెబ్బతింటున్న కష్ట సమయంలోకూడా ఆమె వెంటే నిలబడ్డారు.

సిరియాలో అమెరికా సైనిక స్థావరం

డెమాస్కస్ : అమెరికా నేతృత్వంలోని అంతర్జాతీయ సంకీర్ణ సేనలు సిరియాలోని ఉత్తర ప్రాంతంలో వున్న డీర్ ఎజోర్ ప్రావిన్స్‌లోని అల్ ఒమర్ చమురు క్షేత్రానికి సమీపంలో భారీ సైనికస్థావరాన్ని ఏర్పాటు చేసుకుంటున్నాయని ఎలక్ట్రానిక్ మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. 'సౌత్ ఫ్రంట్' అనే ఈ డిజిటల్ సైట్ వెల్లడించిన కథనం ప్రకారం అల్ ఒమర్ చమురు క్షేత్రంపై కన్నేసిన అమెరికా తాజా సైనిక చర్యకు తెరతీస్తుందని సిరియా ప్రభుత్వ దళాల ప్రతినిధులను హెచ్చరించింది. ఈ సైనిక స్థావర నిర్మాణానికి సంబంధించిన ఆధారాలను సోషల్ మీడియా నెట్‌వర్క్‌లు ప్రసారం చేస్తున్నాయి. ఈ వీడియోలలో ప్రధానమైన పెట్రోలియం జోన్ ప్రాంతానికి అమెరికన్ హెలీకాప్టర్లు సైనిక సామగ్రిని చేరవేస్తూ కన్పిస్తున్నాయి. డెమాస్కస్‌కు 460 కి.మీ దూరంలో వున్న డీర్‌ఎజోర్ ప్రావిన్స్‌లోని అల్ మయాదీన్ నగరానికి 10 కి.మీ దూరంలో వున్న అల్ ఒమర్ చమురు క్షేత్రం సిరియాలో అతిపెద్ద చమురు ఉత్పత్తి క్షేత్రం. దేశంలో చమురు ఉత్పత్తిలో నాలుగోవంతు ఇక్కడే ఉత్పత్తి అయ్యేది. అంతర్యుద్ధం ప్రారంభమైన తరువాత ఇక్కడ చమురు ఉత్పత్తికి తీవ్ర విఘాతం కలిగింది. సిరియా భూభాగంలో దాదాపు డజనుకు పైగా సైనిక స్థావరాలున్నప్పటికీ ఉగ్రవాద సంస్థ ఐఎస్‌తో పోరు నేపథ్యంలో మరిన్ని స్థావరాలు అవసరమని వాదిస్తోంది.

డెమాస్కస్‌లో మోర్టార్ దాడి, 35 మంది మృతి

డెమాస్కస్ నగరంలోని ఒక రద్దీ మార్కెట్‌పై మంగళవారం జరిగిన రాకెట్ దాడిలో మరణించిన వారి సంఖ్య బుధవారం నాటికి 35కు చేరినట్లు అధికారులు చెప్పారు. డెమాస్కస్ తూర్పు ప్రాంతంలోని కష్కోల్ మార్కెట్‌ప్రాంతంలోకి శక్తివంతమైన ఈ రాకెట్ దూసుకు వచ్చింది. ఈ దాడిలో పలువురు గాయపడ్డారని అధికారులు వివరించారు.

సిఇఓను సస్పెండ్ చేసిన కేంబ్రిడ్జ్ అనలిటికా



వాషింగ్టన్ : సోషల్ మీడియా వేదిక ఫేస్‌బుక్ వినియోగదారుల సమాచార చౌర్యం జరిగిందన్న వార్తలు వెల్లువెత్తిన నేపథ్యంలో రాజకీయ సమాచార సేకరణ సంస్థ కేంబ్రిడ్జ్ అనలిటికా(సిఎ) యాజమాన్యం తన చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి అలెగ్జాండ్ నిక్స్‌ను సస్పెండ్ చేసింది. 2016 నాటి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ ప్రచార బాధ్యతలను ఈ సంస్థ నిర్వహించిన విషయం తెలిసిందే. విదేశాలలో ఎన్నికలను ప్రభావితం చేసే విధంగా తాము అనుచిత పద్ధతులను అనుసరించినట్లు నిక్స్ బ్రిటన్ ఛానల్4 ప్రసారం చేసిన వీడియో కథనంలో అధికారికంగా వెల్లడించటంతో సిఎ యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకున్నదని న్యూయార్క్ టైమ్స్ పత్రిక తన కథనంలో వివరించింది. సిఇఓను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన సిఎ యాజమాన్యం ఇటీవల ఛానల్4 రహస్యంగా రికార్డ్ చేసిన నిక్స్ వ్యాఖ్యలు, ఇతర ఆరోపణలు తమ కంపెనీ మౌలిక విలువలను లేదా కార్యకలాపాలను ప్రతిబింబించబోవని స్పష్టం చేసింది. తాము మౌలిక విలువలకు, క్రమశిక్షణకు ఇస్తున్న ప్రాధాన్యతను, ఈ సస్పెన్షన్ రుజువు చేస్తుందని తన ప్రకటనలో పేర్కొంది. ఇదిలా వుండగా తమ వినియోగదారులకు చెందిన సమాచారాన్ని సిఎ సంస్థ దుర్వినియోగం చేసినట్లు వచ్చిన వార్తలపై తాము తీవ్రంగా కలత చెందామని ఫేస్‌బుక్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. న్యూయార్క్‌టైమ్స్ పత్రికతో పాటు ది అబ్జర్వర్ ఆఫ్ లండన్ పత్రికలు సంయుక్తంగా నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో ఫేస్‌బుక్ డేటా దుర్వినియోగం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే.

ప్రతీకారం తీర్చుకుంటాం

బ్రిటన్‌కు రష్యా హెచ్చరిక

టోక్యో : రష్యా వ్యతిరేక చర్యలు తీసుకుంటున్నందుకు బ్రిటన్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ బుధవారం హెచ్చరించారు. రష్యా మాజీ గూఢచారికి విషప్రయోగంపై ఇరు దేశాలు ఘర్షణ పడుతున్న నేపథ్యంలో రష్యా ప్రతిస్పందన వెలువడింది. టోక్యోలో జపాన్ విదేశాంగ మంత్రితో సమావేశానంతరం లావ్‌రోవ్ మాట్లాడుతూ, ఇలా రష్యా వ్యతిరేక చర్యలు తీసుకోవడాన్ని బ్రిటీష్ ప్రభుత్వం కొనసాగించినట్లైతే తాము కూడా అందుకు అనుగుణంగానే వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 4వ తేదీన జరిగిన దాడి ఘటనపై శాంతియుతంగా స్పందించాలంటూ ఆయన బ్రిటీష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ దాడి చేయగల సామర్థ్యం, లక్ష్యం రష్యాకే వుందని బ్రిటన్ పేర్కొంటోంది. ఈ కేసులో బ్రిటన్ పూర్తి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని రష్యా పేర్కొంటోంది. 23 మంది రష్యా దౌత్యవేత్తలను, వారి కుటుంబాలను బహిష్కరించడమే కాకుండా ఉన్నతస్థాయి సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలని కూడా బ్రిటన్ భావిస్తోంది. ఇతర చర్యలను కూడా పరిశీలిస్తున్నామని ప్రధాని మే ప్రతినిధి చెప్పారు.

మొదటిపేజీ తరువాయి

పట్టిసీమపై విచారణకు పట్టు

పట్టిసీమలో రూ.371 కోట్లు దుర్వినియోగం అయ్యాయని ఆయన పేర్కొన్నారు. రూ.14 కోట్లు రికవరీ చేశామని ప్రభుత్వం చెబుతోందని, ఆ సొమ్ము ఎవరి నుంచి రికవరీ చేశారు, ఎందుకు చేశారో చెప్పాలని కోరారు.

జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు జోక్యం చేసుకుంటూ పట్టిసీమలో ఎలాంటి అక్రమాలూ జరగలేదని స్పష్టం చేశారు. తప్పే లేనప్పుడు విచారణ ఎందుకో అర్థం కావడం లేదన్నారు. సభను తప్పుదోవ పట్టించేందుకు విష్ణుకుమార్‌రాజు ప్రయత్నిస్తున్నారన్నారు. నాలుగేళ్లుగా కనపడని అవినీతి, తాము ఎన్డీయే నుంచి బయటకు రాగానే కనపడిందా అని ప్రశ్నించారు. కాగ్ కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసిందని, వాటికి అధికారులు వివరణ కూడా ఇచ్చారని తెలిపారు. ప్రతిపక్ష పాత్ర పోషిస్తే తప్పులేదు, కానీ, అర్థం లేని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మూడేళ్లుగా పట్టిసీమ ఫలాలు రైతులకు అందుతున్నాయని, ఇప్పుడు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తే రైతులు క్షమించరన్నారు. గతంలో వైసిపి చేసిన ఆరోపణలనే ఇప్పుడు బిజెపి నేతలూ చేస్తున్నారని మండిపడ్డారు. విష్ణుకుమార్‌రాజు జవాబిస్తూ తామెప్పుడూ పట్టిసీమ పథకాన్ని తప్పుపట్టలేదని, ఈ నిర్మాణంలో జరిగిన అక్రమాలపైనే మాట్లాడుతున్నామని అన్నారు. తప్పు చేయనప్పుడు విచారణ చేయించి నిజాయితీని నిరూపించుకోవచ్చని సూచించారు. మంత్రి కాల్వ శ్రీనివాసులు జోక్యం చేసుకుంటూ జగన్, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిల మాయలో విష్ణుకుమార్‌రాజు పడిపోయారని, వారిచ్చిన స్క్రిప్టును సభలో చదువుతున్నారని ఎద్దేవా చేశారు. అన్ని విషయాలు ప్రజలు గమనిస్తున్నారని, జాతిద్రోహులుగా మిగిలిపోవడం ఖాయమని వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి మాణిక్యాలరావు మాట్లాడుతూ అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చినప్పుడు ప్రభుత్వం వివరణ ఇవ్వాలి, అంతేగాని జాతి ద్రోహులంటారా? అని ప్రశ్నించారు. మంత్రి అచ్చెన్నాయుడు లేచి గతంలో పట్టిసీమకు అనుకూలంగా బిజెపి నేతలు సభలో చేసిన వ్యాఖ్యలను, వివిధ సందర్భాల్లో పత్రికల్లో వచ్చిన వార్తలను చదివి వినిపించారు. విష్ణుకుమార్‌రాజు కేంద్రం ఆదేశాల మేరకే పట్టిసీమపై ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ ప్రాజెక్టు పూర్తయిన మూడేళ్ల తర్వాత మట్లాడటం వెనుక ఇతర కారణాలున్నాయని, ఇదంతా పోలవరం ప్రాజెక్టును ఆపేందుకు కేంద్రం ఆడుతున్న నాటకమని విమర్శించారు. బిజెపి అంటే రాష్ట్రంలో 'భారతీయ జగన్, పవన్ కల్యాణ్'గా ఎద్దేవా చేశారు. పట్టిసీమపై ప్రజల్లోకి వెళ్లి చర్చిస్తే తగిన గుణపాఠం చెబుతారన్నారు. మంత్రుల విమర్శలకు విష్ణుకుమార్ రాజు స్పందిస్తూ 'ధైర్యం ఉంటే రాజీనామా చేయండి.. మేమూ చేస్తాం' అని సవాల్ విసిరారు. ప్రభుత్వ విప్ కూన రవికుమార్ మాట్లాడుతూ కాగ్ నివేదిక ప్రకారం మాట్లాడదలచుకుంటే, అదే కాగ్ రెవెన్యూ లోటు రూ.16వేల కోట్లని తేల్చిందని, కేంద్రం ఆ నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాగ్ సాధారంగా అభ్యంతరాలు లేవనెత్తడం, వాటికి అధికారులు వివరణ ఇచ్చాక మరో నివేదికను ఇవ్వడం పరిపాటన్నారు. సరైన ఆధారాలు లేకుండా కేవలం కాగ్ నివేదిక మీద ఆధారపడి మాట్లాడటం బిజెపి సభ్యులకు తగదన్నారు.

14 బ్యాంకులకు కనిష్క్ గోల్డ్ 'కన్నం'

మారిషస్‌కు పారిపోయివుంటారని తెలుస్తోంది. ఈ రుణాల మోసానికి సంబంధించి కనిష్క్ జ్యువెలరీ యజమాని, డైరెక్టర్లు భూపేష్ కుమార్ జైన్, అతని భార్య నీతా జైన్‌పై స్టేట్ బ్యాంకు సిబిఐకి ఫిర్యాదు చేసింది.

గతేడాదే గుర్తింపు..

గత ఏడాది నవంబరులో కనిష్క్ గోల్డ్ సంస్థను రుణ ఎగవేతదారుడుగా బ్యాంకులు ప్రకటించాయి. కాగా 2017 సెప్టెంబరులో కనిష్క్ గోల్డ్ వ్యవస్థాపకుడు భూపేష్ కుమార్ జైన్‌ను రూ.20 కోట్ల ఎక్సైజ్ పన్ను మోసం కేసులో అరెస్టు అయ్యాడు. బెయిల్ మీద విడుదలైన భూపేష్ అప్పటి నుంచి భార్యతో సహా పరారీలో ఉన్నాడు. ఎస్‌బిఐ, పిఎన్‌బి, బ్యాంకు ఆఫ్ ఇండియా. ఐడిబిఐ, యూకో, తమిళనాడ్ మెర్కంటైల్ బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేషన్ బ్యాంక్‌లు కొన్ని కోట్లల్లో కనిష్క్ గోల్డ్‌కు అప్పులిచ్చిన వాటిలో ఉన్నాయి. కనిష్క్ తీసుకున్న అప్పులు వసూలు చేసేందుకు బ్యాంకులు ప్రయత్నిస్తుండగా అసలు ప్రమోటర్ల ఆచూకీ తెలియడం లేదు. గతేడాది ఏప్రిల్ నుంచి కనిష్క్ జ్యూయలరీ రుణాలు తీసుకున్న 14 బ్యాంకులకు డబ్బులు కట్టడం నిలిపివేసింది. ఇదేంటని ప్రశ్నించేందుకు బ్యాంకు అధికారులు ఆయా దుకాణాల వద్దకు వెళ్లగా అవన్నీ మూసేసి కనిపించాయి. చెన్నయ్, హైదరాబాద్, కొచ్చిన్, ముంబయిలో కనిష్క్ జువెలరీ తన షాపులు తెరిచి వ్యాపారాలు చేసింది.

బ్యాంకులు	ఇచ్చిన అప్పులు
ఎస్‌బిఐ	రూ.215 కోట్లు
పిఎన్‌బి	రూ.115 కోట్లు
యూనియన్ బ్యాంకు	రూ.50 కోట్లు
సిండికేట్ బ్యాంకు	రూ.50 కోట్లు
బిఒఐ	రూ.45 కోట్లు

ఆగని 'డ్రామా'

(మొదటిపేజీ తరువాయి)

ఇటు లోక్‌సభను, అటు రాజ్యసభను ఉభయ సభాపతులూ వాయిదా వేశారు. దీంతో ఏపికి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందంటూ కేంద్ర సర్కారుపై వైసిపి, టిడిపి ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలపై బుధవారం కూడా చర్చకు అవకాశం లేకుండా పోయింది. సభలో టిఆర్‌ఎస్, అన్నాడిఎంకెలు చేపట్టిన ఆందోళనతో సభ ఆర్డర్‌లో లేదని స్పీకర్ సుమిత్రా మహాజన్ అవిశ్వాస తీర్మానాలను అనుమతించలేమని ప్రకటించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు. తొలుత లోక్‌సభ ప్రారంభం కాగానే టిఆర్‌ఎస్, అన్నాడిఎంకె ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే స్పీకర్ సుమిత్రా మహాజన్ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. వాయిదా అనంతరం పున్నప్రారంభమైన లోక్‌సభలో పరిస్థితి ఏ మాత్రం మారలేదు. అప్పటికే టిఆర్‌ఎస్, అన్నాడిఎంకె ఎంపిలు పోడియంను చుట్టుముట్టి నినాదాలు చేశారు. వైసిపి ఎంపి వైవి సుబ్బారెడ్డి, టిడిపి ఎంపి తోట నర్సింహులు ఇచ్చిన నోటీసులను చదివిన స్పీకర్ సభ ఆర్డర్‌లో లేని కారణంగా చర్చను చేపట్టలేనని స్పష్టం చేశారు. దీంతో అప్పటికే తమ స్థానాల్లో లేచి నిలబడిన కాంగ్రెస్, తృణముల్, సిపిఎం, ఎన్‌సిపి, ఎస్పీ, ఆర్జేడి, ఆర్‌ఎస్పి, వైసిపి, టిడిపి సభ్యులు స్పీకర్ నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు ఎవరి స్థానాల్లో వారు కూర్చోవాలని కోరినా ఫలితం లేకపోవడంతో సభను గురువారానికి వాయిదా వేశారు. సభ ఆర్డర్‌లో లేని కారణంగా అవిశ్వాస తీర్మానం చర్చ వాయిదా పడుతూ వస్తున్న నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత కుమార్ లోక్‌సభలో ప్రకటన చేశారు. విశ్వాస పరీక్షను ఎదుర్కోవడానికి మోడీ సర్కార్ సిద్ధంగా ఉందని, సభ్యులంతా తమ స్థానాల్లో కూర్చుంటే ఎలాంటి చర్చనైనా చేపట్టొచ్చున్నారు. అవిశ్వాసం తీర్మానంలో తామే గెలుస్తామని, సభ సజావుగా జరిగేలా అందరూ సహకరించాలని స్పీకర్ ద్వారా కోరుతున్నానన్నారు. దీనిపై స్పీకర్ స్పందిస్తున్న సమయంలోనూ అన్నాడిఎంకె, టిఆర్‌ఎస్ సభ్యులు పోడియం వద్ద ఆందోళన చేపట్టడంతో సభను గురువారానికి వాయిదా పడింది. అటు రాజ్యసభ కూడా బుధవారం అలా ప్రారంభమై.. ఇలా నిమిషాల్లో గురువారానికి వాయిదా పడింది. సభ ప్రారంభం కాగానే..కాంగ్రెస్, టిడిపి, వైసిపి ఎంపిలు పోడియం వద్దకు వెళ్లి ఆందోళన నిర్వహించారు. ప్రత్యేక హోదా ఏపి ప్రజల హక్కు అంటూ నినదించారు. దీంతో చైర్మన్ వెంకయ్య నాయుడు సభను రేపటికి వాయిదా వేశారు.

మళ్లీ నోటీసులు

అవిశ్వాస తీర్మానాన్ని కోరుతూ తాము ఇచ్చిన నాలుగో నోటీసులపైనా చర్చ జరగకుండా తిరస్కరణకు గురికావడంతో మరోమారు నోటీసులు ఇవ్వాలని వైసిపి, టిడిపిలు నిర్ణయించాయి. గురువారం అవిశ్వాసంపై చర్చకు అనుమతించాలని, సభ కార్యకలాపాల ఎజెండాలో తమ నోటీసులు పెట్టాలని వైసిపి, టిడిపి సభ్యులు వైవి సుబ్బారెడ్డి, తోట నరసింహం కోరారు. ఈ మేరకు బుధవారం వారిద్దరు వేర్వేరుగా లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాత్సవకు నోటీసులు ఇచ్చారు.

మ్యాచ్ ఫిక్సింగ్ : గల్లా జయదేవ్

బిజెపి ఆడమన్నట్టుగా టిఆర్‌ఎస్, అన్నాడిఎంకె పార్టీ ఆడుతున్నాయని, ఇదో రకమైన 'మ్యాచ్ ఫిక్సింగ్' అని టిడిపి ఎంపి గల్లా జయదేవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రతిరోజూ ఇదే తంతు. ప్రజాస్వామ్యంతో ప్రభుత్వం, స్పీకర్ ఎలా ఆడుకుంటున్నారో ప్రజలు గ్రహిస్తున్నారు' అని గల్లా అన్నారు. అవిశ్వాస తీర్మానంపై చర్చ నుంచి కేంద్రం పారిపోతోందని, స్పీకర్ కూడా వారికే వంతపాడుతున్నారని విమర్శించారు.

నాలుగు రోజులూ ఒకే డ్రామా: వైవి సుబ్బారెడ్డి

అవిశ్వాస తీర్మానికి 100 మందికి పైగా ఎంపిల మద్దతు ఉందనీ, ఐదే ఐదు నిమిషాల్లో స్పీకర్ కౌంటింగ్ చేసి, చర్చను ప్రారంభించొచ్చు కానీ అ పని చేయడం లేదని వైసిపి ఎంపి వైవి సుబ్బారెడ్డి విమర్శించారు. నాలుగు రోజూలే ఇదే డ్రామా నడుస్తోందని చెప్పారు. టిఆర్‌ఎస్, అన్నాడిఎంకె ఆందోళనలను తప్పుపట్టలేమని, సభ ఆర్డర్‌లో లేనప్పుడు కూడా ప్రభుత్వం ఆర్థిక బిల్లులను ఆమోదించుకుందని ఆయన గుర్తు చేశారు. అవిశ్వాసంపై మాత్రం కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ విధానాన్ని అవలంబిస్తోందని విమర్శించారు.

స్పీకర్ చెబుతున్నా పట్టించుకోరే : మేకపాటి

సభ ఆర్డర్‌లో ఉంటేనే చర్చ చేపడతామని, సభ్యులు తమ తమ స్థానాల్లో కూర్చోవాలని స్పీకర్ చెబుతున్నా..టిఆర్‌ఎస్, అన్నా డిఎంకె సభ్యులెవ్వరూ పట్టించుకోవడం లేదని వైసిపి లోక్‌సభ నేత రాజమోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

ఆ నైతికత టిడిపికి ఉందా : విజయ సాయి

సాంకేతికంగానే తప్ప ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టే నైతిక హక్కు టిడిపికి ఉందా? అని వైసిపి రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి ప్రశ్నించారు. గడిచిన నాలుగేళ్లూ కేంద్రం తీసుకున్న నిర్ణయాల్లో టిడిపి మంత్రులు కూడా భాగస్వాములే కదా, ఇప్పటి వరకు తీసుకున్నవన్నీ దుర్మార్గపు నిర్ణయాలేనని చెప్పకనే చెబుతున్నారా అని ఆయన నిలదీశారు.

పార్లమెంట్‌లో కొనసాగిన ఏపి ఎంపిల ఆందోళన

ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని కోరుతూ పార్లమెంట్ లో ఏపి ఎంపిలు తమ ఆందోళన కొనసాగించారు. తొలుత పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఎంపిలు ప్లకార్డులు చేతబట్టి ఆందోళన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అమలు చేయాలని, విభజన హామీలు నెరవేర్చా లని డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన నిధులు రాష్ట్రానికి సరిపోవడం లేదని, పోలవరం ప్రాజెక్టుకు కూడా నిధులు అరకొరగా ఇస్తున్నారని ఎంపి గల్లా జయదేవ్ అన్నారు. రూ.1500కోట్లు ఇచ్చి రాజధాని కట్టాలంటే ఎలా అని ప్రశ్నించారు. కేంద్రం ఆడుతున్న నాటకాలు రాష్ట్ర ప్రజానీకం చూస్తున్నారని, పార్లమెంటులో అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారని ఎంపి జెసి దివాకర్‌రెడ్డి అన్నారు. కేంద్రం వ్యవహరిస్తున్న తీరు చూస్తే అవిశ్వాసానికి భయపడుతున్న ట్లుగా ఉందని టిడిపి లోక్‌సభా పక్ష నేత తోట నరసింహం అన్నారు.మరోవైపు వైసిపి ఎంపిలు పార్లమెంటు ప్రధాన ద్వారం వద్ద ధర్నా ఆందోళన చేపట్టారు. ఏపికి బిజెపి, టిడిపి తీరని అన్యాయం చేశాయని వైసిపి ఎంపి మేకపాటి రాజమో హన్‌రెడ్డి విమర్శించారు. హోదా విషయంలో ఏపికి చంద్ర బాబు ద్రోహం చేశారనిఎంపి వైవి సుబ్బారెడ్డి అన్నారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని అన్ని పార్టీలను కోరా మని ఆయన తెలిపారు. ప్రత్యేక హోదాపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదని వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి ఆరోపించారు. చంద్రబాబు తరహాలో లాలూచీ రాజకీయాలు చేయడం తమకు రాదని ఎంపి అవి నాష్ రెడ్డి అన్నారు. కమీషన్ల కోసమే చంద్రబాబు ప్రత్యేక హోదా కాదని ప్యాకేజీకి మొగ్గుచూపారని ఎంపి వరప్రసాద్ మండిపడ్డారు.

కొంప ముంచిన కృష్ణపట్నం

(మొదటిపేజీ తరువాయి)

ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసి పంపించాలని కూడా నిర్దేశించింది. ఇందులో భాగంగా ముందుగా నక్కపల్లి, రామాయపట్నం, దుగ్గిరాజపట్నంలను గుర్తించారు. అయితే ప్రస్తుతం ఈ మూడు ప్రాంతాలనూ అనేక సమస్యలు వేధిస్తున్నాయి. ఇందులో రామాయపట్నానికి రాష్ట్ర ప్రభుత్వ స్వీయ తప్పిదమే కీలక సమస్యగా మారుతోంది. మిగిలిన రెండు ప్రాంతాలకు భద్రతాంశాలు అడ్డంకులుగా మారుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో రాష్ట్రంలో కొత్త ఓడరేవు ప్రశ్నార్థకంగా మారుతోంది.

రామాయపట్నంలో ప్రధాన ఓడరేవును ఏర్పాటు చేయాలని 2012లోనే అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రతిపాదించగా, 2014లో విభజన హామీల్లో భాగంగా దుగ్గిరాజపట్నాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రతిపాదించి కేంద్రానికి నివేదిక పంపించారు. అయితే దుగ్గిరాజపట్నం ఏర్పాటుకు కేంద్రం నుంచి అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. అత్యంత కీలకమైన ఇస్రో ఇక్కడికి అతి దగ్గరలో ఉంది. అలాగే కేంద్ర కాలుష్య నియంత్ర మండలి పర్యవేక్షణలో ఉన్న పులికాట్ సరస్సు కూడా ఇదే ప్రాంతంలో ఉంది. దీంతో రక్షణ, అటవీ శాఖల నుంచి దుగ్గిరాజపట్నానికి వ్యతిరేకత వస్తోంది. అందుకే ఈ ప్రాంతంలో ఓడరేవు ప్రతిపాదన దాదాపు అటకెక్కినట్టేనని అధికారులు విశ్లేషిస్తున్నారు.ఇక రామాయపట్నం అత్యంత అనుకూలంగా ఉన్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తీసుకున్న నిర్ణయమే దానికి అడ్డంకిగా మారింది. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఒక ఓడరేవు నిర్మిస్తే దానికి రెండు వైపులా 30 కిలోమీటర్ల విస్తీర్ణంలో మరో ఓడరేవు నిర్మించకూడదు. కేవలం ఆ ఓడరేవు మార్కెటింగ్ హక్కులకు భంగం రాకుండా చూసేందుకే ఈ నిర్ణయం అమలు చేస్తున్నారు. అయితే మొదటి నుంచి ప్రభుత్వం అత్యంత ప్రేమ చూపిస్తున్న కృష్ణపట్నం ఓడరేవుకు చంద్రబాబు ప్రభుత్వం అదనపు ప్రయోజనాలు కల్పించింది. 30 కిలోమీటర్ల పరిధికి హక్కు కల్పించాల్సి ఉండగా, 2016లో కృష్ణపట్నానికి అదనంగా 123 కిలోమీటర్ల పరిధిపై హక్కులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల కృష్ణపట్నానికి 163 కిలోమీటర్ల విస్తీర్ణంలో మరో ఓడరేవు నిర్మించడం సాధ్యం కాదు. ఇదే ఇప్పుడు కీలక సమస్యగా మారిపోయింది. ప్రకాశం జిల్లాలో ఉన్న రామాయపట్నం వాడరేవు నుంచి 90 కిలోమీటర్ల దూరంలోను, కృష్ణపట్నంనుంచి 93 కిలోమీటర్ల దూరంలోను ఉంది. అయితే కృష్ణపట్నం హక్కు విస్తీర్ణం పరిధిని పెంచేయడంతో రామాయపట్నంలో ఓడరేవు నిర్మాణానికి అవకాశం లేకుండా పోతోంది. ఈ సమస్యను అధిగమించాలంటే ముందుగా కృష్ణపట్నం ఓడరేవుకు అదనంగా కల్పించిన 123 కిలోమీటర్ల హక్కు విస్తీర్ణాన్ని రద్దు చేస్తూ కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుందని అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ చర్యకు ఉపక్రమిస్తే కృష్ణపట్నం యాజమాన్యం న్యాయస్థానానికి వెళ్లే పరిస్థితి కూడా ఉంటుందని వారంటున్నారు. నక్కపల్లిలో మరో ఓడరేవు పరిస్థితి కూడా అలాగే ఉంది. గంగవరం నుంచి 55 కిలోమీటర్లు, కాకినాడ నుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో కొత్త ఓడరేవుకు అనుకూలంగానే ఉన్నప్పటికీ, తూర్పు నావికాదళం నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. 97 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి కొత్త ఓడరేవులూ నిర్మించరాదని, ఓడల సంచారం వల్ల తూర్పు నావికాదళం ఉనికికే ముప్పు ఉంటుందని నావికాదళం అధికారులంటున్నారు. తాజా పరిస్థితుల్లో నక్కపల్లి కూడా లేనట్టేనని రాష్ట్ర అధికారులు తేల్చి చెప్పేస్తున్నారు. ఇలా మూడు కీలక ప్రాంతాల్లో అనేక సమస్యలు నెలకొన్నందున రాష్ట్రంలో కొత్త ప్రధాన ఓడరేవు నిర్మాణంపై నెలకొన్న చీకట్లు తొలగలేదు.

మా పథకాలను కాదనేందుకు కేంద్రమెవరు?

(మొదటిపేజీ తరువాయి)

2014-15కి రూ.16వేల కోట్ల వరకు లోటు ఉందని రిజర్వ్ బ్యాంకు, కాగ్ కూడా నిర్ధారించగా, నీతీ ఆయోగ్ రూ.14 వేల కోట్లలోటుగా గుర్తించిందని యనమల పేర్కొన్నారు. అధికారిక విభాగాలు నిర్ధారించిన లోటును కేంద్రం మాత్రం అంగీకరించడం లేదని విమర్శించారు. పైగా రాష్ట్రంలో అమలు చేస్తున్న కొన్ని పథకాలపైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తోం దన్నారు. రాష్ట్రంలో అమలు చేసే పథకాలకూ కేంద్రం అనుమతి తీసుకోవాలా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజల కు కావాల్సిన అవసరాలను తాము గుర్తించి అమలు చేస్తామని, వాటిలో కొన్నింటికి కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో కొంత మేర నిధులు వస్తాయని, మిగిలిన నిధులను తామే భరించుకుంటున్నామని గుర్తు చేశారు.

పోలవరంపై విచారణెందుకు?

పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ ఇది ప్రజలకు సంబంధించినదని వ్యాఖ్యానించారు. దీన్ని ఆపాలనుకోవడం సరికాదని చెప్పారు. ఇంతవరకు తామే నిధులను భరించి కేంద్రం నుంచి రీయింబర్స్‌మెంట్ కోరుతున్నామని చెప్పారు. పోలవరం పనులపై కేంద్రం నిఘా పెట్టి విచారణ చేయిస్తున్నట్లు వస్తున్న వార్తలపై స్పందిస్తూ నిధులు తాము ఖర్చు చేస్తున్నా పనులు మొత్తం పోలవరం ప్రాజెక్టు అథారిటీ కనుసన్నల్లోనే సాగుతున్నాయని చెప్పారు. చేసే ప్రతి పైసా ఖర్చును ఆ అథారిటీయే చూస్తోందని, ఇక విచారణ ఎందుకని ప్రశ్నించారు. అన్ని రాష్ట్రాలకు ఇవ్వాల్సిన వాటా నిధులు నిలుపు చేయడం కేంద్రానికి సాధ్యం కాదని, మహా అయితే గ్రాంట్ల ద్వారా ఇచ్చే నిధులను తగ్గించే అవకాశాలు ఉండవచ్చునని ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు. అయినా ఆర్థిక ఇబ్బందులు రాకుండా తాము ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రైతు సాధికారిత సంస్థలు రుణం తీసుకునేందుకు అనుమతిస్తూ, తాము గ్యారంటీగా ఉంటున్నామని ఒక ఉదాహరణగా పేర్కొన్నారు.

అవిశ్వాసంపై చర్చకు అడ్డు అన్యాయం

పార్లమెంట్‌లో తెలుగుదేశం పెట్టిన అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా ప్రభుత్వమే అడ్డుకుంటున్నట్లు కనిపిస్తోందన్నారు. కొంతమంది సభ్యుల ఆందోళనలను కారణంగా చూపిస్తూ చర్చను తిరస్కరించడం అన్యాయన్నారు. రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనురించిన విధానాలనే ఇప్పుడు బిజెపి ప్రభుత్వం కూడా అమలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి కావాల్సిన బిల్లులను గొడవ సమయంలోనూ ఆమోదించుకుంటున్న ప్రభుత్వం అవిశ్వాస చర్చను మాత్రం గొడవ పేరుతో పక్కన పెట్టడం సరికాదన్నారు. ఇదే తొలి అవిశ్వాసం కావడం వల్ల నిబంధనల మేరకు తప్పనిసరిగా చర్చకు అనుమతించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సభలో రోజూ గొడవకు దిగుతున్న అన్నా డిఎంకె కూడా బిజెపి చేతిలోని పార్టీయేనని వ్యాఖ్యానించారు.

భారీగా పడిపోయిన నీటిమట్టాలు

ఖరీఫ్‌కు ముందుగానే సాగునీరందించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ముందుచూపు లేకుండా రిజర్వాయరును ఖాళీ చేయించడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు తుంగభద్ర డ్యామ్‌లోనూ నీటి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. కేవలం 6.12 టిఎంసిలు మాత్రమే ఉంది. లో లెవెల్ కెనాల్ (ఎల్‌ఎల్‌సి)కి తుంగభద్ర డ్యామ్ నుంచి 1100 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతున్నా కర్నాటకలో జరుగుతున్న జలచౌర్యంతో ఆంధ్రా సరిహద్దులోకి కేవలం 205 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయి.


రవి కిషన్, కల్యాణ్ రామ్, కాజల్ అగర్వాల్, అల్లరి నరేశ్, టి.జి. ప్రసాద్, ఉపేంద్ర మాధవ్, కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి, కాసర్ల శ్యామ్, రామజోగయ్య శాస్త్రి తదితరులు

నన్ను కొత్తగా చూపించారు

కల్యాణ్ రామ్

నందమూరి కల్యాణ్ రామ్, కాజల్ అగర్వాల్ హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'ఎంఎల్ఏ'. టి.జి.విశ్వప్రసాద్ సమర్పణ. బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్స్‌పై తెరకెక్కింది. ఉపేంద్ర మాధవ్ దర్శకత్వం వహించారు. కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు.

కల్యాణ్ రామ్ మాట్లాడుతూ "కథను నమ్ముకుని సినిమాలు తీసే నిర్మాతలంటే నాకు ఎంతో ఇష్టం. అటువంటి వారిలో ఈ నిర్మాతలు ముందుంటారు. కథ వినగానే ఇంకా ఎన్‌హెన్స్ చేయాలనుకునే నిర్మాతలు. తప్పకుండా భవిష్యత్‌లో పెద్ద నిర్మాతలు అవుతారు. 'పటాస్' విన్నప్పుడు ఎంత ఎగ్జయిట్ అయ్యానో.. ఈ సినిమాకు కూడా అంతే ఎగ్జయిట్ అయ్యాను. తను సినిమాను కళ్లకు కట్టినట్లు నెరేషన్ ఇచ్చాడు. ఈ సినిమాలో నన్ను కొత్తగా చూపించాడు. 'పటాస్', 'ఇజం' సినిమాలకు ఎంత బాగా ఫీలయ్యానో.. ఈ సినిమాకు కూడా అలాగే ఫీలయ్యాను. కొత్త దర్శకుడిని గైడ్ చేయాల్సిన బాధ్యత సినిమాటోగ్రాఫర్‌ది. దర్శకుడు, సినిమాటోగ్రాఫర్‌ది భార్య భర్తల సంబంధం. నేను పనిచేసిన కెమెరామెన్స్‌లో బెస్ట్ కెమెరామెన్ ప్రసాద్ మూరెళ్ల. రవికిషన్ నాకు దేవుడిచ్చిన అన్నయ్యలాగా దొరికారు. ఆయన బోజ్‌పురిలో సూపర్‌స్టార్. అలాంటి ఓ వ్యక్తి... మన ఇండస్ట్రీలో ఎంటాగనిస్ట్ చేయడం చాలా గొప్ప విషయం. 500 సినిమాలు చేసిన రవికిషన్ ఇంకా ఏదో నేర్చుకోవాలని ప్రయత్నిస్తుంటారు. ఆయన్ను చూసి ఇన్‌స్పైర్ అయ్యాను. ఈ సినిమాలో కొత్త కల్యాణ్‌రామ్‌ని చూస్తారు. సినిమా చూసిన వారెవ్వరూ బోర్ ఫీల్ కారు. ఎందుకంటే తమ్మిరాజు ఏ మొహమాటం లేకుండా నచ్చకపోతే.. ఎడిట్ చేసేశారు. ప్రతి ఒక్కరి కష్టం తెరపై కనపడుతుంది. కాజల్ అగర్వాల్‌తో నేను చేసిన రెండో సినిమా. నేను పద్నాలుగు సినిమాలు చేస్తే.. తను 50 సినిమాలు చేసింది. అందుకు కారణం తన డెడికేషన్. ఈ 12 ఏళ్లలో తను ప్రొఫెషనల్‌గా ఎంతో ఎదిగింది. తను మరో 50 సినిమాలు చేయాలని కోరుకుంటున్నాను. నా హృదయానికి దగ్గరైన సినిమా' అని అన్నారు.

అల్లరి నరేశ్ మాట్లాడుతూ 'నిర్మాతలు, మా బాబాయ్ కల్యాణ్ రామ్‌తో ఉన్న పరిచయంతో ఇక్కడకొచ్చాను. కల్యాణ్‌కి ఎం.ఎల్.ఎ బ్లాక్‌బస్టర్ హిట్ అవుతుంది. దర్శకుడు ఉపేంద్ర మాధవ్ మంచి వ్యక్తి. తనకు ఈ సినిమా మంచి హిట్ అవుతుంది. మణిశర్మ పాటలెంతో బావున్నాయి' అని పేర్కొన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ 'నేను, ఉపేంద్ర కలిసి పనిచేశాం. తను మంచి టైమింగ్ ఉన్న డైరెక్టర్. మంచి సినిమాను మంచి హీరో, టీంతో కలిసి చేయడం అంత సులభం కాదు. మంచి లక్షణాలున్న అబ్బాయికి కల్యాణ్‌రామ్ మంచి ఉదాహరణ' అని తెలిపారు.

దర్శకుడు ఉపేంద్ర మాధవ్ మాట్లాడుతూ ' కల్యాణ్ రామ్ డైరెక్టర్స్ హీరో. ఏమీ తినకుండా 16 గంటల పాటు ఉండేవారు. దర్శకుడిగా నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చారు. కథ విన్న ఆయన 'మనం ఈ సినిమా చేస్తున్నాం' అని అన్నారు. ఎక్కువ సమయం తీసుకోకుండా ఓకే చెప్పేశారు. నేను చెప్పిన బడ్జెట్ ఏంటో, ఇప్పుడైన బడ్జెట్ ఏంటో నాకు తెలుసు' అని అన్నారు.

శ్రీనువైట్ల మాట్లాడుతూ 'రియల్ లైఫ్‌లో ఎవరి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా వచ్చి ఎమ్మెల్యే అవడం ఎంత కష్టమో నాకు తెలియదు. ఎవరి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా డైరెక్టర్ అవడం ఎంత కష్టమో తెలుసు. ఉపేంద్ర నా దగ్గర చాలా సంవత్సరాలు పనిచేశాడు. తను ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డాడో కూడా తెలుసు. డైరెక్టర్ అయ్యే క్రమంలో తనకి ఎదురయ్యే అనుభవాలను నాకు ఎప్పుడూ చెబుతుండేవాడు. నేను కూడా నాకు తోచిన మాటలు చెబుతుండేవాడిని. 'ఎంఎల్ఏ' సినిమాను చేయడానికి తన పడ్డ కష్టం నాకు తెలుసు. తన కలను నిజం చేసింది కల్యాణ్ రామ్' అని పేర్కొన్నారు.

ఎన్.శంకర్, కోన వెంకట్, డి.సురేశ్ బాబు, పోసాని కృష్ణమురళి, భీమనేని శ్రీనివాసరావు, వి.ఎన్.ఆదిత్య, రవికిషన్, బ్రహ్మానందం, పృథ్వీ, రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


'రాజరథం' కుటుంబ కథా చిత్రం


నిరూప్ భండారి, అవంతిక శెట్టి, సతీష్ శాస్త్రి, రామ్ కుమార్

నిరూప్ భండారి, అవంతిక శెట్టి జంటగా రూపొందిన సినిమా 'రాజరథం'. అనూప్ భండారి దర్శకత్వంలో జాలీ హిట్స్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. అంజు వల్లభనేని, విషు దకప్పదారి, సతీష్ శాస్త్రి, అజయ్‌రెడ్డి గొల్లపల్లి నిర్మాతలు. ఈ శుక్రవారం ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా సమావేశం నిర్వహించారు. సతీశ్ శాస్త్రి మాట్లాడుతూ "యు.ఎస్‌లో డిస్ట్రిబ్యూటర్స్‌గా ఉండి ఎన్నో విజయవంతమైన సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేసిన మా జాలీ హిట్స్ సంస్థ నిర్మాణ రంగంలోకి వచ్చింది. అనూప్ భండారి దర్శకత్వంలో చేసిన సినిమాలో నిరూప్ భండారి హీరోగా నటించారు. సినిమా మేకింగ్‌లో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. అజనీశ్ లోక్‌నాథ్ ఈ సినిమాకు నేపథ్య సంగీతాన్ని అందించారు' అని తెలిపారు. రామ్‌కుమార్ మాట్లాడుతూ "ఇలాంటి సినిమాలను ఆదరిస్తే.. మరిన్ని కొత్త కాన్సెప్ట్ సినిమాలు వస్తాయి. సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. రెండేళ్ల పాటు యూనిట్ కష్టపడి చేసిన చిత్రమిది' అని పేర్కొన్నారు.



రవితేజ సరసన కేథరిన్



రవితేజ వరసపెట్టి సినిమాలు చేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తుంది. మొన్న 'రాజా ది గ్రేట్'తో మెప్పించిన ఈ హీరో ఇప్పుడు మళ్లీ వేసవిలో మరో సినిమాతో సందడి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాడు. ఆ చిత్రమే 'నేల టికెట్'. వి.ఐ.ఆనంద్, సంతోష్ శ్రీనివాస్ ..ఈ ఇద్దరు దర్శకులతో రవితేజ నటించబోతున్నారట. ఈ సినిమా ఎవరితో ఉండబోతుందన్నది ఇంకా స్పష్టత రాలేదు. ఈ సినిమాలో కేథరిన్ కథానాయికగా చేయనుందని తెలిసింది. ఇటీవలే శ్రీనువైట్లతో చేసే సినిమా 'అమర్ అక్బర్ ఆంటోనీ' చిత్రీకరణ లాంఛనంగా ప్రారంభమైంది.

ఎవరిపై 'పంతం'?


'పంతం'లో గోపీచంద్

గోపీచంద్ చేస్తున్న తాజా చిత్రం 'పంతం'. ఫర్ ఎ క్లాస్ అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంతో 'జై లవకుశ' చిత్రానికి స్క్రీన్‌ప్లే అందించిన కె. చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇది గోపీచంద్ 25వ సినిమా. నిర్మాత కె.కె.రాధామోహన్ మాట్లాడుతూ 'అనుకున్న ప్లాన్ ప్రకారం సినిమాలో 60 శాతం చిత్రీకరణను పూర్తి చేశాం. మంచి మెసేజ్‌తో పాటు కమర్షియల్ హంగులతో సినిమాను దర్శకుడు చక్రి చక్కగా తెరకెక్కిస్తున్నారు. హీరో గోపీచంద్ క్యారెక్టర్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. అలాగే ఇప్పటి వరకు కనపడని స్టైలిష్ లుక్‌లో గోపీచంద్ కనపడతారు. సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశాం. అలాగే మెహరీన్ చాలా మంచి పాత్రలో కనపడతారు. గోపీ సుందర్ సంగీతం, ప్రసాద్ మూరెళ్ల సినిమాటోగ్రఫీ సినిమాకు పెద్ద ఎసెట్ అవుతాయి' అని అన్నారు. ఈ చిత్రానికి ఆర్ట్ : ఎ.ఎస్.ప్రకాశ్, మాటలు: రమేష్ రెడ్డి, స్క్రీన్‌ప్లే : కె.చక్రవర్తి, బాబీ(కె.ఎస్.రవీంద్ర.

అనుకున్న తేదీకే 'కాలా' వస్తాడు


'కాలా'లో రజనీకాంత్

రజనీకాంత్ చేసిన తాజా చిత్రం 'కాలా'. పా రంజిత్ దర్శకత్వం వహించారు. సర్వీస్ ప్రొవైడర్ల తీరుకు నిరసనగా తమిళ నిర్మాత మండలి కొనసాగిస్తున్న సమ్మె కారణంగా 'కాలా' చిత్రం విడుదలను వాయిదా వేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. 'కాలా' సినిమాను విడుదలను వాయిదా వేసుకోవాలని నిర్మాత, తమిళ నిర్మాత మండలి కార్యదర్శి దురైరాజ్ లైకా ప్రొడక్షన్ వారిని కోరినట్టు వార్తలు వచ్చాయి. దీనిపై లైకా ప్రొడక్షన్ స్పందించింది. తమకు ఎవరూ ఆ విషయం తెలియజేయలేదని అనుకున్న తేదీ ఏప్రిల్ 27నే 'కాలా' చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకొస్తుందని స్పష్టం చేసింది. ఈ చిత్రంలో రజనీకాంత్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించబోతున్నారు. ఏప్రిల్ 27న 'కాలా'తో పాటు హాలీవుడ్ చిత్రం 'అవెంజర్స్ : ఇన్‌ఫినిటీ వార్స్' కూడా విడుదల కానుంది.


రకుల్ ప్రీత్‌సింగ్

వైఎస్సార్‌గా మమ్ముట్టి



వైఎస్ రాజశేఖరరెడ్డిగా మళయాల నటుడు మమ్ముట్టి కనిపించబోతున్నారు. రాజశేఖరరెడ్డి జీవిత కథగా రూపొందనున్న చిత్రానికి 'యాత్ర' అనే పేరును నామకరణ చేశారు. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించనున్నారు. 'ఆనందో బ్రహ్మ' ఫేమ్ మహి వి రాఘవ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత విజయ్ చిల్లా మాట్లాడుతూ ఈ సినిమా కోసం మహి రెడీ చేసిన లైన్ నచ్చడంతో సినిమాను నిర్మించేందుకు సన్నాహాలు మొదలుపెట్టాం. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆరాధించే నాయకుడు, ఎమోషనల్‌గా ప్రజలకు దగ్గరైన వ్యక్తి వైఎస్. ఆయన జీవితంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా భారీ బడ్జెట్‌తో ఎమెషనల్ కంటెంట్‌గా ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ప్లాన్ చేస్తున్నాం' అని తెలిపారు.

ఆ స్థానం కోసం

రకుల్ ప్రీత్ సింగ్... తెలుగు చిత్రసీమలో అగ్రతార. గత ఏడాది వరకూ చేతి నిండా సినిమాలతో బిజీగా గడిపే కథానాయిక. ప్రస్తుతానికి తెలుగులో నటించేందుకు తన చేతిలో ఒక్క సినిమా అయినా లేదు. తమిళంలో మాత్రం చేస్తోంది. తెలుగులో మళ్లీ బిజీ అయ్యేందుకు, తన స్థానాన్ని తిరిగి సంపాదించుకునేందుకు సన్నాహాలు చేస్తుంది. దానిలో భాగంగానే రకుల్ ప్రీత్‌సింగ్ ప్రత్యేకంగా 'రకుల్ యాప్'ను ప్రారంభించింది. 'ఇప్పటికే ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలు ఉన్నా వాటి ద్వారా అభిమానులకు దగ్గర కాలేకపోతున్నాను. నా నుంచి వాళ్లు ఎటువంటి పాత్రలు ఆశిస్తున్నారు. ఎలాంటి కథలను ఎంపిక చేసుకుంటే బాగుంటుంది...వంటి విషయాలన్నీ నేరుగా అభిమానులు లైవ్ ద్వారా నన్ను అడగొచ్చు. మాట్లాడొచ్చు. సూచనలు చేయొచ్చు' అని రకుల్ చెప్పింది. ఈ యాప్ ద్వారా క్రేజ్ పెంచుకునే ఆలోచన చేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు తెలుగులో పెద్ద చిత్రాలన్నీ రాశీ ఖన్నా, పూజా హెగ్డే, కైరా అద్వాని వంటి వారు చేస్తున్నారు. ఆ జాబితాలో తాను కూడా ఉండాలని ఆశిస్తున్నట్టు తెలుస్తుంది.

'మర్లపులి' పాటలు విడుదల

సుధాకర్ ఇంపెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బోన్ క్రాఫ్ట్ క్రియేషన్స్ పతాకంపై డి నరసింహ సమర్పించిన చిత్రం 'మర్లపులి'. వరుణ్ సందేశ్ ప్రత్యేక పాత్రలో, అర్చన ప్రధాన పాత్రలో నటించారు. ఈ చిత్రానికి దర్శకుడు డి రామకృష్ణ. నిర్మాతలు బి సుధాకర్ రెడ్డి, బి భవాని శంకర్, ఖమ్మం శ్రీనివాస్. ఈ చిత్రం ఈనెల 23న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్ర గీతాలను హీరోయిన్ భాను చేతుల మీదుగా విడుదల చేశారు.

ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన బి.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ '1983లో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. ఇందులో అందరూ పెద్ద నటీనటులే ఉన్నారు. రామకృష్ణ అందరికీ నచ్చేలా తెరకెక్కించారు. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్. ఈ చిత్రానికి నేనే మ్యూజిక్ అందించాను. పాటలు అందరి ఆదరణ పొందుతాయని ఆశిస్తున్నాను' అని తెలిపారు. డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ '13 రోజుల్లో షూటింగ్ పూర్తి చేశాం. తక్కువ సమయం అయినా మంచి నాణ్యతతో తెరకెక్కించాం' అని తెలిపారు.


డి. రామకృష్ణ, సుధాకర్ రెడ్డి, భవాని ప్రసాద్, భాను తదితరులు

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరు కూడా వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతికరంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు. మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.

సంగమం



రాష్ట్రాలు విడిపడ్డాక.. రాష్ట్రాభివృద్ధి, రాజధాని పునర్నిర్మాణాంశాలతోపాటు సాంస్కృతికరంగపు పురోగతిపైనా.. దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. సమాజ వికాసానికి, చైతన్యానికి.. లలితకళల ఉనికి అనేది అనివార్యమైన అంశం. ఇది ఇప్పటిది కాదు. తరాల మాట. నిన్నటిదాకా.. ఒకే తెలుగు రాష్ట్రం కావడంతో భాషా, సాంస్కృతిక, లలిత కళాంశాలన్నీ ఒకే గూటిన, ఒకే నీడన ఉన్నట్టుగా కనిపించేవి. వినిపించేవి. సాంస్కృతిక అంశాలూ ప్రాంతీయ అస్థిత్వానికి ప్రధాన అంగాలుగా మారే క్రమంలో ఇప్పుడు నవ్యాంధ్రప్రదేశ్‌లోనూ.. చిత్రకళ కొత్తహంగులు పుణికిపుచ్చుకుని కళకళలాడుతోంది. తాజాగా ఉగాది పండగ సందర్భంగా విజయవాడ ఆర్ట్ సొసైటీ, సాంస్కృతికశాఖ సౌజన్యంతో చిత్రకళ వర్క్‌షాప్, ప్రదర్శన నిర్వహించింది. 'ఉగాది-తెలుగు సంస్కృతి' అనే వస్తువు నేపథ్యంగా కళాకారులు చిత్రించిన కాన్వాస్ చిత్రాలు చిత్రకళా విమర్శకుల మెప్పు పొందాయి. అంతేకాదు, వర్ధ, ప్రవర్ధమాన చిత్రకారులకు రేపటి రోజుకు సరిపడా కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆ రంగుల శోభను ఈ వారం 'సంగమం'లో చూద్దాం!!



ఉగాది చిత్రలేఖనం

మిగతా రాష్ట్రాలతో పోల్చుకుంటే.. ఆంధ్రప్రదేశ్‌లో చిత్రకళకు వేగవంతమైన, ప్రణాళికాబద్ధమైన ఆదరణ పెరగాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే.. ఆ విషయం పక్క రాష్ట్రంలోకి తొంగిచూసినా తెలుస్తుంది. తెలంగాణా ఏర్పడ్డాక.. ఇప్పటిదాకా.. ఆ రాష్ట్రం ప్రభుత్వం చిత్రకళ అభివృద్ధికి కోట్లాది రూపాయిలు వెచ్చించింది. మునుపెన్నడూ లేనివిధంగా ఔత్సాహిక కళాకారులు మొదలుకుని సీనియర్ కళాకారుల వరకూ పెద్దఎత్తున ప్రోత్సహిస్తూ వస్తుంది. ఇదే సమయంలో.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిత్రకళ కొంత వెనుకబడి ఉందనే చెప్పాలి.

కారణాలు అనేకం. స్థానిక చిత్రకారులకు అనువైన ఆర్ట్‌గ్యాలరీలు లేకపోవడం.. స్థానిక చిత్రకళను ప్రోత్సహించగల సరైన యంత్రాంగం లేకపోవడం, అలాగే స్థానిక చిత్రకళకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ వరకూ తీసుకెళ్ళగలిగే వారధి లేకపోవడం. అయితే, మిగతా ప్రాంతాలతో పోల్చుకున్నప్పుడు ప్రతిభగల చిత్రకళకు, చిత్రకళాకారులకు ఇక్కడా కొదవులేదు. గతంలోనే కాదు, వర్తమాన పరిస్థితుల్లోనూ చిత్రకళలో మెరుగ్గా రాణిస్తున్న కళాకారులెందరో స్థానికంగా ఉన్నారనే చెప్పాలి. అయితే మెరుగైన వనరులు మనకు లేకపోవడమే వెలితి. అయితే కొత్త రాష్ట్రం ఏర్పడ్డాక.. స్థానికంగా చిత్రకళారంగంలో ఆశించిన కదలిక వచ్చింది.

ఇలాంటి నేపథ్యంలో స్థానిక చిత్రకళ, కళాకారుల ప్రతిభను ప్రోత్సహించే క్రమంలో ఇప్పుడిప్పుడే చిత్రకళకు సంబంధించిన కార్యక్రమాలు ఊపందుకుంటున్నాయి. అందులో భాగంగా రాష్ట్రంలోని ఔత్సాహిక, అనుభవంగల చిత్రకళాకారుల సమ్మేళనంగా "విజయవాడ ఆర్ట్ సొసైటీ" ఏర్పడింది. రెండేళ్ళుగా సొసైటీ పలు ప్రోత్సాహకర కార్యక్రమాలు నిర్వహిస్తుంది. అందులో భాగంగానే ఇటీవల ఉగాది సందర్భాన్ని పురస్కరించుకుని, రెండు చిత్రకళ వర్క్‌షాప్, ప్రదర్శన జరిగింది. దీనికి రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహకారాన్ని అందించింది.

రంగుల అద్దిన వర్క్‌షాప్

అది.. విజయవాడ ఘంటసాల సంగీత కళాశాల ప్రాంగణం. తెల్లారితే ఉగాది. ఎనిమిది, పదిగంటల సమయం. 30మంది కళాకారులు. అందులో ఏడుగురు మహిళా చిత్రకారులు. ఉదయం పది, పదిన్నర కావొస్తుంది. అప్పటికప్పుడు, ప్రత్యక్షంగా చిత్రాలు గీసే పద్ధతిలో కళాకారులు తమ సరంజామాతో సిద్ధమయ్యారు. వారి కోసమే ఎదురుచూస్తున్నట్టుగా.. శ్వేతవర్ణ కాన్వాసు, రంగులూ, కుంచెలూ సిద్ధంగా ఉన్నాయి. అలా ఒక్కొక్కరూ.. వరుస క్రమంలో బడి పిల్లల్లా కూర్చుని, తమ సృజనాత్మక మనోనేత్రానికి పనిచెప్తూ.. కాన్వాస్‌పై రంగులు పూయడం మొదలైంది. అలా సమయం గంట, రెండుగంటలు, మధ్యలో కాస్తంత భోజన విరామం. వెంటనే మళ్ళీ రంగులతో జత కట్టడం. కళాకారుల కుంచెలో.. ఒక్కొక్క చిత్రం.. చత్రిక పట్టినట్టుగా.. అనేక రూపాలుగా మారుతూ.. మార్పులు చేర్పులూ చేసుకుంటూ.. ఉంటే.. అక్కడేదో.. ఇంద్రధనస్సు వాలిందా? అనే ఒక పరికల్పన అందరిలోనూ. అలా సూర్యుడు అస్తమయం సమయానికి ప్రతి ఒక్కరి చేతిలోని కుంచెలన్నీ ఎంతో సంతృప్తిగా ఒక రంగుల యజ్ఞాన్ని పూర్తిచేశాయి. కట్ చేస్తే.. ఒకపూటలో జరిగిన ప్రత్యక్ష చిత్రకళా వర్క్‌షాప్.. విజయవంతంగా ముగిసింది. ప్రతి బొమ్మా.. చక్కటి వర్ణపు కథలల్లుకుంటూ కళాప్రియుల్ని రంగరించాయి.


వర్ణచిత్రాల శోభ

అసలే.. ఉగాది పండగ. ఉగాది అంటేనే ప్రకృతి శోభను తలచుకునే సందర్భం. అందులో పచ్చని చెట్లుంటాయి. లేలేత పూతగల వేపచిగురులూ ఉంటాయి. పచ్చని కొమ్మల నడుమ దాక్కొని 'కుహూ.. కుహూ..' అంటూ ఆరున్నొక్క రాగంలో కూతపెట్టే కోకిల పాటలూ ఉంటాయి. అంతేకాదు, అచ్చమైన తెలుగు సంప్రదాయపు కట్టూబొట్టూ అలరిస్తాయి. ఇవన్నీ రంగుల చిత్రాల్లో రంగరిస్తే ఎలా ఉంటుంది..?! అచ్చంగా విజయవాడ ఆర్ట్ సొసైటీ సభ్యులు చిత్రీకరించిన కాన్వాస్ చిత్రాల్లానే ఉంటాయి.

సంప్రదాయం, నైరూప్య చిత్రకళా ప్రక్రియను జోడించి.. చిత్రించిన కళాకారుల చిత్రాలన్నీ వేటికవే వైవిధ్యాన్ని చాటాయి. ఇలా ఒక్కరోజు వర్క్‌షాప్‌లో పూర్తిచేసిన చిత్రాలను ఉగాదిరోజున కళాప్రదర్శనలో ఉంచారు. వర్క్‌షాప్‌ను సీనియర్ చిత్రకారుడు టి.వెంకట్రావ్ (టీవి) లాంఛనంగా ప్రారంభించగా.. ప్రదర్శన ముగింపోత్సవంలో సాంస్కృతికశాఖ సంచాలకులు డి.విజయభాస్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొని, కళాకారులకు అభినందనలు తెలిపారు.

ఇప్పుడిప్పుడే మెట్రోనగరపు ఛాయల్ని దిద్దుకుంటున్న విజయవాడ నగరాన.. ఇలాంటి చిత్రకళా ప్రదర్శనలు, ఆర్ట్‌క్యాంప్‌లు నిర్వహించడం అభినందనీయం. చిత్రకళలో ఉన్నత స్థాయి అనుభవాలను అందిపుచ్చుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయనడంలో ఏమాత్రం సందేహంలేదు.

- గంగాధర్ వీర్ల



ప్రతిభకు వారధిగా

ఆంధ్రరాష్ట్రంలో చిత్రకళా ప్రతిభకు కొదవులేదు. కావాల్సిందల్లా దిశానిర్దేశమే. అలాగే, వర్తమాన పరిస్థితిలో చిత్రకళలో రాణిస్తున్న వారికి సరైన ప్రోత్సాహం ఇవ్వగలిగితే.. స్థానికంగా చిత్రకళారంగం మరింత వృద్ధి చెందుతుంది. చిత్రకళావర్క్‌షాప్‌లు, క్యాంప్‌లు ద్వారా వర్ధ, ప్రవర్ధమాన చిత్రకారులందరినీ ఒకచోట చేర్చడం ద్వారా.. పరస్పరం.. నైపుణ్యాలను పంచుకోవచ్చు. ఒకర్ని చూసి ఒకరు స్ఫూర్తి పొందవచ్చు. కళాకారుల ప్రతిభకు వారధిగా ఉండాలన్నదే సొసైటీ సంకల్పం.

- అల్లు రాంబాబు,
విజయవాడ ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు,
ఫోన్: 9848586364



అందర్నీ ఒకేతాటిపైకి

ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే.. స్థానికంగా మనం ఇంకా చిత్రకళలో మెరుగ్గా రాణించాల్సిన అవసరం ఉంది. ఇక్కడ కళాకారులకు సరైన ప్రోత్సాహం అవసరం. వర్తమాన చిత్రకళలోని మార్పులు, శిక్షణ అంశాలపైనా అవగాహన కావాలి. అలాంటి విషయాలన్నింటికీ సొసైటీ ఆసరాగా ఉండాలనేది మా సంకల్పం. రానున్న రోజుల్లో స్థానికంగా చిత్రకళా అవసరాలు మరింత పెరుగుతాయి. అందుకు మనం ఇప్పటి నుంచే సిద్ధంకావాలి. స్థానిక చిత్రకారులందర్నీ ఒకే వేదికపైకి తీసుకురావాలి. వారికి తగిన ప్రోత్సాహం ఇవ్వాలన్నదే సొసైటీ లక్ష్యం.


- స్ఫూర్తి శ్రీనివాస్,
ప్రధాన కార్యదర్శి, విజయవాడ ఆర్ట్‌సొసైటీ



అందరికీ అవకాశాలు

చిత్రకళలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాటికి అనుగుణంగా నైపుణ్యాన్ని తీర్చిదిద్దుకుంటే.. మనమూ అవకాశాలను అందిపుచ్చుకోగలం. ఇప్పుడిప్పుడే.. స్థానికంగా ఉత్సాహభరిత వాతావరణం కనపడుతుంది. యువతరం చాలామంది చిత్రకళపట్ల ఆసక్తి చూపిస్తున్నారు. అందరికీ వెన్నుదన్నుగా నిలవాలన్నదే సొసైటీ ఆశయం.

- కొలుసు సుబ్రహ్మణ్యం,
ఉపాధ్యక్షులు,
విజయవాడ ఆర్ట్ సొసైటీ













అలరించిన 'రసజ్ఞ' నాటకాలు

నాటకం పూర్వ వైభవం సాధించాలంటే రచయితలు, ప్రయోక్తల దృక్పథంలో మార్పు రావాలి. రకరకాల వ్యాపకాలతో సతమతమయ్యే ప్రేక్షకుల్ని రంగస్థలం వరకూ లాక్కొచ్చి.. ప్రదర్శన పూర్తయ్యే వరకూ కూర్చోబెట్టగల సామర్థ్యంపై దృష్టి సారించాలి. టి.వి. తన మెడకు కట్టేసుకున్న ప్రేక్షకుడ్ని స్వచ్ఛందంగా రంగభూమి పైకి రప్పించాలంటే మూస ధోరణికి స్వస్తి చెప్పి, కొత్త పద్ధతులు అన్వేషించాలి.

గతమంత కాకపోయినా నాటక ప్రదర్శనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. అనేక ఒడిదుడుకుల మధ్య నాటక సమాజాలు నాటకాలు ప్రదర్శిస్తూనే ఉన్నాయి. ఈ మధ్య డా. వేమలి త్రినాథరావు నిర్దేశకత్వంలో రసజ్ఞనాటక పరిషత్ వారు ఈ నెల 11,12,13 తేదీల్లో విజయనగరం గురజాడ కళాభారతి వేదిక మీద నాటకాలు ప్రదర్శించారు.

మొదటిరోజు మంత్రి సుజయకృష్ణ రంగారావు, లోక్‌సత్తా నాయకులు భీశెట్టి బాబ్జీ జ్యోతి ప్రజ్వలనం చేసి, ప్రదర్శనల్ని ఆరంభించారు. ఆరంభనాటిక న్యూస్టార్ మోడ్రన్ థియేటర్ విజయవాడ వారి 'షాడోలెస్ మేన్' ప్రదర్శించారు. ఒకరకంగా షాడోలెస్ మేన్ అంటే.. ఇతడు ప్రతీక పాత్ర. చెప్పాలంటే సైతాన్ లాంటివాడు. ఆ ఊళ్లో ఇతడు మొదట్లో ఎవరి కంటికీ కనిపించడు. కారణం అప్పటికీ ఆ గ్రామస్తులందరూ స్వచ్ఛమైన వాళ్లు. ఎప్పుడయితే వాళ్ల మనసులు కలుషితమవుతాయో అప్పటినుంచీ వాళ్లందరికీ కనిపిస్తాడు. వాళ్ల మధ్య తగువులు పెడతాడు. షాడో వాళ్లని ఆవహించిన తరువాత గ్రామంలోని వాళ్ల జీవితాలు అల్లకల్లోలం అయిపోతాయి. కానీ ఇంతమందికి కనిపిస్తూన్నా ఒకే ఒక వృద్ధునికి మాత్రం కనబడడు. కారణం వృద్ధుడు నిస్వార్థజీవి. చివరికి ఆ వృద్ధుడే అసలు విషయం చెప్పేసరికి అందరూ పశ్చాత్తాపం చెందుతారు. షాడో మరి కనపడడు. నాటిక మంచి సందేశమిచ్చింది.



గర్భగుడి నాటికలో ఓ సన్నివేశం

రెండో నాటిక విజయహేలా కళాసేవా సమితి విజయనగరం వారు ప్రదర్శించిన 'ఇలా అయితే ఎలా?'. నాటకీకరణ దర్శకత్వం పి.సన్యాసిరావు ఇది ప్రముఖ కవి, కథకుడు తిలక్ ఊరి చివరి ఇల్లు కథకు నాటకీకరణ. ఏ కథయినా దృశ్యమానం చేసినపుడు, చూడడం కన్నా కథ చదువుకోవడమే బాగుంటుందనిపించకూడదు. దేని అనుభూతి దానిదే. అనుభవమున్న నటుల వల్ల నాటకం రక్తి కట్టింది.

రమ వేశ్య అయినా ఆమె ప్రేమలో నిజాయితీ ఉంది. ఒకప్పటి విజయ్‌ని అలాగే ప్రేమిస్తుంది. కానీ ప్రేమ సఫలం కాదు. ఒక వర్షం పడిన రాత్రి వచ్చిన జగన్నాథం ఆమెని ఇష్టపడతాడు. పెళ్లి చేసుకుంటానని మాట ఇస్తాడు. అయితే రమనే అంటి పెట్టుకుని పబ్బం గడుపుతున్న ముసల్ది జగన్నాథంకి రమ గురించి చెడ్డగా చెప్పి, అతన్ని వెళ్ళిపోయేట్టు చేస్తుంది.



మాయపొర నాటికలో ఓ దృశ్యం

రెండో రోజు మొదటి నాటిక విజయనగరం వారి ద్వారకామయి అంధుల పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన రైతు. రచన పి.వి.పద్మనాభం దర్శకత్వం ఎం.ఆశాజ్యోతి. తన భూమిని అమ్మేసి గ్రామ సర్పంచ్‌గా పోటీ చేస్తాడు రైతు. కానీ ఓడిపోతాడు. భూమి లేక పోవడం రైతు కుటుంబం అల్లకల్లోలానికి గురవుతుంది. అత్యాశకు పోవడంవల్ల రైతు ఒడ్డు మీద పడ్డ చేపలాగా గిలాగిలా కొట్టుకుంటాడు. కళ్ళులేని పిల్లలైనా, కళ్ల తెరిపించే సందేశంతో పిల్లలు చక్కగా నటించారు.

రెండవ నాటిక... బహురూప నాటకసమాఖ్య విశాఖపట్నం వారి 'గర్భగుడి' రచన చింతకింది శ్రీనివాసరావు దర్శకత్వం ఎస్.కె. మిశ్రో. నాటిక ఇతివృత్తం సరోగసి (అద్దెగర్భం) కథ పాతదే అయినా దర్శకుడి అపార అనుభవం ప్రదర్శనాంతరం వరకు అడుగడుగునా కనబడింది.

అగ్రకులస్తుడ్ని ప్రేమించి, పెళ్లాడి అతని అకాలమరణంతో అత్తవారింటికి చేరుతుంది పద్మ. కానీ వాళ్ళు ముఖం చాటేస్తారు. దిక్కులేక పసిబిడ్డని తీసుకుని, దూరపు బంధువుల ఇంట్లో పనిమనిషిగా చేరుతుంది. ఆ దంపతులకే తన గర్భాన్ని అద్దెకిస్తుంది. అక్కడి నుంచి ఆ కుటుంబంలో భార్యాభర్తల మధ్య అనుమానాలు, అపార్థాలు చోటుచేసుకుంటాయి. చివరకు బిడ్డ ఎవరికి దక్కాలి అన్న సమస్య వచ్చినపుడు నవమాసాలూ మోసిన తల్లికే హక్కు ఉంటుందని రచయిత తీర్పునిస్తాడు.

చివరిరోజు మొదటి ప్రదర్శన శ్రీసాయి ఆర్ట్ కొలకలూరి వారి 'శ్రీకారం'. రచన భవానీప్రసాద్ దర్శకత్వం గోపరాజు విజయ్. తల్లిదండ్రులకు చెప్పా పెట్టకుండా ప్రేమించి, పెళ్లి చేసుకుని వెళ్లిపోయే అమ్మాయిల తల్లిదండ్రుల మనోవేదనకు అక్షరరూపం ఈ నాటిక. తనింట్లో ఒక పోర్షన్ తన మామకి అద్దెకిస్తాడు. ఇంటి ఓనరు తన అల్లుడే అని అతనికి తెలియదు. కానీ అల్లుడికి తెలుసు. పరోక్షంగా తండ్రీ కూతురు ఒకే దగ్గరుండే విధంగా ఏర్పాటు చేస్తాడు. తెలిసి తండ్రి వెళ్లిపోవాలని అనుకుంటాడు. కానీ అల్లుడు అతన్ని రెచ్చగొట్టి, అక్కడే ఉండేలా చేస్తాడు. తండ్రీకూతుళ్ల ఎడమొహం పెడమొహంగా ఉన్నప్పటికీ ఆమెకి నొప్పులు వచ్చే సమయానికి భర్త సమయానికి లేక తండ్రే ఆమెను ఆదుకోవలసి వస్తుంది. కన్న తల్లిదండ్రులకే పిల్లలపట్ల ప్రేమ, బాధ్యత ఉంటాయని నిరూపిస్తుందీ నాటిక. నటులందరూ నటనలో మంచి పరిణతిని చూపించారు.

చివరి ప్రదర్శన శ్రీకాకుళంజిల్లా బోరివంక వారి మాయపొర. రచన, దర్శకత్వం కె.కె.ఎల్. స్వామి ప్రజల అజ్ఞానాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వర్థిల్లే దొంగ స్వాముల బండారం బయటపెట్టే నాటిక ఇది. దొంగస్వాములు ఒక ఊరిలో పేదవారి పాలకమీద పంజా విసురుతారు. దాన్ని ఆపేద కుటుంబం ఎదుర్కొంటుంది. స్వాములకు ఆ స్థలం ఆస్తిగా కనబడుతుంది. కానీ అది పేదవాళ్లకి ఆవాసం. ఈ ఘర్షణలో తనకు లేని మహిమలతో వాళ్లని స్వామీజీ బృందం బెదిరిస్తే ఏమాత్రం అదరకుండా బెదరకుండా నిబ్బరంగా నిలబడతారు. ఆ పేద దంపతులు తమ కొడుకుని బలివ్వడానికైనా జంకరు. స్వామీజీ సామర్థ్యాన్ని సవాల్ చేస్తాడు బీదవాడు. చివరకు అల్పుడి ఆత్మవిశ్వాసం ముందు దొంగస్వామి మోకరిల్లక తప్పదు.



అంధ విద్యార్థులు ప్రదర్శించిన రైతు నాటిక

ఈ మూడు రోజులూ నాటిక ప్రదర్శనలూ నగర ప్రజల్ని అలరించాయని చెప్పక తప్పదు. ప్రదర్శనల అనంతరం స్థానిక ఎమ్.ఎల్.సి. కొలగట్ల వీరభద్రస్వామి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బి. నరసింగరావు ఎస్ఎస్ఎస్ రాజు, నటులకు, సాంకేతిక నిపుణులకు పారితోషకం, జ్ఞాపికలు అందించారు.

- జి.ఎస్. చలం,
విజయనగరం.

టీ20 ట్రై సిరీస్ షురూ!

నేడు ఆసీస్ భారత మహిళాజట్టు తొలిపోరు



ముంబయి : హర్మన్‌ప్రీత్‌కౌర్ సారథ్యంలోని భారత మహిళాజట్టు టీ20 ట్రైసిరీస్‌లో భాగంగా తొలిమ్యాచ్‌ను నేడు ఆసీస్ మహిళా జట్టుతో ఢీకొనబోతుంది. ఆసీస్‌తో వన్డే సిరీస్‌ను 3-0తో ఘోర పరాజయం అనంతరం టీ20లో మహిళాజట్టు ప్రదర్శనపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌ల మధ్య జరిగే ముక్కోణపు టీ20 టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మహిళలు ఆసీస్‌లో జరిగిన టీ20 బిగ్‌బాష్ లీగ్‌లో పాల్గొన్న ఉత్సాహంతో బరిలోకి దిగనున్నారు. వన్డే మ్యాచ్‌ల్లో ఆడని జులన్ గోస్వామి టీ20 మ్యాచ్‌లలో పాల్గొంటోంది.

ఫీల్డింగ్ మెరుగుపడాల్సి ఉంది : హర్మన్‌ప్రీత్ కౌర్

ఫీల్డింగ్ తప్పిదాలవల్లే ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురికావాల్సి వచ్చిందని టీమిండియా మహిళా క్రికెట్ టీ20 సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ అభిప్రాయపడింది. బుధవారం హర్మన్ ప్రీత్ మీడియాతో మాట్లాడుతూ టీ20ల్లో అంతగా అనుభవంలేని భారత మహిళల జట్టు ఈ టోర్నీ ద్వారా బలమైన ఆస్ట్రేలి యా, ఇంగ్లండ్‌లను ఢీకొన బోతుంన్నారు. బిగ్‌బాష్ లీగ్‌తో వారంతా టీ20ల్లో రాటు దేలా రని, అయినప్పటికి భారత మహిళలం సాయ శక్తులు పోరాడుతామని తెలిపారు. ప్ర స్తుతం తమ జట్టు నేర్చుకునే దశలో ఉందని, టీ20 ప్రపంచకప్ సన్నాహకంలో భాగంగా ఈ టోర్నీ ఎంతో ఉపయోగపడనుందని హర్మన్‌ప్రీత్ చెప్పారు.

మహిళాజట్టు :

హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధన, మిథాలీరాజ్, వేదా కృష్ణమూర్తి, రోడ్రిగ్వెస్, అనూజా పాటిల్, దీప్తి శర్మ, తానియా భాటియా (వికెట్‌కీపర్), పూనమ్ యాదవ్, ఏక్తా బిస్త్, జులన్ గోస్వామి, శిఖా పాండే, పూజా వాస్త్రకర్, రుమేలి ధార్, మోనా మేస్త్రమ్.

మహిళల టీ20 ట్రై సిరీస్ షెడ్యూల్...

మార్చి22	భారత్ × ఆస్ట్రేలియా
మార్చి 23	ఆస్ట్రేలియా × ఇంగ్లండ్
మార్చి 25	భారత్ × ఇంగ్లండ్
మార్చి 26	భారత్ × ఆస్ట్రేలియా
మార్చి 28	ఆస్ట్రేలియా × ఇంగ్లండ్
మార్చి 29	భారత్ × ఇంగ్లండ్
మార్చి 31	ఫైనల్

(మ్యాచ్‌లన్నీ ముంబయిలోని బ్రోబోర్న్ స్టేడియంలో)

మమతా బెనర్జీని కలవనున్న షమీ భార్య




కోల్‌కతా : టీమిండియా పేసర్ మహ్మద్ షమీ భార్య హసీన్ జహాన్ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీని కలవనున్నారు. ఈనెల 23న మమతా బెనర్జీని వ్యక్తిగతంగా కలిసిందేకు ఆమె ఈ అపాయింట్‌మెంట్‌ను తీసుకున్నారు. హసీన్ తన బాధలను తెలియజేయడంతో పాటు తనకు మద్దతివ్వాలని ఆమె సీఎంను కోరనున్నారని తెలిసింది. అంతకుముందు తాను న్యాయం కోసం పోరాడుతున్నానని, షమీ అరెస్ట్ అయ్యే వరకు తనకు మీడియావారు సహకరించాలని కోరారు.

ఐపీఎల్‌లో డీఆర్‌ఎస్: రాజీవ్ శుక్లా

న్యూఢిల్లీ: అంపైర్ డిసీషన్ రివ్యూ సిస్టం(డీఆర్‌ఎస్)ను ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) 11వ సీజన్ నుంచి అమలులోకి తేనున్నట్లు ఐపీఎల్ ఛైర్మన్ రాజీవ్ శుక్లా బుధవారం తెలిపారు. డొమెస్టిక్ క్రికెట్ టోర్నమెంట్‌లలో కేవలం బిగ్ బాష్ లీగ్‌లో మాత్రమే ఈ విధానం అమలులో ఉంది. అయితే ఐపీఎల్‌లోనూ ఇది అమలు చేసేందుకు బీసీసీఐ కొద్ది రోజులుగా కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఐసీసీ అంపైర్ కోచ్ డెనీస్ బర్న్స్, ఆస్ట్రేలియా అంపైర్ పాల్ రైఫిల్ సహా పదిమంది అంపైర్లతో బీసీసీఐ ఓ ప్రత్యేక సమావేశాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఇందులో ఐపీఎల్ అంపైర్లకు ఈ టోర్నీలో డీఆర్‌ఎస్ అమలుపై వివరించారు. డీఆర్‌ఎస్‌పై జరిపిన చర్చలు సఫలం కావడంతో ఈ సీజన్ నుంచి ఈ ప్రక్రియను అమలు చేస్తున్నట్లు శుక్లా స్పష్టం చేశారు.

కామన్వెల్త్ అథ్లెట్ల జాబితా విడుదల

న్యూఢిల్లీ: ఏప్రిల్ 4 నుండి 15 వరకు ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో జరిగే కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొనే అథ్లెట్ల జాబితాను క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ బుధవారం ప్రకటించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా వచ్చే అధికారులు, కుటుంబ సభ్యులు వారి సొంత ఖర్చులతో రావల్సి ఉంటుందని మీడియాతో అన్నారు. ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఎ) వచ్చే నెలలో జరిగే కామన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొనే జాబితాను తెలియజేశారు. వారిలో 222 మంది అథ్లెట్లు, 106 మంది ఆమోదం లభించిన అధికారులు, 57మంది కోచ్‌లు, 19మంది మేనేజర్లు, 41మంది ఇతర అధికారుల బృందంతో కామన్వెల్త్ గేమ్స్‌కు బయలుదేరనున్నట్లు తెలియజేశారు.



దీనావస్థలో విండీస్

రెండుసార్లు ప్రపంచకప్ విజేత
నేడు క్వాలిఫై మ్యాచుల్లో ఆడాల్సిన దుస్థితి
స్కాట్లాండ్‌పై గెలుపుతో 2019 ప్రపంచకప్‌కు క్వాలిఫై

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)

1970 నుండి 1990వ దశకం వరకు క్రికెట్‌ను శాసించిన దేశాల్లో వెస్టిండీస్ అగ్రస్థానంలో నిలుస్తుంది. అప్పట్లో విండీస్ జట్టులో దిగ్గజ ఆటగాళ్ళతోపాటు నిప్పులు చెరిగే బౌలర్లు కొండంత అండగా ఉండేవారు. దీంతో వెస్టిండీస్ జట్టుపై ప్రత్యర్ధి జట్టు ఆడాలంటేనే ఆటగాళ్ళ గుండెల్లో రైళ్లు పరుగెత్తేవి. ఆ కాలంలో విండీస్ జట్టులో క్లైవ్ లాయిడ్, వివియన్ రిచర్డ్స్, డెస్మండ్ హేన్స్, గ్రీనిడ్జ్ వంటి హేమా హేమీలు ఉండేవారు. బౌలింగ్‌లో ఆండీ రాబర్ట్స్, మాల్కమ్ మార్షల్, ఆంబ్రోస్, వాల్ష్‌లు ప్రత్యర్ధి బ్యాట్స్‌మన్లపై నిప్పులు చెరిగే బౌలింగ్ వేసేవారు. దీనికితోడు అప్పట్లో విండీస్ క్రికెట్ బోర్డ్ కూడా కాసులతో కళకళాడుతుండేది. కరేబియన్ జట్టు అంటే ప్రత్యర్ధి జట్లు బెదిరిపోయే పరిస్థితి అప్పట్లో ఉండేది. క్రమంగా ఒకతరం క్రీడాకారుల నిష్క్రమణ అనంతరం ఆ జట్టు ప్రాభవం కోల్పోతూ వచ్చింది. దీంతో క్రికెట్‌లో విండీస్ హవాకూడా తగ్గుతూ వచ్చింది.

1990 దశకం తర్వాత వెస్టిండీస్ జట్టు పూర్వపు జట్టంత బలంగా లేనప్పటికీ ఉద్ధండ క్రీడాకారులు మాత్రం జట్టులోకి వచ్చి చేరారు. వారిలో క్రిస్ గేల్, బ్రయాన్ లారా, చంద్రపాల్, సిమన్స్, డూజాన్‌ల గురించి చెప్పుకోవచ్చు. వీరంతా ఒంటిచేత్తో మ్యాచ్‌ను శాసించగల సత్తా ఉన్న క్రీడాకారులే. ప్రపంచ టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇక ఇన్నింగ్స్‌లో 400 పరుగులు సాధించిన ఏకైక క్రికెటర్ బ్రయాన్ లారా మాత్రమే. ఈ ఫీట్‌ను ఇప్పటివరకూ మరే క్రీడాకారుడు బ్రేక్ చేయలేకపోయాడు. అటువంటి జట్టు ఈసారి ఐసీసీ ప్రపంచకప్ అర్హత టోర్నీలో ఆడాల్సిన దుస్థితి దాపురించింది.

కాసులు లేక క్రికెట్ బోర్డ్ పతనం...

ఒకప్పుడు ఐసీసీ పోటీపడి అధికమొత్తంలో కాసులతో కళకళలాడే విండీస్ బోర్డ్ కాస్తా... అనంతర పరిణామక్రమంలో దీనావస్థలోకి చేరింది. ప్రస్తుతం విండీస్ క్రికెట్ బోర్డ్ ఏమాత్రం నిధులు లేక నామ మాత్రంగా నడుస్తోంది. ఆ ప్రభావం క్రీడాకారులపై కూడా పడింది. ప్రస్తుతం విండీస్ జట్టులో దేశం కోసం ఆడడంకంటే సొంత కాసుల సంపాదనకు ప్రతి ఒక్క క్రీడాకారుడు అలవాటు పడ్డారు. దీని కారణంగా ఆ జట్టులో హేమాహేమీలైన క్రీడాకారులు విదేశాల్లో జరిగే లీగ్‌లలో ఆడడానికి ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నారు. ముందే రిటైర్మెంట్ ప్రకటించి విదేశీ లీగ్‌లలో ఆడడానికి ఇష్టపడుతున్నారు.

లీగ్‌ల అన్వేషణలో వైఫల్యం...

ప్రస్తుతం మన దేశంలో జరుగుతున్నట్లు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్), ఆస్ట్రేలియాలో జరుగుతున్న బిగ్‌బాష్ లీగ్ (బిబిఎల్), ఇంగ్లండ్‌లో జరిగే కౌంటీ మ్యాచ్‌లు ఆయా దేశాల క్రికెట్ బోర్డులకు అధికమొత్తంలో కాసులను కురిపిస్తున్నాయి. ఆ ఆకర్షణలకు బానిసలై విండీస్ క్రికెటర్లు ఆయా లీగ్‌లలో పాల్గొని కాసులను సంపాదించుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. వెస్టిండీస్ క్రికెట్ బోర్డ్ సైతం స్వదేశీ లీగ్‌లు నిర్వహించి ఆదాయ మార్గాలను అన్వేషించడంలో ఘోరంగా విఫలమైంది. ఇటీవలి కాలంలో అసలు స్వదేశీ లీగ్‌లు నిర్వహించడమే మానేసింది.

జీతభత్యాలు కూడా ఇవ్వలేని దుస్థితి...

విండీస్ క్రికెట్ బోర్డు ప్రస్తుతం తమ క్రికెటర్లకు జీతభత్యాలు కూడా చెల్లించే పరిస్థితిలో లేదు. దీంతో క్రికెటర్లు ఆ దేశ బోర్డుపై ఎదురుతిరగడం... దీని కారణంగా ఇటీవలికాలంలో ఆ జట్టులోని 90% మంది క్రీడాకారులను తొలగించిన సందర్భాలు ఉన్నాయి. దీంతో బ్రేవో, గేల్, శామ్యూల్స్ తదితర ఆటగాళ్ళు దేశం తరఫున ఆడడం పూర్తిగా మానేశారు. ఇది కూడా జట్టు ప్రదర్శనపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది.



వరుణుడి కరుణతో ప్రపంచకప్‌కు క్వాలిఫై

హరారే : 2019 ఐసీసీ ప్రపంచకప్‌కు వెస్టిండీస్ జట్టు అర్హత సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిపై స్కాట్లాండ్‌పై విండీస్ గెలిచింది. బుధవారం స్కాట్లాండ్‌తో తలపడిన విండీస్ జట్టు టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసి 48.4 ఓవర్లలో 198 పరుగులకు మాత్రమే చేసింది. లెవీస్(66), శామ్యూల్స్(51) పరుగులు చేయగా... స్కాట్లాండ్ బౌలర్లు షరీఫ్, వీల్ మూడేసి వికెట్లు సాధించారు. స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 35.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసిన క్రమంలో వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయింది. దీంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిపై వెస్టిండీస్ జట్టు 5 పరుగుల తేడాతో గెలుపొంది వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ స్కాట్లాండ్ బౌలర్ షరీఫ్‌కు లభించింది. నేడు జరిగే జింబాబ్వే-యుఎఇ మ్యాచ్‌లో జింబాబ్వే గెలిస్తే రెండోజట్టుగా ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తుంది.



చిలకలూరిపేట కళామందిర్ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతున్న వైఎస్ జగన్

చంద్రబాబుకు బినామీ పుల్లారావు

నకిలీలకు అడ్డాగా గుంటూరు
ప్రజా సంకల్పయాత్రలో జగన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


అగ్రిగోల్డ్ భూములను చంద్రబాబు బినామీగా ఉన్న మంత్రి పుల్లారావు కొనుగోలు చేసి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఆరోపించారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలంలో బుధవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట కళామందిర్ సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో జగన్ మాట్లాడారు. పుల్లారావు, లోకేష్ నీకింత.. నాకింత అనే రీతిలో పంచుకుంటున్నారని అన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు చిలకలూరిపేట అడ్డాగా మారిందని, పుల్లారావు రేషన్ అక్రమాలపై వార్తలు రాసిన ఇద్దరు విలేకర్లను వేధించారని, ఒకరిని కొట్టి చంపారని, మరొకరిని ఆత్మహత్య చేసుకునే పరిస్థితి కల్పించారని అన్నారు. అవినీతి, అక్రమాలు, పేదలపై దౌర్జన్యాలు ఈ ప్రాంతంలో పెరిగిపోతున్నాయన్నారు. చిలకలూరిపేట కేంద్రంగా పుల్లారావు అనుకూలమైన దళారీలతో రూ.650 కోట్ల పత్తి కుంభకోణం జరిగినా ఒక్కరిపైనా చర్యలు లేవన్నారు. సాగర్ ఆయకట్టులో మూడేళ్లుగా వరికి నీరివ్వకున్నా అధికార పార్టీ వారు నోరుపెదపరని, రైతుల ప్రయోజనాలు వారికి పట్టవని అన్నారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, నకిలీ కారం, పాలు ఇతర అన్ని రకాల ఉత్పత్తులు కల్తీ చేసి పాలకులు ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నీరు-చెట్టు పేరుతో దోపిడీ

నిరుపేదలు, దళితులకు గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను చెరువులుగా మార్చేందుకు తవ్వేసి మట్టి అమ్ముకుని రూ.కోట్లు దండుకున్నారని జగన్ విమర్శించారు. చిలకలూరిపేట మండలం యడవల్లిలో 426 ఎకరాలను ఏక పట్టాగా దళితులకిచ్చిన భూమిలో గ్రానైట్ పడిందని, ఆ భూములను కాజేసేందుకు మంత్రి పుల్లారావు తన అనుచరులతో కుట్ర చేశారని చెప్పారు. నాదెండ్ల మండలం తూబాడు, గిరిజవోలు గ్రామాల్లో నీరు-చెట్టు పేరుతో భూములను తవ్వేశారన్నారు.

ఆకట్టుకున్న 'మన్య విప్లవం'

నేటితో ముగియనున్న నంది నాటకోత్సవాలు



రాజమహేంద్రవరంలో మన్య విప్లవం నాటికలోని సన్నివేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజమహేంద్రవరంలో నంది నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రదర్శించిన నాటికల్లో ఆడది అబల కాదు, ఓ ప్రేతాత్మా దిగిరా, మార్గదర్శి, మన్య విప్లవం, క్షణక్షణం ప్రేక్షక ఆదరణ పొందాయి. ఆనం కళాకేంద్రంలో ఈనెల 14న ప్రారంభమైన నంది నాటకోత్సవాలు గురువారంతో ముగియను న్నాయి. చివరిగా 'జాగా' సాంఘిక నాటకం ప్రదర్శించనున్నారు. గురువారం రాత్రి ఏడు గంటలకు ప్రదర్శించనున్న ఈ నాటకానికి బొక్కా శ్రీనివాసరావు రచన, దర్శకత్వం వహిస్తారు. ఈ నెల 14న ప్రారంభ పద్య నాటకంగా సారంగధరను ప్రదర్శించిన రాజరాజనరేంద్రుని పాలనా కాలాన్ని ఓ సారి గుర్తుచేయనున్నారు. భక్త అంబరీశ, దీపావళి పద్య నాటక ప్రదర్శనలు ప్రజల ను ఆకట్టుకున్నాయి. శివ సాన్నిధ్యం, శ్రీకృష్ణ రాయ బారం ఆనందింపజేశాయి. తొలిసారిగా బైబిల్‌లోని పాత నిబంధన గ్రంథం నుంచి యోబు చరిత్రను పద్యనాటకంగా ప్రదర్శించారు. మోహినీ భస్మాసుర, ద్రౌపదీ స్వయంవరం, గణపతి మహత్యం పద్య నాటకాలు ఆకట్టుకున్నాయి. విజన్ 240, విధాత, మా ప్రేమకు న్యాయం కావాలి, సహజీవనం, ఈ ఇల్లు అద్దెకు ఇవ్వబడును, పుత్రాగ్ని, ఆగమ్యగోచరం, పితృ విలాపం, బోధ్రాయి, మళ్లీ కలిసి జీవ్దాం, బంధాల బరువెంత, ఎనిమిదో అడుగు సాంఘిక నాటికలు ఆలోచింప జేశాయి. పుటుక్కు జరజర డుబుక్కుమే, ఫ్రీడం ఫైటర్, చేయూత, ఆశలపల్లకిలో, ఐలవ్ మై ఇండి యా, ప్రేమించే వయసేనా సాంఘిక నాటికలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. గురువారం రాత్రి ఏడు గంటలకు ప్రదర్శించనున్న 'జాగా' నాటకంతో నంది నాటకోత్సవాలు ముగియనున్నాయి. కాకినాడలోని యంగ్ మెన్స్ హ్యాపీక్లబ్‌లో బుధవారం జరిగిన నంది నాటకోత్సవాల్లో ఊరి చివర ఇళ్లు సాంఘిక నాటకం ఆకట్టుకుంది. తనికెళ్ల భరణి రచించిన కొక్కొరోక్కో నాటిక ఆలోచింపజేసింది.

ఎఫ్ఆర్‌డిఐ బిల్లును ఉపసంహరించుకోవాలి

పిఎన్‌బి కుంభకోణంపై చర్యలు తీసుకోవాలి
ప్రజల సొమ్మును రక్షించాలి
ప్రభుత్వ బ్యాంకులను కాపాడాలి
బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక ధర్నా
సంఘీభావం తెలిపిన వామపక్ష ఎంపిలు
తపన్ సేన్, డి.రాజా, ప్రేమ్ చంద్రన్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎఫ్ఆర్‌డిఐ బిల్లును ఉపసంహరించుకోవాలని బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. బుధవారం నాడిక్కడ పార్లమెంట్ స్ట్రీట్‌లో బ్యాంకు ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ ధర్నాలో సిఐటియు ప్రధాన కార్యదర్శి, సిపిఎం ఎంపి తపన్ సేన్, సిపిఐ ఎంపి డి.రాజా, ఆరెస్పీ ఎంపి ప్రేమ్ చంద్రన్ పాల్గొని, సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా తపన్ సేన్ మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వ రంగ బ్యాంకులపై దుష్ప్రచారం జరుగుతోందని, దీనికి మోడీ ప్రభుత్వమే సారథ్యం వహిస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే పనిలో కేంద్ర ప్రభుత్వం ఉందని, అందుకనుగుణంగానే విధానాల రూపకల్పన ఉందని అన్నారు. సామాన్య ప్రజలకు కష్టనష్టాలను గురిచేసే పలు విధానాలకు మోడీ సర్కార్ పార్లమెంట్ వేదికగా రూపకల్పన చేస్తోందని, 90 శాతం ఎంపిలకు వాటి గురించి సరిగా తెలియడం లేదని అన్నారు. ఎఫ్ఆర్‌డిఐ బిల్లు ఎంత ప్రమాదకరమైందో పార్లమెంట్‌లో సిపిఎం ఎంపిలు తెలిపారని, అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మోసం పూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బ్యాంకులకు రుణాలు కట్టకుండా ఎగవేతకు పాల్పడినవారిపై కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకోలేదని, వారిని రక్షించే పనిలో ఉందని విమర్శించారు. రైతులు, కూలీలు, గ్రామీణులు అత్యధికంగా బ్యాంకులపై ఆధారపడుతున్నారని, వాటిని మూసి వేసి ప్రైవేట్ కంపెనీలకు అప్పగించాలని ప్రయత్నం జరుగుతోందని తెలిపారు.

డి.రాజా మాట్లాడుతూ పార్లమెంట్‌లో తాము ఈ అంశాన్ని లేవనెత్తుతామని, బిల్లును అడ్డుకునేందుకు తాము పార్లమెంట్‌లో ఇతర పార్టీలను కలుపుకొని పోరాడుతామని, మీరు పార్లమెంట్ బయట ఐక్యంగా పోరాటం చేయాలని సూచించారు. ప్రేమ్ చంద్రన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేటీకరణకు తలుపులు బార్లా తెరిచిందని, కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లో దేశాన్ని పెట్టాలని ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. "ప్రభుత్వ బ్యాంకులను రక్షించండి. ప్రజల సొమ్మును కాపాడండి. ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరణ చేయొద్దు, పంజాబ్ నేషనల్ బ్యాంకులో జరిగిన కుంభకోణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. పెద్ద మొత్తంలో రుణాలు తీసుకొని, చెల్లించని వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. వారి వద్ద నుంచి బకాయిలు వసూలు చేయాలి. సరియైన పత్రాలు లేకుండా పెద్దమొత్తంలో రుణాలు ఇచ్చిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలి. వేతన ఒప్పందంపై చర్చలు జరిపి, దాన్ని పూర్తి చేయాలి. ఎఫ్ఆర్‌డిఐ బిల్లును ఉపసంహరించుకోవాలి" వంటి డిమాండ్లతో ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక ఛైర్మన్ కెకె నాయర్, కన్వీనర్ సంజీవ్ కె. బండలీష్, ఏపి తెలంగాణ బెఫి నేతలు ఆర్.అజయ్‌కుమార్, బి.శ్రీనివాస్, వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎఐబిఈఎ, ఎఐబిఒసి, ఎన్‌సిబిఈ, ఎఐబిఒఎ, బిఈఎఫ్ఐ, ఐఎన్‌బిఈఎఫ్, ఐఎన్‌బిఒసి, ఎన్ఒబిడబ్ల్యు, ఎన్ఒబిఒ తదితర సంఘాల నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి చర్యలు

● ఏప్రిల్ 9 నుంచి 13 వరకు ఎపిపిఎస్‌సి స్క్రీనింగ్ టెస్ట్ : గంటా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,109 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తున్నామని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ భర్తీ ప్రక్రియలో ముందు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామని చెప్పారు. విజయవాడలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ పోస్టుల భర్తీకి ఐదుగురు మాజీ వైస్ ఛాన్స్‌లర్లతో హైపవర్ కమిటీని నియమించామని, రేషనలైజేషన్ విధానంలో పోస్టుల భర్తీకి ఆ కమిటీ సిఫార్సు చేసిందని మంత్రి తెలిపారు. మొత్తం 1,109 ఖాళీల్లో మొదటి దశగా 846 పోస్టులు, రెండో దశలో 263 పోస్టులకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ద్వారా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించాలని వైస్ ఛాన్స్‌లర్ల సమావేశంలో నిర్ణయించామన్నారు. గతంలోలా ఈ పోస్టుల భర్తీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఈ బాధ్యతను ఎపిపిఎస్‌సికి అప్పగిస్తున్నా మన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ కోసం 14 వర్సిటీల నుంచి 76,356 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఏప్రిల్ 9 నుండి 13 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటాయన్నారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 11 కేంద్రాలు ఉంటాయన్నారు. పేపర్-1లో టీచింగ్ అండ్ రిసెర్చ్ యాప్టిట్యూడ్ టెస్ట్ అందరికీ కామన్‌గా ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్లను ఈనెల 25 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68